తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

బుధవారం 29.04.2026 | సంపుటి : 12 సంచిక : 279 | పేజీలు : 12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




# ఫ్యూచర్ అంతా ఫ్యూచర్ సిటీదే..



**శంషాబాద్ కేంద్రంగా అమరావతి,బెంగళూరు, ముంబైలను అనుసంధానిస్తూ బులెట్ రైలు పరుగులు పెట్టబోతోంది : సీఎం రేవంత్**

## ఆదర్శ నగరాలతో పోటీపడేలా భవిష్యత్ నగరాన్ని తీర్చిదిద్దాలి

- ప్రపంచ దేశాలకు ధీటుగా నగర ప్రణాళిక
- ప్రజాప్రతినిధులు ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి
- జూన్ 2లోగా ఫ్యూచర్ సిటీ కార్యాలయం ప్రారంభించేలా చర్యలు
- 60 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం
- ఓఆర్ఆర్ పెద్ద అసెట్ కానుంది
- అంతర్జాతీయ స్థాయి బస్ టెర్మినల్
- మెట్రో విస్తరణతో అద్భుత కనెక్టివిటీ
- గ్రామాల ప్రజలు సిటీలో భాగం కావాలి
- ప్రజాప్రతినిధులు ఫ్యూచర్ సిటీ కోసం కృషి చేయాలి
- ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ నిర్మాణానికి సీఎం రేవంత్ శంకుస్థాపన

హైదరాబాద్(జనంసాక్షి): ఫ్యూచర్ సిటీ భవిష్యత్ తరాలకు వరమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందరి కృషితోనే ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఈ సిటీ నిర్మాణం అంత సులభం కాదన్నారు. అయితే పక్కా ప్రణాళికతో ప్రపంచ నగరాలకు దీటుగా నిర్మించబోతున్నామని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసే నగరంలో తమనూ మిగతా 2లో..

"ఫ్యూచర్ సిటీ పరిధి గ్రామాల సర్పంచ్‌ల వివరాలు తెప్పించుకోవాలి. తమ గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. ఆయా గ్రామాల్లో సభలు పెట్టి తీర్మానాలు చేసి.. కలెక్టర్, మంత్రికి పంపాలి. ఆయా గ్రామాలను ఫ్యూచర్ సిటీలో భాగం చేసే చర్యలు చేపడతాం. ఆదర్శ నగరాలతో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దుతాం ఈ ప్రాంతాన్ని అధనాతనంగా అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దాలనేదే ఈ ప్రభుత్వ లక్ష్యం. చరిత్ర గురించి ఆలోచన చేసినప్పుడు హైదరాబాద్ నగరాన్ని కుతుబ్‌షాహీలు మొదలు పెట్టి అదే విధంగా గొల్కొండ యాదవ రాజులు, నిజాం సర్కార్ ఆ తర్వాత బ్రిటీష్ వారితో కలిసి నిర్మించిన సికింద్రాబాద్, మనం నిర్మించుకున్న సైబరాబాద్‌లా ఈరోజు భారత్ ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దాలనుకుంటున్నాం. ప్రపంచంలో అభివృద్ధి చెందిన నగరాలను మనం ఆదర్శంగా తీసుకుంటున్నాం. ఎవరైతే అభివృద్ధి చెంది ఆదర్శంగా ఉంటారో వారితోనే పోటీ పడాలనేది మన ప్రభుత్వ విధానం"- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి


# నూతన డీజీపీగా సీవీ ఆనంద్

**ఉత్తర్వులు జారీచేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం**

**30న పదవీ విరమణ చేయనున్న శివధర్ రెడ్డి**



హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ కొత్త డీజీపీగా సీవీ ఆనంద్ ని యమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. యూ పీఎస్సీ ఎంపానెల్ సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. ప్రస్తుతం సీవీ ఆనంద్ హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఆయన డీజీపీగా ప్రమోషన్ పొందనున్నారు. ఈ బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఈ నియామకం అమల్లోకి వస్తుంది. తెలంగాణ ప్రస్తుత డీజీపీ కె. శివధర్ రెడ్డి ఈనెల 30వ తేదీన ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ పోలీస్ బాస్‌గా సీవీ ఆనంద్ నియమితులయ్యారు. ఏప్రిల్ నెలాఖరులో ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి పదవి విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో కొత్త డీజీపీ ఎంపిక అనివార్యమైంది. అందుకు రాష్ట్రంలోని సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్లు జాబితాను ఇటీవల యూపీఎస్సీ.. రాష్ట్ర ప్రభుత్వం పంపింది. ఆ జాబితా లో 1991 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్‌తోపాటు 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్యా మిశ్రా ఉన్నారు. వారిలో సీనియర్ అయిన సీవీ ఆనంద్‌ను రాష్ట్ర ప్రభుత్వం కొత్త డీజీపీగా ఎంపిక చేసింది.



# నేడే 'పది' ఫలితాలు

**మధ్యాహ్నం 2 గంటలకు వెల్లడించనున్న ప్రభుత్వ పరీక్షల విభాగం**

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో పదో తరగతి పరీక్షా ఫలితాల విడుదలకు ముహూర్తం ఖరారైంది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఫలితాలు వెల్లడించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం వెల్లడించింది. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు ఫలితాలను విడుదల చేయనున్నట్లు సమాచారం. మార్చి 14 నుంచి ప్రారంభమైన ప్రధాన పరీక్షలు ఈ నెల 13న పూర్తయ్యాయి. సుమారు 5.15 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు మిగతా 2లో..

## అమరావతి టూ హైదరాబాద్



# ఇక 70 నిమిషాలే..

**దక్షిణాదిన బుల్లెట్ ట్రైన్ కనెక్టివిటీని విస్తరిస్తున్నాం**

- ప్రకటించిన కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్
- మోదీ సర్కారుకు దక్షిణాదిపై ఏమాత్రం వివక్ష లేదని


విశాఖపట్నం(జనంసాక్షి): గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన కార్యక్రమంలో అశ్వినీ వైష్ణవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మోదీ సర్కారుకు దక్షిణాదిపై ఏమాత్రం వివక్ష లేదన్నారు. బుల్లెట్ రైళ్ల ద్వారా దక్షిణాది ముఖచిత్రం మారబోతోందన్నారు. అమరావతి, మిగతా 2లో..



## ఆలయాల అంతర్గత ఆచారాల్లోకి

# వెళ్లదల్చుకోలేదు

- రాజ్యాంగపరమైన ప్రశ్నలపైనే మా దృష్టి
- శబరిమలలో మహిళల ప్రవేశంపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ(జనంసాక్షి):శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయంలో మహిళల ప్రవేశం, ఇతర మత పరమైన ఆచారాలపై దాఖలైన రివ్యూ పిటిషన్లపై సుప్రీంకోర్టులో వాదనలు అత్యంత ఆసక్తికరంగా సాగుతున్నాయి. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది సభ్యుల భారీ రాజ్యాంగ ధర్మాసనం ఈ విచారణను చేపట్టింది. ఈ సందర్భంగా రాజ్యాంగ నైతికత, మతపరమైన విశ్వాసాల మధ్య జరుగుతున్న చర్చ దేశవ్యాప్తంగా ప్రాధాన్యత సంతరించుకుంది. విచారణ సందర్భంగా.. సుప్రీంకోర్టు ధర్మాసనం ఒక కీలకమైన అంశాన్ని స్పష్టం చేసింది. తాము కేవలం రాజ్యాంగపరమైన ప్రశ్నలపై మాత్రమే దృష్టి పెడుతున్నామని, వ్యక్తిగత ఆలయాల అంతర్గత ఆచారాల్లోకి వెళ్లదల్చుకోలేదని కోర్టు తెలిపింది. నిర్దిష్టమైన ఆలయ సంప్రదాయాల కంటే, మత స్వేచ్ఛకు సంబంధించిన ప్రాథమిక హక్కుల పరిధినే తాము సమీక్షిస్తున్నట్లు వెల్లడించింది. వాదనల సమయంలో ఒక మహిళా న్యాయవాది అస్సాంలోని కామాఖ్య ఆలయ ఉదాహరణను కోర్టు ముందు ఉంచారు. అక్కడ మహిళల రుతుస్రావాన్ని ఒక వేడుకగా జరుపుకొంటారని ఆమె వివరించారు. అదే సమయంలో, అక్కడ జరిగే జంతు బలులను ఆపాలని ఒక పిటిషనర్ కోరగా.. ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆ ప్రస్తావనను తోసిపుచ్చింది. సీనియర్ అడ్వకేట్ శ్రీధర్ పోతరాజు ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. 'మతపరమైన విశ్వాసాలను పరీక్షించేటప్పుడు నాస్తికుల అభిప్రాయాలను కోర్టు పరిగణనలోకి తీసుకోకూడదు' అని ఆయన వాదించారు. మతపరమైన హక్కులు కేవలం భక్తుల మిగతా 2లో..

## తెలంగాణలో భానుడి

# భగభగలు



- రాష్ట్రంలో ఉధృతంగా పెరుగుతున్న ఎండల తీవ్రత
- నిర్మల్ జిల్లా దస్తూరాబాద్‌లో అత్యధికంగా 46 డిగ్రీలు
- కొనసాగుతున్న హీట్‌వేవ్.. భారీగా విద్యుత్ వినియోగం

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో భానుడి భగభగలు కొనసాగుతున్నాయి. పలు ప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. నిర్మల్ జిల్లా దస్తూరాబాద్‌లో అత్యధికంగా 46 డిగ్రీలు నమోదైంది. డిచ్‌పల్లి(నిజామాబాద్)లో 45.9, సాత్నాల(ఆదిలాబాద్)లో 45.6, బాన్స్‌వాడ(కామారెడ్డి)లో 45.5 డిగ్రీలు నమోదైంది. ఇక హైదరాబాద్ పరిధిలో మేడిపల్లిలో 42.9, అబ్దుల్లాపూర్ మెట్‌లో 42.6, హిమాయత్‌నగర్‌లో 42.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఉష్ణోగ్రతలు భారీగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో బయటకు రావడం కష్టంగా మారింది. తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా 46 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఎండల తీవ్రత కారణంగా తెలంగాణలో విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. వడదెబ్బతో ముగ్గురు మృతి చెందగా, పిడుగుపాటుకు ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఇకపోతే దేశవ్యాప్తంగా హీట్‌వేవ్ కొనసాగుతున్నది. ఎండలు దంచికొడుతున్నాయి. చాలా చోట్ల అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి, కొన్ని చోట్ల వరుసగా గత కొన్ని రోజుల నుంచి ఎండ తీవ్రత 40 డిగ్రీలు దాటుతోంది. అయితే అదే స్థాయిలో విద్యుత్తు వినియోగం కూడా జరుగుతున్నది. సోమవారం ఒక్క రోజే దేశవ్యాప్తంగా గరిష్టంగా 255.85 గిగావాట్ల విద్యుత్తును వినియోగించినట్లు ప్రభుత్వం పేర్కొన్నది. ఎయిర్ కండీషనర్లు, డిజర్ట్ కూలర్లు అధికంగా వాడడం వల్ల విద్యుత్తు వినియోగం కూడా పీక్ స్థాయికి చేరుకున్నది. విద్యుత్తు శాఖ డేటా ప్రకారం సోమవారం సుమారు 256 గిగా వాట్ల విద్యుత్తు వినియోగం జరిగినట్లు తెలిసింది. ఈనెలలో విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరుగుతూ వచ్చింది. మిగతా 2లో..

## ఎన్ని అవాంతరాలు వచ్చినా.. మహిళా రిజర్వేషన్

# అమలు చేస్తాం

**ప్రతిపక్ష పార్టీల నీచ రాజకీయాల వల్లే చట్టం అమల్లోకి రాకుండా ఆగిపోయింది: ప్రధాని మోదీ**



వారణాసి(జనంసాక్షి):పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టడానికి తాము ఎంతగానో ప్రయత్నించామని ప్రధాని నరేంద్ర మోదీఅన్నారు. కాంగ్రెస్, ఎస్పీ వంటి ప్రతిపక్ష పార్టీల నీచ రాజకీయాల వల్లే ఆ చట్టం అమల్లోకి రాకుండా ఆగిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు అభివృద్ధి చెందడం, అసెంబ్లీలు, పార్లమెంట్‌లకు రావడం ప్రతిపక్షాలకు ఇష్టం లేదని..అందువల్లే 40 ఏళ్లుగా ఈ బిల్లును అడ్డుకుంటూనే ఉన్నారని అన్నారు. తమ తప్పులు కప్పిపుచ్చుకోవడానికి సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా.. మహిళా రిజర్వేషన్ అమలు చేయడానికి కృషి చేస్తూనే ఉంటామన్నారు. వారణాసిలో నిర్వహించిన సభలో ప్రధాని మోదీ ఈ మేరకు ప్రసంగించారు. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయడమనే మహా యజ్ఞం ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నానని..అందుకు మాతృమూర్తుల ఆశీస్సులు తీసుకునేందుకు వారణాసి వచ్చానని ప్రధాని పేర్కొన్నారు. ఈ బిల్లును తేవడానికి చేస్తున్న ప్రయత్నాల్లో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని..ఇది రాజకీయ పార్టీల కోసం తెచ్చింది కాదని అన్నారు. సాధారణ కుటుంబాల మహిళలు పార్లమెంటు, అసెంబ్లీలకు రావాలని కోరుకున్నానని తెలిపారు. కానీ ప్రతిపక్షాలు మాత్రం అధికారం తమ కుటుంబాలకే పరిమితం కావాలని కోరుకుంటున్నాయని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్లపై తమ పోరాటం ముగిసిపోలేదని, చట్టాన్ని అమలు చేసే వరకు పోరాడుతూనే ఉంటామన్నారు. కాగా నరేంద్ర మోదీ సిక్కిం రాష్ట్ర రాజధాని మిగతా 9లో..

# ప్రశ్నిస్తే కేసులు పెడతారా?

- సీసీ కెమెరాలను సైతం హ్యాక్ చేస్తున్నారు
- అలాంటి పోలీస్ అధికారులను వదలం: హరీశ్



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచు కుపడ్డారు. రేవంత్ మూర్ఖత్వం.. హిట్లర్‌ను మించి పోయిందని మండిప డ్డారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో ఆర్డినేట ర్‌పై దాడి కేసులో జైల్లో ఉన్న బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నే క్రిశాంక్‌ను హరీశ్ పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మా ట్లాడుతూ.. కొంత మంది ఐపీఎస్‌లు తమ ఫోన్ లను.. ఇంటి ముందున్న సిసి కెమెరాలను హ్యాక్ చేస్తున్నారని ఆరోపించారు. బెంగళూరు నుంచి హ్యాకర్లను తీసుకొచ్చి తమపై నిఘా పెడుతు న్నారన్నారు. వార్త 3 లో



# ఒపెక్, ఒపెక్+కు గుడ్‌బై

**యూఏఈ సంచలన నిర్ణయం • పశ్చిమాసియాలో మరో కీలక పరిణామం**

దుబాద్(జనంసాక్షి): పశ్చిమాసియాలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. గల్ఫ్ దేశమైన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సంచలన నిర్ణయాన్ని ప్రకటించింది. చమురు ఉత్పత్తి చేసే దేశాల కూటమి అయిన ఒపెక్, ఒపెక్+ నుంచి బయటకొస్తున్నట్లు తెలిపింది. మే 1 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి రానుంది. చమురు ఎగుమతి దేశాల కూటమికి, దానికి నాయకత్వం వహిస్తున్న సౌదీ అరేబియాకు ఇది అతిపెద్ద దెబ్బగా విశ్లేషకులు పేర్కొంటున్నారు.ఆర్గనైజేషన్ ఆఫ్ ది పెట్రోలియం ఎక్స్‌పోర్టింగ్ కంట్రీస్‌లో చాలా ఏళ్లుగా యూఏఈ సభ్యదేశంగా ఉంది. ఒపెక్ ఏర్పాటైన ఏడేళ్ల తర్వాత 1967లో ఒపెక్‌లో చేరిన యూఏఈ.. సౌదీ అరేబియా, ఇరాక్ తర్వాత మూడో అతిపెద్ద చమురు ఎగుమతిదారుగా ఉంది. ఒపెక్ నిర్ణయాల్లో కీలకంగా వ్యవహరిస్తూ వస్తోంది. సుదీర్ఘకాలంపాటు సభ్యదేశంగా కొనసాగిన యూఏఈ.. అనూహ్యంగా ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక కారణమేంటన్నది వెల్లడించలేదు. దేశ ప్రయోజనాల రీత్యా ఈ నిర్ణయం మిగతా 2లో..

# పెట్రో ధరల పెంపు లేదు




- అసత్య ప్రచారాలు నమ్మొద్దు : కేంద్రం ప్రకటన
- తెలంగాణలో సమృద్ధిగా పెట్రోల్, డీజిల్ నిల్వలు
- అనవసర భయాందోళనలకు గురి కావద్దు
- పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

న్యూఢిల్లీ/హైదరాబాద్(జనంసాక్షి):ఏప్రిల్ 29న పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసిన అనంతరం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతారన్న ఊహాగానాలను కేంద్రం తోసిపుచ్చింది. పెట్రోల్, డీజిల్ ధరలను పెంచే ప్రణాళికలేవీ ప్రభుత్వం వద్ద లేవని పెట్రోలియం, సహజవాయు మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ వెల్లడించారు. పశ్చిమాసియాలో తాజా పరిణామాలపై మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. దేశంలో పెట్రోల్, డీజిల్ నుంచి ఎల్పీజీ, విమాన ఇంధనం వరకు అన్ని రకాల ఇంధనాల నిల్వలు తగినంతగా ఉన్నాయని స్పష్టం చేశారు."పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే ప్రతిపాదన ఏమీ లేదు. కొన్ని ప్రాంతాల్లో భయాందోళనలతో ఇంధనం కొనుగోలు చేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. అన్ని రాష్ట్రాలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు చేస్తున్నాం. రిటైల్ ఔట్‌లెట్‌లను పర్యవేక్షించడంతోపాటు బంకుల్లో సరఫరాకు ప్రాధాన్యం ఇస్తున్నాం. తద్వారా ఇంధన కొరత ఏర్పడకుండా చూస్తున్నాం. ఎల్పీజీ, పెట్రోల్, డీజిల్ నిల్వలు కూడా తగినంత మేర ఉన్నాయి" అని సుజాత శర్మ వెల్లడించారు. వీటికి సంబంధించి వస్తున్న వదంతులు నమ్మవద్దని, ఆందోళనలతో ఎక్కువగా కొనుగోలు చేయొద్దని విజ్ఞప్తి చేశారు.కాగా రాష్ట్రనీలో పెట్రోల్, డీజిల్ నిల్వలు, సరఫరా సమృద్ధిగా ఉన్నట్లు పౌర సరఫరాల శాఖ మిగతా 2లో..

## కేంద్రం నుంచి తెలంగాణకు సహకారం ఇవ్వండి

**రాష్టానికి రావాల్సిన సాయం త్వరగా అందించండి • కేంద్రమంత్రి రాజీవ్ రంగన్ సింగ్‌తో వాకిటి భేటీ**



# బెంగాల్‌లో నేడు మలిదశ పోలింగ్

- ఓటింగ్‌కు భద్రత కల్పించండి
- ఎన్ఐఏకు ఈసీ విజ్ఞప్తి
- అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు

కోల్‌కతా(జనంసాక్షి):పశ్చిమ బెంగాల్‌లో బుధవారం జరగనున్న రెండో దశ పోలింగ్‌కు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సమస్యాత్మక ప్రాంతాల్లో భారీగా భద్రతను మోహరించింది. అయితే, పోలింగ్‌కు కొన్ని రోజుల ముందు రాష్ట్రంలో నాటు బాంబులు లభించడం, స్వల్ప పేలుడు ఘటనల నేపథ్యంలో ఈసీ అప్రమత్తమైంది. కార్యకర్తలను లక్ష్యంగా చేసుకోవడం, ఓటింగ్‌కు అంతరాయం మిగతా 2లో..

## నేడే 'పది' ఫలితాలు

**మధ్యాహ్నం 2 గంటలకు వెల్లడించనున్న ప్రభుత్వ పరీక్షల విభాగం**

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో పదో తరగతి పరీక్షా ఫలితాల విడుదలకు ముహూర్తం ఖరారైంది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఫలితాలు వెల్లడించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం వెల్లడించింది. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు ఫలితాలను విడుదల చేయనున్నట్లు సమాచారం. మార్చి 14 నుంచి ప్రారంభమైన ప్రధాన పరీక్షలు ఈ నెల 13న పూర్తయ్యాయి. సుమారు 5.15 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ నెల 23వ తేదీతో జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తయింది. మే మొదటి వారంలో ఫలితాలు విడుదల చేస్తామని ముందు నుంచి చెబుతున్నా... తాజాగా ఈనెల 29న విడుదల చేసేందుకు రంగం సిద్ధమైంది. దీంతో పరీక్షల విభాగం అన్ని ఏర్పాట్లు చేసింది.

## ఆలయాల అంతర్గత ఆచారాల్లోకి వెళ్లదల్చుకోలేదు

కోణం నుంచే చూడాలని, ఆచారాల పట్ల నమ్మకం లేని వారి వాదనలకు ఇక్కడ తావు లేదని ఆయన కోర్టుకు విన్నవించారు. ఆధ్యాత్మిక స్వేచ్ఛ అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్-21 (జీవించే హక్కు)లో అంతర్భాగమని శ్రీధర్ పోతరాజు వాదించారు. మతపరమైన ఆచారాల్లో న్యాయస్థానాల జోక్యానికి ఖచ్చితమైన పరిమితులు ఉండాలని న్యాయవాదులు కోరారు. వ్యక్తిగత విశ్వాసాలకు, రాజ్యాంగ నైతికతకు మధ్య ఉన్న సమతుల్యతపై సుదీర్ఘ చర్చ కొనసాగుతోంది.

## బెంగాల్‌లో నేడు మలిదశ పోలింగ్

కలిగించేందుకు దుండగులు బాంబులను ఉపయోగించే ప్రమాదం ఉందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని జాతీయ దర్యాప్తు సంస్థకు సూచించింది. రాష్ట్రంలో పోలింగ్ రోజున, పోలింగ్ తర్వాత ఎటువంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది.దక్షిణ పరగణాలు జిల్లాలోని భాంగర్ ప్రాంతంలో ఇటీవల ఓ ఇంట్లో అనేక నాటు బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన ఎన్ఐఏ, ముమ్మర దర్యాప్తు చేపట్టింది. ఇదిలాఉంటే, రాష్ట్రంలో మొత్తం 294 శాసనసభ స్థానాలకు గాను 152 చోట్ల తొలి దశలో ఈ నెల 23న పోలింగ్ పూర్తైంది. మిగిలిన 142 స్థానాల్లో బుధవారం రెండో దశ పోలింగ్ జరగనుంది. ఈ 142 స్థానాల్లో గత ఎన్నికల్లో టీఎంసీనే 123 చోట్ల విజయం సాధించగా.. భాజపా 18, ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ ఒకచోట గెలిచాయి.

## పెట్రో ధరల పెంపు లేదు

కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం 27 వ తేదీన డిమాండ్ ను మించి పెట్రోల్ , డీజిల్ లను 29,939 కిలో లీటర్లు సరఫరా చేసినట్లు వివరించారు. సగటున రోజుకు 5,883 కిలో లీటర్లు పెట్రోల్, 7,348 కిలో లీటర్లు డీజిల్ కు డిమాండ్ ఉండేదని ఆయన తెలిపారు. కానీ 27 వ తేదీన 11,490 కిలో లీటర్లు పెట్రోల్, 18,449 కిలో లీటర్లు డీజిల్ ను వాహనదారులకు సరఫరా చేసినట్లు తెలిపారు. సరఫరాను క్షేత్ర స్థాయి అధికారులు, పెట్రోల్ కంపెనీల ప్రతినిధులతో రెగ్యులర్ గా మానిటరింగ్ చేస్తున్నట్లు తెలిపారు. అపోహలతో పెట్రోల్, డీజిల్ ను నిల్వచేసుకోవద్దని వినియోగదారులకు పౌర సరఫరాల శాఖ కమిషనర్ సూచించారు.

## ఒపెక్, ఒపెక్+కు గుడ్‌బై

తీసుకుంటున్నట్లు తెలిపింది.అయితే, భౌగోళిక ఉద్రిక్తతలు, ఉత్పత్తి పెంపు విషయంలో ఒపెక్‌లో తలెత్తిన అంతర్గత కలహాల నేపథ్యంలో యూఏఈ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇరాన్ దాడుల విషయంలో సౌదీ అరేబియా వంటి తన ప్రాంతీయ మిత్రదేశాలు సరైన రీతిలో స్పందించకపోవడం పట్ల యూఏఈ అసంతృప్తితో ఉంది. ఈ నేపథ్యంలో ఒపెక్ నుంచి యూఏఈ బయటకు వచ్చింది. దీనివల్ల భవిష్యత్‌లో ఒపెక్ బలహీనం అవుతుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇప్పటికే హర్మూజ్ మూసివేతతో చమురు ఎగుమతిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఒపెక్ దేశాలకు.. యూఏఈ రూపంలో మరో షాక్ తగిలింది.

## త్వరలో ఎస్400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్

**ఐదో దశ సిస్టమ్స్ సరఫరాకు రష్యా అంగీకారం**

న్యూఢిల్లీ(జనంసాక్షి): రష్యాకు చెందిన ఎస్400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ త్వరలో ఇండియాకు రానున్నాయి. ఇవి ఐదో దశ డిఫెన్స్ సిస్టమ్స్. ఇప్పటికే నాలుగోదశ ఎస్400 క్షిపణులు ఇండియాకు చేరాయి. వీటిని ఇండియా గతంలోనే ఉపయోగించింది కూడా. గత ఏడాది పాకిస్తాన్‌పై ఇండియా ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ దాడి సమయంలో భారత వాయుసేన.. ఎస్400 డిఫెన్స్ సిస్టమ్స్ ను ఉపయోగించింది. ఇప్పుడు ఎస్400 ఐదో దశలో ఇండియాకు అందించేందుకు రష్యా సిద్ధమైంది.వచ్చే నవంబర్ నెలలోనే ఇవి ఇండియాకు రానున్నట్లు సమాచారం. వచ్చే నెల మధ్యలో నాలుగో ఎస్ 400 క్షిపణి విధ్వంసక వ్యవస్థలు ఇండియన్ పోర్టుకు చేరుకుంటాయని సంబంధిత అధికారులు వెల్లడించారు. ఇండియా?రష్యాల మధ్య ఉన్న సైనిక సహకారం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్షిపణులు 400 కిలోమీటర్ల రేంజ్ కలిగి ఉన్నాయి. మరోవైపు కొత్తగా ఇంకో ఐదు ఎస్ 400 సిస్టమ్స్ కొనేందుకు కేంద్రం అంగీకరించింది. 400 కిలోమీటర్ల పరిధిలో భారత గగనతలంపైకి దూసుకొచ్చే క్షిపణుల్ని, విమానాల్ని ఇవి ధ్వంసం చేస్తాయి. ముఖ్యంగా పాకిస్తాన్ నుంచి సింధు నది ప్రాంతం నుంచి వచ్చే గగనతల దాడుల్ని ఇవి అడ్డుకుంటాయి. ఇప్పటికే భారత రక్షణ రంగ అధికారులు రష్యా సందర్శించి ఎస్400 సిస్టమ్స్ తనిఖీ చేశారు. కొత్తగా వచ్చే క్షిపణి విధ్వంసక వ్యవస్థను రాజస్థాన్?లో ఏర్పాటు చేయబోతున్నారు. గతంలో ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎస్ 400 క్షిపణి విధ్వంసక వ్యవస్థను ధ్వంసం చేసేందుకు పాకిస్తాన్ ప్రయత్నించింది. పంజాబ్, గుజరాత్లోని ఎస్400 డిఫెన్స్ సిస్టమ్స్ పై దాడికి విఫలయత్నం చేసింది. ఈ సిస్టమ్స్ వల్ల పాకిస్తాన్లోని వైమానిక స్థావరాలు సురక్షితం కాదని ఆ దేశం భావించింది. దీంతో స్థావరాల్ని మార్చేసినట్లు సమాచారం.

## ఇలాగైతే విమానాలను నడపలేం

**విమాన ఇంధన ధరలను అదుపు చేయండి**

**వెంటనే కేంద్రం జోక్యం చేసుకోవాలి**

**కేంద్ర విమానయాన శాఖకు ఎఫ్ఐఏ లేఖ**

న్యూఢిల్లీ(జనంసాక్షి): విమాన ఇంధన ధరల పెరుగుదలపై ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఎఫ్ఐఏ ఆందోళన వ్యక్తం చేసింది. విమాన ఇంధన ధరల్ని అదుపులోకి తెచ్చేందుకు కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరింది. ఈ మేరకు కేంద్ర విమానయాన శాఖకు మంగళవారం లేఖ రాసింది. కేంద్రం జోక్యం చేసుకుని విమాన ఇంధన ధరలు తగ్గించకుంటే విమానయానాన్ని కొంతకాలం మూసివేయాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఎఫ్ఐఏ సంస్థ ఇండిగో ఎయిర్‌లైన్స్, ఎయిర్ ఇండియా, స్పైస్ జెట్ వంటి సంస్థలకు ప్రతినిధిగా వ్యవహరిస్తుంది. తాజాగా ఆయా సంస్థల తరఫున కేంద్రానికి లేఖ రాసింది. ఎఫ్ఐఏ ప్రకారం.. ప్రస్తుతం అంతర్జాతీయ పరిణామాల వల్ల విమాన ఇంధన ధరలు భారీగా పెరిగాయి. దీంతో విమానయాన సంస్థలపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. విమాన ఇంధన ధరల పెరుగుదల వల్ల విమానాల నిర్వహణ కష్టమైపోతోంది. ఏటీఎఫ్ ధరలు చమురు సంస్థలకు అందుబాటులో లేకుండా పెరిగాయి. ఒక కిలోలీటర్ చమురుకు దాదాపు రూ.2 లక్షల వరకు ఖర్చవుతోంది. పశ్చిమాసియాలో క్రూడాయిల్ ధరలు పెరగడం వల్ల ఈ పరిస్థితి తలెత్తింది. సాధారణంగా ఎయిర్ లైన్స్ సంస్థల వ్యయంలో 30,40 శాతం ఇంధనానికి ఖర్చవుతుంది. కానీ, ప్రస్తుతం పరిస్థితుల్లో ధరల పెరుగుదలవల్ల ఈ ఖర్చు 55,60 శాతం పెరిగింది. అందుకే కేంద్రం త్వరగా జోక్యం చేసుకుని ధరలు తగ్గించాలని ఎఫ్ఐఏ కేంద్రాన్ని కోరుతోంది.



# ఫ్యూచర్ అంతా ఫ్యూచర్ సిటీదే



కలపాలని స్థానిక గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారని వెల్లడించారు. ప్రజల్ని అభివృద్ధిలో భాగస్వాములు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ చెప్పుకొచ్చారు. రంగారెడ్డి జిల్లా మీర్ఖాన్‌పేట్‌లో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ శంకుస్థాపన చేశారు. అలాగే పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మల్కాజ్‌గిరి కమిషనరేట్ భవనం, ఆక్టోపస్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, కుత్బుల్లాపూర్ డీసీపీ కార్యాలయాలను ప్రారంభించారు. గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికీ సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో చాలా మంది నేతలు హైదరాబాద్ అభివృద్ధిని కొనసాగించారని చెప్పారు. ఇప్పుడు నాలుగో నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు. జపాన్, జర్మనీ, సింగపూర్ వంటి దేశాల్లోని అత్యాధునిక నగరాల తరహాలో, భారత్‌లోనే నాలుగో నగరంగా దీన్ని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. 60 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం జరుగుతోందన్నారు. మనకున్న అద్భుతమైన ఆర్ఆర్ఆర్, ఐటీ ఎగుమతులు, కోవిడ్ వ్యాక్సిన్ తయారీలో మన ఘనతలే ఈ నగరానికి స్ఫూర్తి అని తెలిపారు. ఫ్యూచర్ సిటీ కోసం భూములిచ్చిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. ఈ నగర నిర్మాణానికి సహకరించే వారు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. వచ్చే జూన్ నెలలో ఫ్యూచర్ సిటీ కార్యాలయాన్ని ప్రారంభించబోతున్నామని తెలిపారు. సిటీ నిర్మాణానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని.. ప్రపంచంతో పోటీపడేలా నిర్మిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూన్ 2వ తేదీ లోపు ఫ్యూచర్ సిటీ భవన నిర్మాణం జరుగుతుందన్నారు. గతంలో హైటెక్ సిటీ అంటే అవహేళన చేశారని.. ఏ నగరానికీ లేని ఔటర్ రింగ్ రోడ్డు హైదరాబాద్‌కు ఉందన్నారు. మూడు కొవిడ్ వ్యాక్సిన్లు తెలంగాణలోనే ఉత్పత్తి అయ్యాయని గుర్తు చేశారు. యుద్ధ విమాన సర్వీస్ సెంటర్లు హైదరాబాద్‌లో ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచంతో పోటీపడేటా ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఫ్యూచర్ సిటీ కేవలం ఒక నగరం కాదు, ఇది రాబోయే తరాల తలరాతను మార్చే అద్భుతమన్నారు. ఈ నగర నిర్మాణం అంత సులభం కాదు. ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజల భాగస్వామ్యం ఉంటేనే ఇది సాధ్యమవుతుంది. ఫ్యూచర్ సిటీలో కలవాలనుకునే గ్రామాలు... గ్రామ సభల్లో తీర్మానం చేసి ముందుకు రావాలని సీఎం పిలుపునిచ్చారు. ప్రజా ప్రతినిధులు ఫ్యూచర్‌సిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. భవిష్యత్ తరాలకు అద్భుత నగరంగా ఫ్యూచర్ సిటీ విలసిల్లుతుందన్నారు. ఫ్యూచర్ సిటీ పరిధి గ్రామాల సర్పంచ్‌ల వివరాలు తెప్పించుకోవాలి. తమ గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. ఆయా గ్రామాల్లో సభలు పెట్టి తీర్మానాలు చేసి.. కలెక్టర్, మంత్రికి పంపాలి. ఆయా గ్రామాలను ఫ్యూచర్ సిటీలో భాగం చేసే చర్యలు చేపడతాం. ఆదర్శ నగరాలతో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దుతాం అని సీఎం అన్నారు. ఇకపోతే కేంద్రం దేశవ్యాప్తంగా ఏడు బులెట్ ట్రైన్లను ప్రకటిస్తే.. అందులో మూడు మన రాష్ట్రానికే రాబోతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. శంషాబాద్ కేంద్రంగా ముంబై, బెంగళూ రు, అమరావతి నగరాలను అనుసంధానిస్తూ బులెట్ రైళ్లు పరుగులు తీయబోతున్నాయని చెప్పారు. కేవలం రైళ్లే కాదు.. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో భారీ బస్సు టెర్మినల్‌ను కూడా మనం నిర్మించుకోబోతున్నామని రేవంత్ తెలిపారు. మెట్రో, బులెట్ ట్రైన్, అత్యాధునిక బస్ టెర్మినల్.. ఇవన్నీ ఒకే చోట ఏర్పాటు కాబోతున్నాయన్నారు. త్వరలోనే రంగారెడ్డి జిల్లా ఒక మహా అద్భుతానికి సాక్ష్యం కాబోతోందని చెప్పారు. తాను కూడా ఈ గడ్డ నుండే ఊరికి వెళ్తాను.. అందుకే మీపై ఉన్న అభిమానంతో, ఈ ప్రాంత భవిష్యత్తు కోసం అద్భుతమైన ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని చెప్పారు. ఫ్యూచర్ లేనివాడు ఫ్యూచర్ సిటీ అంటున్నాడని కొందరు అంటున్నారు... నా మీద ఏడ్చే వారికి నేను చెప్పేది ఒక్కటే.. మీరు ఏడ్చుకుంటూనే ఉండండి, నేను నా పని చేసుకుంటూనే పోతా.. మీ ఏడుపే నా చెవులకు వినిపించే మధుర సంగీతం అని రేవంత్ అన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు మహేందర్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎంపి వేం నరేందర్ రెడ్డి, డిజిపి శిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడే 'పది' ఫలితాలు

పరీక్షలు రాశారు. ఈ నెల 23వ తేదీతో జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తయింది. మే మొదటి వారంలో ఫలితాలు విడుదల చేస్తామని ముందు నుంచి చెబుతున్నా... తాజాగా ఈనెల 29న విడుదల చేసేందుకు రంగం సిద్ధమైంది. దీంతో పరీక్షల విభాగం అన్ని ఏర్పాట్లు చేసింది.

## కేంద్రం నుంచి తెలంగాణకు సహకారం ఇవ్వండి

న్యూఢిల్లీ(జనంసాక్షి): కేంద్రమంత్రి రాజీవ్ రంగన్ సింగ్‌తో వాకిటి శ్రీహరి భేటీ సందర్భంగా రాష్ట్రానికి రావాల్సిన సాయం తదితర అంశాలను ప్రస్తావించారు. రాజేంద్ర నగర్ లోని జాతీయ ఫిషరీస్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో కేంద్ర పశు సంవర్ధక పాడి పారిశ్రామికాభివృద్ధి మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌తో యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మత్స్య శాఖ డైరెక్టర్ నిఖిల, పశు సంవర్ధక శాఖ అధికారి లక్ష్మి నారాయణ తదితరులు ఆయన వెంట ఉన్నారు. పశు సంవర్ధక, పాడి, మత్స్య శాఖల్లో తెలంగాణ అమలు చేస్తున్న పథకాలను కేంద్రమంత్రికి మంత్రి వాకిటి శ్రీహరి వివరించారు. కేంద్రం నుంచి తెలంగాణకు సహకారం ఇవ్వాలని కేంద్రమంత్రిని కోరారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ను శాలువా, పూల బోకే, మెమోటెంతో ఘనంగా సన్మానించిన మంత్రి వాకిటి శ్రీహరి రాష్ట్రానికి కేంద్రం నుంచి కావలసిన సహకారం, ఆక్వా కల్చర్, లైఫ్ సైన్సెస్ లో ఇన్సూరెన్స్, మోపెడ్ కేటాయింపుల్లో న్యాయం వంటి పలు అంశాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.గోదావరి, కృష్ణా నదుల మధ్య ఉన్న 46 వేల పెద్ద చెరువులు, 26 వేల చిన్న చెరువులు, 100 రిజర్వాయర్ల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వం కేంద్రం నుంచి వచ్చే నిధులను తీసుకు రావడంలో విఫలమయింది.రాజేంద్ర నగర్ లో ఉన్న ఎన్ఎఫ్‌డిసిని తరలించమని కేంద్రమంత్రి హామీ ఇచ్చారని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. తరలింపుపై వస్తున్న ప్రచారంపై కేంద్రమంతి రాజీవ్ రంజన్ దృష్టికి మంత్రి వాకిటి శ్రీహరి తీసుకుపోయారు. దీనిని తరలించే ఆలోచన లేదని కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ తెలిపారు.

## చర్లపల్లి స్టేషన్ వద్ద భూమి కేటాయించండి

**సీఎం రేవంత్‌కు కిషన్ రెడ్డి లేఖ**

హైదరాబాద్(జనంసాక్షి): ఆధునీకరించిన చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద సౌకర్యల కోసం అవసరమైన భూ కేటాయింపులు చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. చర్లపల్లి రైల్వే స్టేషన్ దగ్గర రోడ్లు, పార్కింగ్ కోసం భూమి, సికింద్రాబాద్ స్టేషన్ రోడ్డు విస్తరణ గురించి లేఖలో ప్రస్తావించారు. చర్లపల్లి స్టేషన్ దగ్గర రోడ్లు ఇరుకుగా ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.. వాటిని విస్తరించాలని కోరారు. పార్కింగ్ కోసం స్టేషన్ దగ్గర అదనంగా 5 ఎకరాల భూమి కావాలన్నారు. అలాగే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద కూడా రోడ్లు ఇరుకుగా ఉన్నాయని.. విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

## లొంగిపోయిన మావోలకు పునరావాసం

**పర్యాటక శాఖలో గిరిదర్శక్ గైడ్లుగా శిక్షణ**

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో పునరావాసం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యలు ముగింపు దశకు చేరుకున్నాయి. పర్యాటక శాఖలో గిరి దర్శక్ గైడ్ల పేరుతో వారికి ఉద్యోగాలు కల్పించింది. వారంతా కర్రెగుట్టలు, భద్రాచలం, ములుగు జిల్లాల్లో విధులు నిర్వహించనున్నారు. అందుకోసం వారికి.. నెల రోజుల పాటు తెలంగాణ స్పెషల్ ఇంటిలిజెన్స్ బ్యూరో(ఎస్ఐబీ), పర్యాటక శాఖ సంయుక్తంగా శిక్షణ అందించాయి. ఈ శిక్షణ పూర్తి కావడంతో.. వారిని పర్యాటక శాఖలో కొలువుల్లోకి తీసుకున్నారు. దేశవ్యాప్తంగా మావోయిస్టులు లొంగిపోయి.. జన జీవన స్రవంతిలో కలిసి దేశాభివృద్ధికి పాటుపడాలని కేంద్రం పిలుపునిచ్చింది. అందుకోసం'ఆపరేషన్ కగార్'ను తెరపైకి తీసుకు వచ్చింది. లొంగిపోయిన మావోయిస్టు లకు నగదుతో పాటు పునరావాసం కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రకటించాయి. దీంతో ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ ప్రభుత్వాల ఎదుట భారీగా మావోయిస్టులు లొంగిపోయారు. తెలంగాణ ప్రభుత్వం.. వారిని గిరి దర్శక్ గైడ్లుగా పర్యాటక శాఖలో ఉద్యోగాలు కల్పించింది.

## 42శాతంతో జడ్పీటిసి, ఎంపిటిసి ఎన్నికలు నిర్వహించాలి


**రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్**

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను 42 శాతం బీసీ రిజర్వేషన్లతోనే నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బిజెపికి చెందిన రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య సోమవారం లేఖ రాశారు. విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి బీసీ వ్యతిరేక వైఖరిని మార్చుకుని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వాగ్దానం ప్రకారం 42శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లాలని సూచించారు. ప్రభుత్వం బీసీలను అణచివేసేందుకు ప్రయత్నించినప్పటికీ పంచాయతీ ఎన్నికలలో 53శాతం, మున్సిపల్‌లో 68 శాతం బీసీలు గెలిచి సత్తా చాటారని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్లపై కోర్టులో ఉన్న స్టేను ఎత్తివేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఎంను ఆయన కోరారు

## అమరావతి టూ హైదరాబాద్ ఇక 70 నిమిషాలే..

హైదరాబాద్, చెన్నై, బెంగళూరు మధ్య కనెక్టివిటీ పెరగబోతోందని చెప్పారు.“ బుల్లెట్ రైళ్లతో హైస్పీడ్ డైమండ్ ఏర్పాటుకాబోతోంది. హైస్పీడ్ డైమండ్ దక్షిణాది పట్ల మా నిబద్ధతకు తార్కాణం. దక్షిణాది పట్ల వివక్ష ఉందని విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. దానిని అభివృద్ధితో తిప్పికొడుతున్నాం. రైల్వేలు, హైవేలు, విద్యుత్, పోర్టులు ఇలా అన్ని రంగాల్లోనూ దక్షిణాదికి భారీ పెట్టుబడులు వస్తున్నాయి. మోదీ సర్కారు అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశాలు కల్పిస్తుంది. అమరావతి నుంచి హైదరాబాద్‌కు బుల్లెట్ ట్రైన్ రాబోతోంది. కేవలం 70 నిమిషాల్లో అమరావతి నుంచి హైదరాబాద్‌కు వెళ్లొచ్చు” అని అశ్వినీ వైష్ణవ్ అన్నారు.దేశం గర్వించే విజనరీ లీడర్ చంద్రబాబు అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ కితాబిచ్చారు. గతంలో సైబరాబాద్ నిర్మించారని, ఆయన నిర్మించిన సైబర్ టవర్ ఐటీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందన్నారు. మరోసారి చంద్రబాబు నేతృత్వంలో విశాఖపట్నం.. ఐటీపట్నం కాబోతోందని ధీమా వ్యక్తంచేశారు. విశాఖ జిల్లా తర్లువాడలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ నిర్మాణానికి భూమి పూజ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. “పీఎం మోదీ, సీఎం చంద్రబాబు విజన్‌కు సెల్యూట్ చేస్తున్నా. యువనేత లోకేశ్ ఎనర్జీ నాయకత్వం అద్భుతం. సమస్యలకు పరిష్కారం చూపడంలో యువనేతలకు ఆయన ఆదర్శం. ఏఐ డేటా హబ్ ప్రాజెక్టు నిర్మాణంపై లోకేశ్‌కు చక్కటి స్పష్టత ఉంది. తయారీ రంగంలోనూ నూతన ఆవిష్కరణలు వస్తున్నాయి.గూగుల్ వంటి పెద్ద సంస్థలు విశాఖకు రావడం శుభపరిణామం. కేంద్రం నుంచి సహకారం అందించడంలో వెనకడుగు లేదు. మారుతున్న కాలంలో ఎలక్ట్రానిక్స్ తయారీ అత్యంత కీలకంగా మారింది. ఎలక్ట్రానిక్స్ తయారీ హబ్‌గా ఇప్పుడు భారత్‌ను ప్రపంచం గుర్తిస్తోంది. ఎలక్ట్రానిక్స్ సరఫరా గొలుసులో ఇప్పుడు భారత్‌ది కీలకపాత్ర. సెమీ కండక్టర్ల తయారీ ప్రపంచంలో కీలకపాత్ర పోషిస్తోంది. డాలర్ విలువైన చిప్ దొరకకపోతే మిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తి ఆగిపోతుంది. డబులింజిన్ సర్కారులో ఏపీకి రైల్వే నిధులు భారీగా పెరిగాయి. గతంలో ఉమ్మడి ఏపీలో కేవలం రూ.800 కోట్ల రైల్వే నిధులు వచ్చేవి. ఇప్పుడు ఒక్క ఏపీకే రూ.10వేల కోట్లకు పైగా నిధులు వస్తున్నాయి. ప్రస్తుతం రూ.లక్షల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు ఏపీకి ఉన్నాయి. రైల్వే నెట్‌వర్క్‌లో ఏపీలో వందశాతం ఎలక్ట్రిఫికేషన్ పూర్తయింది. జూన్ 1న దక్షిణ కోస్తా రైల్వేజోన్ ప్రారంభమవుతుంది” అని అన్నారు.

## తెలంగాణలో భానుడి భగభగలు..




ఈ నెల రెండో అర్థభాగం నుంచి విద్యుత్తు మోత మోగుతున్నది. శుక్రవారం రోజు 252.07 గిగావాట్లు, శనివారం ఏప్రిల్ 25వ తేదీన 256.11 గిగావాట్ల వినియోగం జరిగినట్లు ప్రభుత్వం పేర్కొన్నది. అయితే గత ఆదివారం విద్యుత్తు వినియోగం తగ్గింది. ఆదివారం 238.15 గిగావాట్ల విద్యుత్తును వినియోగించారు. కమర్షియల్, ఇండస్ట్రియల్ కంపెనీలు ఎక్కువగా సెలవు తీసుకోవడం వల్ల ఆదివారం విద్యుత్తు వినియోగం తగ్గినట్లు అంచనా వేశారు. దీంతో పాటు కొన్ని చోట్లు డస్ట్ స్టార్మ్, వర్షాలు పడడం వల్ల ఆదివారం వినియోగం తగ్గింది. గత ఏడాది అత్యధికంగా విద్యుత్తు వినియోగం జూన్‌లో రికార్డు అయ్యింది. 2025 జూన్‌లో ఓ రోజు గరిష్టంగా సుమారు 242.77 గిగావాట్ల విద్యుత్తును వినియోగించారు. 2024లో గరిష్టంగా 250గిగావాట్ల విద్యుత్తును మే నెలలో వాడారు. ఇక 2023లో సెప్టెంబర్‌లో సుమారు 243.27 గిగావాట్ల విద్యుత్తును వినియోగించారు. ఈ ఏడాది వేసవిలో ఎండలు మండనున్నట్లు ఐఎండీ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది గరిష్టంగా 270 గిగావాట్ల విద్యుత్తు వినియోగం జరిగే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ నిపుణులు చెబుతున్నారు.

## కేజ్రీవాల్ బాటలో సిసోడియా

**హైకోర్టు విచారణకు హాజరుకాబోనంటూ లేఖ**

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ రూట్లోనే ఆ పార్టీ నేత మనీష్ సిసోడియా వెళుతున్నారు. ఢిల్లీ లిక్కర్ కేసులో.. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వరణ కాంత శర్మ ముందు హాజరుకాబోనన్నారు. ఈ నేపథ్యంలో ఆయన మంగళవారం జస్టిస్ స్వరణ కాంతకు లేఖ రాశారు. జస్టిస్ స్వరణ శర్మ కోర్టులో ఈ కేసు ముందు హాజరాకాబోనని కేజ్రీవాల్ సోమవారం ఓ లేఖ రాసిన విషయం తెలిసిందే. వ్యక్తిగతంగా కానీ, న్యాయవాది ద్వారా కానీ ఆయన హాజరుకాబోనన్నారు. అయితే అదే తరహాలో ఇవాళ సిసోడియా కూడా లేఖ రాశారు. ప్రస్తుత పరిస్థితుల్లో న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదని సిసోడియా పేర్కొన్నారు. న్యాయ పక్రియపై తనకు నమ్మకం లేదన్నారు. ఇంకా ఆయన తన లేఖలో తీవ్ర విమర్శలు కూడా చేశారు.

## డ్రగ్స్ కేసులో రోహిత్ రెడ్డికి బెయిల్

**నేడు జైలు నుంచి విడుదల అయ్యే ఛాన్స్**


హైదరాబాద్(జనంసాక్షి): మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో గత మార్చి 14న రాత్రి రోహిత్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో మొత్తం ముగ్గురిని అరెస్ట్ చేసి జైలుకు పంపారు పోలీసులు. వారిలో పైలట్ రోహిత్ రెడ్డి, ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, వ్యాపారవేత్త నమిత్ శర్మ ఉన్నారు. రోహిత్ రెడ్డి తరపున మాత్రమే న్యాయవాదులు హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.బెయిల్ మంజూరు కావడంతో బుధవారం చంచల్‌గూడ జైలు నుంచి రోహిత్ రెడ్డి విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మార్చి 14న మొయినాబాద్ ఫాంహౌస్‌లో దాడులు చేసిన పోలీసులు.. కొకైన్, లిక్కర్ బాటిళ్లు, స్వాధీనం చేసుకున్నారు. పార్టీలో పాల్గొన్న 11 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. వారిలో ఆరుగురికి డ్రగ్స్ పాజిటివ్‌గా తేలింది. ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి.. ఒక నెలకు పైగా చంచల్‌గూడ జైలులో ఉన్నారు. ఎపికి చెందిన ఓ ఎంపి కూడా దొరికినా స్టేషన్ బెయిల్‌తో బయటకు వచ్చారు.

**ఇరాన్ ఎయిర్‌లైన్స్‌తో లావాదేవీలు జరిపితే..**

## ఆంక్షలు తప్పవు

**విదేశీ కంపెనీలకు అమెరికా హెచ్చరికలు**

వాషింగ్టన్(జనంసాక్షి):ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచేందుకు అమెరికా తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇరాన్ విమానయాన సంస్థలతో ఎలాంటి లావాదేవీలు జరపవద్దని విదేశీ కంపెనీలకు యూఎస్ ట్రెజరీ సూచించింది. అలాకాక ఎవరైనా లావాదేవీలు జరిపితే.. వారు కూడా ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఎక్స్‌లో ఈ మేరకు పోస్టు పెట్టారు. ఇప్పటికే ఆంక్షలు ఎదుర్కొంటున్న ఇరాన్ విమానయాన సంస్థలతో లావాదేవీలు జరిపితే.. ఆయా సంస్థలు ఆంక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుందని బెసెంట్ హెచ్చరించారు. విదేశీ ప్రభుత్వాల పరిధిలో ఉన్న కంపెనీలు ఇరాన్ విమానాలకు జెట్ ఇంధనం, క్యాటరింగ్, ల్యాండింగ్ ఫీజులు, నిర్వహణ వంటి సేవలను అందించకుండా ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నిర్వహణ వంటి సేవలను అందించకుండా ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.ఎకనామిక్ ఫ్యూరీ కింద ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడిని తీవ్రతరం చేసేందుకు ఎలాంటి చర్యలకైనా యూఎస్ ట్రెజరీ వెనకాడదన్నారు. ఇప్పటికే హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ నౌకల రాకపోకలపై అమెరికా దిగ్బంధనాన్ని కొనసాగిస్తోంది. ఇది టెహ్రాన్ ఆర్థిక పరిస్థితిపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది. మరోవైపు అమెరికా- ఇరాన్ మలివిడత చర్చలపై అనిశ్చితి నెలకొన్న వేళ.. తాజా హెచ్చరికలు రావడం గమనార్హం.



# మహిళా సర్పంచుల ఫోరం రాష్ట్ర కన్వీనర్‌గా గుంటిపల్లి రేణుక




**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్ర మహిళా సర్పంచుల ఫోరం కన్వీనర్‌గా గుంటిపల్లి రేణుక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ లోని సెక్రటేరియట్ ఆవరణలో జరిగిన మహిళా సర్పంచ్‌ల సమావేశంలో మహిళా సర్పంచ్ లందరూ కలిసి రేణుకను కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. ఎంబీసీ, సంచార జాతుల సామాజిక నేపథ్యం గల గుంటిపల్లి రేణుక ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామం నుండి భారీ మేజార్టీతో ఎన్నికయ్యారు. ఈ సారి తెలంగాణ పంచాయతీల్లో దాదాపు 50 శాతం సర్పంచ్ స్థానాలు మహిళలకే దక్కాయి. రాష్ట్రంలో మొత్తం 12,703 గ్రామాల్లో 6403 మంది మహిళా సర్పంచ్ లే ఉన్నారు. గ్రామ పంచాయతీల్లోని సమస్యలు, ముఖ్యంగా గ్రామాల్లోని మహిళలపై, మహిళా సర్పంచ్ ల ప్రాదాన్యాలపై మహిళా సర్పంచ్‌ల ఫోరం పనిచేస్తుంది. మండల, జిల్లా కమిటీల ఎన్నిక అనంతరం హైదరాబాద్ లో రాష్ట్ర మహిళా సర్పంచ్ ల ఫోరం పూర్తి స్థాయి కమిటీని ఎన్నిక ఉంటుంది. ఈ లోగా మహిళా సర్పంచ్ ల ఫోరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి సమస్యలపై అధ్యయనం చేస్తుంది. పూర్తి స్థాయి రాష్ట్ర కమిటి ప్రకటన వరకు రేణుక కన్వీనర్ గా వ్యవహరిస్తారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి మహిళా సర్పంచ్ లను ఏకం చేసి జిల్లా కమిటీలను, రాష్ట్ర కమిటిని అధికారికంగా నియమిస్తామని, ఇదే క్రమంలో సమస్యలపై చర్చించి పోరాటం చేస్తామని ఈ సందర్భంగా గుంటిపల్లి రేణుక చెప్పారు. గ్రామ పంచాయతీలు ఆర్థిక పరిపుష్టిని సాదించేందుకు నేరుగా నిధులు విడుదల చేయాలని, గ్రామాల్లో మహిళా సర్పంచ్ ల సాధికారిత కోసం ప్రభుత్వం చొరవ తీసుకునే విధంగా, మహిళా సర్పంచ్ ల వేతనం పెంచేవిదంగా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. నిత్యం గ్రామాల్లోనే ప్రజల మధ్య ఉంటూ ఇంటివలే ఊరిని చక్కదిద్దే బాద్యతలను కలిగిన మహిళా సర్పంచ్‌ల సమస్యలపై మరింత అధ్యయనం చేస్తున్నామని చెప్పారు.

# ఎన్ని కేసులు పెట్టినా భయపడేదే లేదు

## క్రిశాంక్ అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ కక్షసాధింపే..

- చట్ట విరుద్ధంగా పనిచేస్తున్న ఐపీఎస్ ఆఫీసర్లను రిటైరైనా వదిలిపెట్టం
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు
- సంగారెడ్డి సెంట్రల్ జైలులో రిమాండ్‌లో పరామర్శ



**సంగారెడ్డి టౌన్ ఏప్రిల్ 28 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపుతోనే బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలు, రైతుల ఇబ్బందులు, రాష్ట్ర అభివృద్ధిని గాలికొదిలేసి.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే గొంతులపై అక్రమ కేసులు, సిట్లు, కమిషన్లు వేస్తూ అణచివేసే కుట్ర చేస్తోందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా కంది సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌తోపాటు మరో ఏడుగురు పార్టీ కార్యకర్తలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మంగళవారం పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలు, రైతుల ఇబ్బందులు, రాష్ట్ర అభివృద్ధిని గాలికొదిలేసి.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే గొంతులపై అక్రమ కేసులు, సిట్లు, కమిషన్లు వేస్తూ అణచివేసే కుట్ర చేస్తోంది. రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలతోపాటు ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్యం కల్పిస్తామని చెప్పి నేడు నియంతలా వ్యవహరిస్తున్నారు. కేసీఆర్, బీఆర్ఎస్ నాయకత్వంపై ఫేక్ పోస్టులు పెడుతున్న వారి గురించి పోలీసులకు ఆధారాలతో సహా ఫోన్ అప్పగించి క్రిశాంక్ ఫిర్యాదు చేశారు. కానీ తప్పు చేసిన వారిని వదిలేసి, కంప్లైంట్ ఇచ్చిన క్రిశాంక్ నే అరెస్టు చేయడం అత్యంత దుర్మార్గమన్నారు. దొంగలను వదిలేసి ఫిర్యాదుదారులను జైల్లో పెట్టారన్నారు. క్రిశాంక్ పై నాన్ బెయిలబుల్ కేసులు ఎలా పెడతారని సాక్షాత్తూ మెజిస్ట్రేట్ పోలీసులను ప్రశ్నించారంటేనే మీ కక్షసాధింపు ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. అంగన్వాడీ ఫోన్ల కుంభకోణం, టెన్త్ పేపర్ లీక్, హెచ్‌సీయూ గచ్చిబౌలి భూములు, సోమ్ డిస్టిలరీస్ వ్యవహారం, మిస్ వరల్డ్ పోటీల్లో మిస్ ఇంగ్లాండ్ వివాదం.. ఇలా ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపినందుకే ఆయనపై వరుసగా కేసులు పెట్టారని అన్నారు. భారత పౌరులకు ప్రశ్నించే హక్కు లేదా? అని ప్రశ్నించారు. లగచర్లలో గిరిజనుల పైనా, మెదక్, సంగారెడ్డిలో మా నాయకులపైనా అక్రమ కేసులు బనాయించారని, రేవంత్ రెడ్డి ఇలా కేసులు పెట్టి మళ్లీ గెలుస్తాననుకుంటే అది హిట్లర్ ను మించిన మూర్ఖత్వమేనన్నారు.

'జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో కూర్చుని నేనే రాజు, నేనే మంత్రి అనుకుంటున్నావు. మీ అరాచకాలను గమనిస్తున్న రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెబుతారు. బెంగళూరు నుంచి ప్రైవేట్ హ్యాకర్లను తెచ్చి కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కూర్చోబెట్టారు. ప్రతిరోజూ బీఆర్ఎస్ నేతల ఫోన్లను, మా ఇళ్ల ముందున్న సీసీ కెమెరాలను చట్టవ్యతిరేకంగా హ్యాక్ చేస్తున్నారు. మా ఫోన్లు ట్యాప్ చేస్తున్న ఐపీఎస్ అధికారులకు ఇదే మా హెచ్చరిక. మా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయి. మేము అధికారంలోకి వచ్చాక రిటైర్ అయినా సరే మిమ్మల్ని ఎక్కడున్నా వదిలిపెట్టం. కచ్చితంగా విచారణ జరిపిస్తాం. చట్ట వ్యతిరేక పనులు చేస్తున్న ఐపీఎస్ అధికారులకు తగిన మూల్యం తప్పదు. అప్పుడు మిమ్మల్ని రేవంత్ రెడ్డి కూడా కాపాడలేడు. మీ సొంత డబ్బుతో అడ్వకేట్లను పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. కాబట్టి చట్టానికి లోబడి పనిచేయండి. క్రిశాంక్ ను జైల్లో పెట్టి రేవంత్ రెడ్డి వికృత ఆనందం పొందుతున్నాడు' అని అన్నారు. రైతులు 20 రోజులుగా కొనుగోలు కేంద్రాల దగ్గర పడిగాపులు కాస్తుంటే శనగలు, సన్ ఫ్లవర్ కొనే నాథుడే లేడని, మంత్రులు నిద్రపోతున్నారా? అని ప్రశ్నించారు. ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏం చేస్తోంది? అని ప్రశ్నించారు. ఎకరాకు కేవలం 26 క్వింటాళ్లు మాత్రమే కొంటామని మక్కలకు కొత్త షరతులు పెట్టి రైతులను ఇబ్బంది పెడుతున్నారని, 13 లక్షల ఎకరాల్లో పంట వస్తే కనీసం సగం కూడా కొనలేని దుస్థితిలో ఉన్నారని తెలిపారు. వడ్ల కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభం కాలేదని, వడ్లకు ఐదారు కిలోల తరుగు తీస్తున్నారని, మిల్లుల ముందు లారీలు నాలుగైదు రోజులుగా ఆగిపోతున్నాయని తెలిపారు. యాసంగి సన్నవడ్లకు బోనస్ ఇస్తారో ఇవ్వరో స్పష్టం చేయాలన్నారు. ఎండలో రైతులు మాడిపోతుంటే పట్టించుకునే తెలివి లేదా? రైతుల కష్టాలు మీకు పట్టవా? అని ప్రశ్నించారు. హరీష్‌రావు వెంట ఎమ్మెల్యే చింత ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, ఎర్రోళ్ల శ్రీనివాస్, పట్నం మాణిక్యం, మనోహర్ గౌడ్, డాక్టర్ శ్రీహరి, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘం భేటీ

## కొత్త వరివంగడాలను విడుదల చేసిన అధికారులు

**ఆదిలాబాద్, ఏప్రిల్ 28 (జనంసాక్షి) :** కొత్త వరి, సోయా వంగడాలను అధికారులు విడుదల చేశారు. ఉత్తర తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘం సమావేశం మంగళవారం ఆదిలాబాద్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా హాజరయ్యారు. గతేడాది చేపట్టిన విస్తరణ, 2026-2027 సంవత్సరానికి గాను వానాకాలం, యాసంగిలో చేపట్టనున్న కార్యక్రమాలను గురించి ఈ సమావేశంలో చర్చించారు. ఆయా జిల్లాల వ్యవసాయాధికారులు మాట్లాడుతూ జిల్లాల్లోని వాతావరణ పరిస్థితులు, సాగవుతున్న పంటలు, శాఖాపరంగా తీసుకుంటున్న చర్యలను వివరించారు. గతేడాది నిర్వహించిన సమావేశం సిఫారసులపై కార్యాచరణ నివేదికను కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా. బి.రాంప్రసాద్, ఉత్తర తెలంగాణ మండలాల్లో గతేడాది చేపట్టిన వివిధ విస్తరణ కార్యక్రమాల గురించి ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డా. ఎన్. రాంగోపాల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో ప్రొ. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డా. ఎం, బాల్ రాజ్, విస్తరణ సంచాలకులు డా. యాకాద్రి, వ్యవసాయ మిషనరేట్ ప్రతినిధి అనిత, ఉత్తర వ్యవసాయ విస్తరణ సలహా మండలి సభ్యుడు కె. నరసింహ నాయుడు, తెలంగాణ జిల్లాల వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

# రాజ్యాంగం రద్దుకు మోడీ ప్రయత్నాలు

## సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా



**నిర్మల్ (జనంసాక్షి) :** రాజ్యాంగం రద్దుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఫాసిస్ట్ పరిపాలన కొనసాగుతుందని, ప్రజాస్వామ్యాన్ని, ప్రాథమిక హక్కుల్ని కాల రాస్తున్నారని విమర్శించారు. దేశాన్ని కుల మత ఆధారంగా చీలుస్తూ ప్రజల్ని విభజిస్తూ పాలిస్తున్నారని తెలిపారు. ఫాసిస్టు శక్తుల ప్రమాదం పెరిగిందని లౌకిక శక్తులు వామపక్షాలు ఐక్యం కావాలని, ప్రజా పోరాటాలను ఉదృతం చేయాలని కోరారు. 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడులుగా తీసుకువచ్చారని, దీంతో కార్మికుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది అన్నారు. కనీస వేతనాలు ఉండవని, సమ్మె చేసే హక్కు కోల్పోతున్నారని, ఎన్నో ఏళ్లుగా సాధించుకున్న హక్కులు రద్దు చేయబడ్డాయని ఆయన అన్నారు. రైతులకు ద్రోహం చేసేలా నల్ల వ్యవసాయక చట్టాలను తీసుకువచ్చారని, గ్రామీణ కూలీలకు పేదలకు అన్యాయం చేస్తూ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని విబి రాంజీ పేరుతో మార్చి ద్రోహం చేశారని తెలిపారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని, విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నారని, వైద్యం పేదలకు అందకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు రక్షణ కరువైందని, 33 శాతం రిజర్వేషన్ అంటూ కేంద్ర ప్రభుత్వం నాటకాలు ఆడుతుందని విమర్శించారు. మహిళల పట్ల బిజెపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. అభివృద్ధి, సామాజిక న్యాయం కొరవడిందని, అన్ని రంగాల ప్రజలు వీధుల్లోకి పోరాటాల్లోకి వస్తున్నారని గుర్తు చేశారు. మే 1న అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని గ్రామ గ్రామాన నిర్వహించాలని, హక్కుల దినంగా పాటించాలని, కార్మికుల్లో ఐక్యత తీసుకువచ్చేలా ఐక్యతను ప్రదర్శించాలని కార్మిక లోకాన్ని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు సయ్యద్ మహమ్మద్, నియోజకవర్గ కార్యదర్శి కోంజెట్టి సంజీవ్, అఖిలభారత ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి మెంగ లక్ష్మి, యువజన సంఘం నాయకులు ముస్తాబ్ తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ కార్మికులకు వేతన బకాయిలు

- ఆరు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని ఆరోపణ

**మెదక్, ఏప్రిల్28 (జనంసాక్షి) :** మిషన్ భగీరథలో పని చేస్తున్న కార్మికులకు గత 6 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం సరైనది కాదని సీఐటీయూ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు అన్నారు. మంగళవారం చిలిపిచేడ్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు సరైన వేతనం ఇవ్వడం లేదని.. ఇచ్చే వేతనం కూడా 6 నెలలుగా రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వేతనాలు చెల్లించాలని లేనిపక్షంలో కార్మికులను ఐక్యం చేసి పోరాటం చేస్తామని తెలిపారు. కార్మికుల పనిగంటలను పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వారు తెలిపారు. 4 కొత్త లేబర్ చట్టాల అమలు కార్మికుల హక్కులను పెట్టుబడిదారులకు కట్టబెట్టడమే అవుతుందని అన్నారు. బ్రిటీష్ కాలం నుంచే కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 రకాల కార్మికచట్టాలను తొలగించడం సిగ్గు చేటు అని విమర్శించారు. దేశం మొత్తం కరోనాతో అతలాకుతలమవుతున్న సమయంలో (2019, 2020)లో నాలుగు కొత్త లేబర్ చట్టాలను తీసుకురావడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో సంపన్నులు పెరిగారని.. నిరంతరం కష్టపడుతున్న కార్మికులు మాత్రం రోడ్డున పడే దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మే డే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. దేశవ్యాప్తంగా మే 1 నుంచి 7వ తేదీ వరకు మేడే వార్షికోత్సవాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

# సింగరేణిని పదేళ్లలో దోచేశారు

- ఎటిఎంలా వాడుకుని వదిలేశారు
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దివాళా తయించారు
- కెసిఆర్ తీరుపై మండిపడ్డ మంత్రి వివేక్



**మంచిర్యాల, ఏప్రిల్28 (జనంసాక్షి) :** పదేళ్లలో సింగరేణి సంస్థను కేవలం ఒక ఏటీఎంలా వాడుకున్నారే తప్ప, కార్మికుల శ్రేయస్సును పట్టించుకోలేదని బిఆర్ఎస్ పాలకులపై మంత్రి వివేక్ మండిపడ్డారు. కొత్త గనుల కేటాయింపులో బీఆర్ఎస్ వైఫల్యం చెందిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సింగరేణిని గాడిన పెడుతున్నామని.. నేరుగా వేలంలో పాల్గొని కొత్త బొగ్గు గనులను దక్కించుకుంటున్నామని తెలిపారు. మంత్రి వివేక్ వెంకటస్వామి బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌పై నిప్పులు చెరిగారు. తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టడమే కాకుండా, సింగరేణిని ఏటీఎంలా వాడుకున్నారని ధ్వజమెత్తారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలో మీడియాతో మాట్లాడిన ఆయన.. రూ. 60 వేల కోట్ల అప్పుగా ఉన్న తెలంగాణను.. 8 లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని వివేక్ విమర్శించారు. ఇందులో భాగంగానే రామకృష్ణ పూర్ ఓపెన్ కాస్ట్ ఫేజ్-2 మైన్ మంజూరైన విషయాన్ని గుర్తుచేశారు. నాడు సింగరేణికి రావాల్సిన 25 వేల కోట్ల బకాయిలపై నోరు మెదపని కార్మిక సంఘాలు.. నేడు నెలకు 10 కోట్లు ఖర్చు చేస్తూ సోషల్ మీడియాలో ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మంత్రి మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ఒక అట్టర్ ఫ్లాప్ అని.. అందులో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాల్సిన బాధ్యత కేంద్రానిదేనని స్పష్టం చేశారు. గతంలో నడ్డా, అమిత్ షా వంటి వారు అవినీతి జరిగిందని ఆరోపించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు.

# ప్రైవేట్ సంస్థపై ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం కేసు

- కాలపరిమితి ముగిసినా కొత్త సంస్థకు డేటా బదిలీ చేయకుండా అడ్డంకులు
- సీసీఎస్ లో కేసు నమోదు, దర్యాప్తు వేగవంతం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** నమ్మకద్రోహం, డిజిటల్ ఆస్తుల దుర్వినియోగం, ప్రాజెక్ట్ హ్యాండోవర్‌కు అడ్డంకులు సృష్టించినందుకు ట్రాన్సాక్షన్ అనలిస్ట్స్(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ తో పాటు ఎండీ, సీఈవో శ్రీనివాసరావు కాటూరిపై ప్రభుత్వం కేసు నమోదు చేసింది. దీనికి సంబంధించి ఐటీ ఒ కమ్యూనికేషన్స్ శాఖలో ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఇఎస్‌డి) విభాగం, ట్రాన్సాక్షన్ అనలిస్ట్స్(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ పై సెంట్రల్ క్రైమ్ స్టేషన్ లో కేసు పెట్టింది. ఎకనామిక్స్ అఫెన్స్ వింగ్ కు చెందిన ఏసీపీ ఏ. రామ్ రెడ్డి ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసు ప్రభుత్వ ఆస్తుల దుర్వినియోగం, చట్టబద్ధ ప్రాజెక్ట్ హ్యాండోవర్‌ను ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం వంటి తీవ్ర ఆరోపణలపై నమోదు చేయబడింది.

ట్రాన్సాక్షన్ అనలిస్ట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను 2017 జనవరిలో జారీ చేసిన వర్క్ ఆర్డర్ ద్వారా రాష్ట్రానికి చెందిన డిజిటల్ ప్లాట్‌ఫామ్ అభివృద్ధి, నిర్వహణ కోసం నియమించారు. ఈ ప్రాజెక్ట్ కోసం ప్రభుత్వం సుమారు రూ. 70 లక్షలు అభివృద్ధి, అమలు ఖర్చులుగా చెల్లించడంతో పాటు, అమల్లోకి వచ్చిన తర్వాత ప్రతినెల నిర్వహణ చార్జీలు కూడా చెల్లించింది. ఒప్పంద నిబంధనల ప్రకారం, కాలపరిమితి ముగిసిన తరువాత ప్రాజెక్టుకు సంబంధించిన మొత్తం డేటా, సోర్స్ కోడ్ తో పాటు డిజిటల్ ఆస్తులపై పూర్తి హక్కులు తెలంగాణ ప్రభుత్వానికి చెందాలి. అయితే మూడు సార్లు (2018 నుంచి 25 వరకు) అవే నిబంధనలతో పొడగింపు పొందిన ఈ సంస్థ కాలపరిమితి మే 31, 2025తో ముగిసింది. కొత్త సంస్థ ఎంపిక కోసం పారదర్శక టెండర్ ప్రక్రియను ప్రభుత్వం పిలిచింది. దీనిలో పర్వా ఇండియా కన్సల్టింగ్ అండ్ సర్వీసెస్ కంపెనీ సంస్థ ఎల్ 1 గా ఎంపికైంది. ట్రాన్సాక్షన్ అనలిస్ట్స్ సంస్థ కూడా ఈ టెండర్‌లో పాల్గొని, నిబంధనలను అంగీకరించింది. అయితే టెండర్‌లో విఫలమైన తర్వాత, సంస్థ తన వైఖరిని మార్చి సహకరించకుండా వ్యవహరించడం ప్రారంభించింది. తప్పుడు యాజమాన్య పత్రాలతో ప్రభుత్వానికి చెందిన డేటాను తమదిగా చెప్పే ప్రయత్నం చేసింది. కొత్త సంస్థకు హ్యాండోవర్ ప్రక్రియను ప్రారంభించినప్పటికీ, పదేపదే ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించింది. అలాగే నిధుల దుర్వినియోగంతో పాటు, యూజర్ డేటాను తమ ప్రైవేట్ అప్లికేషన్‌కు మళ్లించే ప్రయత్నం చేసింది. టెండర్ నిబంధనల ప్రకారం కొత్త సంస్థకు డేటా అందిస్తామని ముందుగా ఒప్పుకున్నా, తరువాత ఆ హామీని నిలబెట్టుకోలేదు. ఈ సంఘటనలపై ప్రభుత్వం తీవ్రంగా స్పందిస్తూ, ప్రజా ఆస్తులను రక్షించేందుకు, చట్టపరమైన చర్యలను పూర్తి స్థాయిలో అమలు చేయడానికి సీసీఎస్ లో కేసు నమోదు చేసింది. ట్రాన్సాక్షన్స్ సంస్థకు చెందిన ప్రస్తుత, మాజీ ఉద్యోగులందరికీ చట్టపరమైన నోటీసులు జారీ చేశారు. సంస్థలో చీఫ్ ఆఫ్ ప్రాజెక్ట్స్ గా పనిచేస్తున్న ఎం. శ్రీనివాసులును ఏప్రిల్ 25న పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోంది. ఇతర నిందితులైన సంస్థ ఎండీ, సీఈవో శ్రీనివాస రావు కాటూరి, ప్రాజెక్ట్ మేనేజర్ కిరణ్ కుమార్ ప్రస్తుతం పరారీలో ఉన్నారని సమాచారం. వారిని కూడా పట్టుకునేందుకు పోలీసులు చర్యలు ముమ్మరం చేశారు. ఈ విషయాన్ని ఐటీ శాఖ ప్రభుత్వానికి నివేదించగా, ఒప్పంద నిబంధనల ప్రకారం జరిమానాలు విధించడం, భవిష్యత్ టెండర్ల నుంచి బ్లాక్‌లిస్టింగ్ చేయడం, నష్టపరిహారం వసూలు చేయడం లాంటి చర్యలు ట్రాన్సాక్షన్స్ సంస్థపై పరిశీలనలో ఉన్నాయి. ప్రభుత్వ కార్యకలాపాలను దెబ్బతీసే ఎలాంటి సంస్థలపైనా కఠిన చర్యలు తీసుకునే విషయంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేసింది.

# తరుగుపేరుతో రైతుల లూటీ

- ఆందోళనకు దిగిన రైతులు

**నల్లగొండ, ఏప్రిల్ 28 (జనంసాక్షి) :** గట్టుప్పల్ మండలంలోని తెరట్పల్లి గ్రామంలో రైతు సేవా సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రం వద్ద రోడ్డుపై కూర్చొని రైతులు ధర్నా చేశారు. తేమ, తరుగు పేరుతో క్వింటాకు 8 కిలోలు కోత విధిస్తున్నారని వాపోయారు. ధాన్యం కోత వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. లారీలు రాక పోవడంతో మార్కెట్లో ధాన్యం నిల్వలు అలాగే ఉండిపోయాయని.. అకాల వర్షం పడితే రైతులు నష్ట పోతారని, వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. ధాన్యం తరుగును వెంటనే ఆపాలని, సకాలంలో కొనుగోళ్లు చేయాలని రైతులుడిమాండ్ చేశారు.

# రవీంద్రభారతిలో కథల రచనపై శిక్షణ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ సాహిత్య అకాడమీ తరఫున రవీంద్ర భారతిలో మంగళవారం ఉదయం నుండి కథలు రాయడంపై శిక్షణ ప్రారంభమైంది. కథలు రాయడానికి పోటీ పరీక్షలు పాస్ కావడానికి ఉద్యోగం లో నైపుణ్యం పెంచుకోవడానికి జీవితం అంతా రకరకాల శిక్షణలున్నాయి. సంసారం ఎలా చేయాలి జీవితం ఎలా గడపాలి పొదుపు ఎలా చేయాలి. భార్యాభర్తలు ఎలా కలిసి వుండాలి సమస్యలు సంఘర్షణలు ఎలా పరిష్కరించుకోవాలి అనే విషయాలపై శిక్షణలు లేవు. ఆ శిక్షణలు చాలా అవసరం. పెళ్ళి కాక ముందు ఒకసారి, పెళ్లి అయ్యాక మూడు నెలలోగా ఒకసారి శిక్షణ పొందడం, శిక్షణ ఇవ్వడం తప్పనిసరి చేయాలి. మునుపు ఉమ్మడి కుటుంబాలలో మూడు తరాలు కలిసి వుండేవారు. చుట్టూ చుట్టాలు కూడా అలానే వుండేవారు. కొత్తగా పెళ్లయిన వారు భయం భయంగా ఉంటూ అనుకరించే అన్ని నేర్చుకునేవారు. ఇపుడా పరిస్థితి లేక సంఘర్షణ రాగానే పరిష్కరించోవడం తెలియక విడిపోతున్నారు. పెళ్లయిన నెలకు రెన్నెలెలకు యేడాది లోపే విడి పోతున్నారు. నిజానికి పరస్పర అవగాహన పెరగడానికి రెండేళ్ళు పడుతుంది. ఇరవై శాతం పైగా విడిపోయి బతికితే మళ్లీ పెళ్లి. అది మరింత కష్టం. అంవల్ల ూంఎ, ఎఎ, ఝఎ, జఱజ్ఞూఖఝఱఝ వంటి ఉచిత శిక్షణ పొందాలి. అందించాలి. అలా బుద్ధుడు పతంజలి చెప్పిన పంచకోశ శుద్ధి జరుగుతుంది. మనసు దూదిలా తేలికవుతుంది. ఇవి చేసిన వారు ఎన్నడూ ఏమీ రాయని వారు పాటలు రాసారు. కథలు రాసారు పాటలు పాడారు. ఉపన్యాసాలు దంచారు. ఎన్నడు ఏడవని వారు ఏడ్చారు. ఎన్నడూ నవ్వని వార నవ్వారు. ఎన్నడూ డ్యాన్స్ చేయని వారు డ్యాన్స్ చేసారు. మన మెదడు పై పడిన భయాలు భారాలు అన్ని తొలగిపోతాయి. నేను తత్వ శాస్త్రంలో పడి బుర్ర వేడెక్కి పోయినప్పుడు 1993 ఈ శిక్షణ పొందే అవకాశం వచ్చింది. మనసులోని బరువంతా దిగి పోయింది. అప్పుడు తిరిగి కథలు రాయడం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించాను. అలా జీవితంలో ఈ శిక్షణలు మనసును శరీరాన్ని ఎంతో ఆరోగ్యవంతం చేసాయి.

# రూ. 25 లక్షల నిధులు మంజూరు చేసిన మంత్రి శ్రీధర్ బాబు

- మంత్రి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకుల పాలాభిషేకం



**మల్హర్, ఏప్రిల్ 28 (జనంసాక్షి) :** మండలంలోని మల్లారం సబ్ స్టేషన్ పరిధిలో ఏళ్లతరబడి వేధిస్తున్న విద్యుత్ సమస్యకు మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు చొరవతో మోక్షం లభించింది. గ్రామానికి, వ్యవసాయ రంగానికి ఒకే విద్యుత్ లైన్ ఉండటంతో తలెత్తుతున్న ఇబ్బందులను గమనించిన మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు , ప్రత్యేకంగా రూ. 25 లక్షల నిధులను మంజూరు చేయించారు.దీంతో కొత్తగా 11కేవీ లైన్ ఏర్పాటు కానుంది. ఈ సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హర్ రావు ఆధ్వర్యంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు మల్లారం గ్రామంలో స్థానిక ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మంత్రి చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. కొత్త లైన్‌తో నిరంతర విద్యుత్ అందుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేకల రాజయ్య, మాజీ ఎంపిటిసి రాజు నాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగన్నపేట మురళి, యూత్ అధ్యక్షులు కలువల రవి సాగర్, నాయకులు లింగన్నపేట శేఖర్, రేవెల్లి లింగయ్య,బలరాం పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# నేడు బెల్లంకొండ సాయిశ్రీనివాస్ వివాహం

**తిరుపతి, ఏప్రిల్28 (జనంసాక్షి) :** టాలీవుడ్ యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ఒక ఇంటివాడు కాబోతున్నాడు. కావ్యతో కలిసి ఆయన వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టనున్నాడు. 29వ తేదీ బుధవారం రాత్రి 11:13 గంటలకు తిరుమల పుణ్యక్షేత్రంలో శ్రీవారి సాక్షిగా అత్యంత వైభవంగా వీరి వివాహ వేడుక జరగబోతున్నట్లు సమాచారం. సంప్రదాయబద్ధంగా సాగే ఈ వైదిక వేడుక కోసం వధూవరులిద్దరూ ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ శ్రవణ్ కుమార్ ప్రత్యేకంగా రూపొందించిన వస్త్రాలను ధరించబోతున్నారు.

# తెలంగాణలో వైద్యం ఖరీదు పెరుగుతోంది

## ఉద్యోగుల ఆరోగ్య భద్రత ఎప్పుడు?



తెలంగాణ రాష్ట్రం ఆరోగ్య రంగంలో కొన్ని మంచి కార్యక్రమాలు అమలు చేస్తున్నప్పటికీ, సాధారణ ప్రజలపై పడుతున్న వైద్య భారం మాత్రం వేగంగా పెరుగుతోంది. తాజా గణాంకాలు చూస్తే ఆసుపత్రిలో చేరి చికిత్స పొందాల్సిన పరిస్థితి వచ్చినప్పుడు తెలంగాణ ప్రజలు దేశంలోనే ఎక్కువ ఖర్చు చేస్తున్న రాష్ట్రాల్లో ఒకటిగా నిలుస్తోంది. ఇది కేవలం ఆరోగ్య రంగ సమస్య మాత్రమే కాదు; కుటుంబాల ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీసే సామాజిక సమస్య కూడా. జాతీయ సర్వే వివరాల ప్రకారం, ప్రసవాలను మినహాయించి తెలంగాణలో ఒక్కో ఆసుపత్రి చేరికకు సగటు వైద్య వ్యయం సుమారు రూ.52,743. దేశ సగటు మాత్రం రూ.37,858 మాత్రమే. అంటే తెలంగాణలో చికిత్స ఖర్చు జాతీయ సగటుతో పోలిస్తే దాదాపు 40 శాతం ఎక్కువ. మరో లెక్క ప్రకారం ఆర్థిక భారం రూ.55,863 వరకు ఉందని పేర్కొన్నారు. ఈ వ్యత్యాసం రాష్ట్రంలో వైద్య సేవలు ఎంత ఖరీదైనవో చూపిస్తోంది. ఈ అధిక ఖర్చుకు ప్రధాన కారణం ప్రైవేట్ ఆసుపత్రులపై అధిక ఆధారపడటం. తెలంగాణలో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందితే సగటు వ్యయం రూ.72,561 వరకు వెళ్తోంది. నగర ప్రాంతాల్లో ఈ ఖర్చు మరింత పెరుగుతుంది. మరోవైపు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇదే చికిత్సకు సుమారు రూ.15,856 మాత్రమే ఖర్చవుతోంది. అంటే ప్రభుత్వ ఆసుపత్రులు బలోపేతం అయితే ప్రజలపై పడే భారాన్ని భారీగా తగ్గించవచ్చు.

తెలంగాణలో అనారోగ్యంతో బాధపడిన వారిలో 35.8 శాతం మంది ప్రైవేట్ వైద్యసంస్థలను, 39.5 శాతం మంది ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించారు. పట్టణాల్లో ప్రైవేట్ వైపు మొగ్గు ఇంకా ఎక్కువగా కనిపిస్తోంది. దీని అర్థం ప్రజలు ప్రభుత్వ వైద్యంపై పూర్తిగా నమ్మకం కోల్పోలేదు; కానీ అవసరమైన చోట సరైన సదుపాయాలు లేకపోతే ప్రైవేట్ వైపు వెళ్లాల్సి వస్తోంది.

ఇంకా ఒక ముఖ్యమైన అంశం–తెలంగాణలో 15 శాతం జనాభా 15 రోజుల వ్యవధిలో ఏదో ఒక అనారోగ్య సమస్యను ఎదుర్కొన్నట్లు తెలిపింది. దేశ సగటు 13.1 శాతం మాత్రమే. ఇది జీవనశైలి వ్యాధులు, కాలుష్యం, ఒత్తిడి, మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలు పెరుగుతున్న సంకేతంగా చూడాలి. ముఖ్యంగా హైదరాబాద్, పరిసర పట్టణాల్లో ఉద్యోగ జీవితం కారణంగా ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. ప్రసూతి సేవల్లో కూడా తెలంగాణలో ప్రైవేట్ రంగ ప్రభావం ఎక్కువగానే ఉంది. రాష్ట్రంలో 56.3 శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో, 43.6 శాతం ప్రైవేట్ ఆసుపత్రుల్లో జరిగాయి. జాతీయ స్థాయిలో మాత్రం 64.2 శాతం ప్రసవాలు ప్రభుత్వ రంగంలో, 34.8 శాతం ప్రైవేట్ రంగంలో జరిగాయి. అంటే తెలంగాణలో గర్భిణీలు ప్రైవేట్ వైపు ఎక్కువగా వెళ్తున్నారు. దీనికి సేవా నాణ్యత కారణం కావచ్చు, కానీ ఖర్చు కూడా అధికమే.

ఇప్పుడు మరో అత్యవసర అంశం–ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల ఆరోగ్య భద్రత. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల ప్రతినిధులతో ఆరోగ్య పథకం పై చర్చలు జరిపినట్లు సమాచారం. కానీ ఇప్పటివరకు స్పష్టమైన నిర్ణయం ప్రకటించి అమలు చేయలేదు. ఇది వేలాది కుటుంబాలకు అనిశ్చితిని కలిగిస్తోంది.

సేవలో ఉన్న ఉద్యోగులు తమ జీవితకాలం ప్రభుత్వానికి సేవలందిస్తారు. పదవీ విరమణ తర్వాత ఎక్కువగా ఆరోగ్య సమస్యలు వచ్చే వయసులో సరైన ఆరోగ్య రక్షణ లేకపోవడం అన్యాయం. ప్రస్తుతం అనేక మంది పెన్షనర్లు ప్రైవేట్ ఆసుపత్రుల ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా క్యాష్‌లెస్ వైద్యం, ఎంపానెల్డ్ ఆసుపత్రులు, పారదర్శక రీయింబర్స్‌మెంట్ విధానం కోసం ఎదురు చూస్తున్నారు. అందుకే తెలంగాణ ప్రభుత్వం తక్షణమే ఉద్యోగులు, పెన్షనర్ల కోసం సమగ్ర ఆరోగ్య పథకాన్ని ప్రకటించాలి. అందులో:

క్యాష్‌లెస్ చికిత్స సౌకర్యం జిల్లాల వారీగా గుర్తింపు పొందిన ఆసుపత్రులు వృద్ధులకు ప్రత్యేక చికిత్స ప్యాకేజీలు ఆన్‌లైన్ క్లెయిమ్ వ్యవస్థ కుటుంబ సభ్యులకు కూడా వర్తించే రక్షణ అత్యవసర చికిత్సలకు తక్షణ అనుమతి వంటి అంశాలు ఉండాలి.

ఇక ప్రజల కోసం కూడా ప్రభుత్వం మూడు కీలక నిర్ణయాలు తీసుకోవాలి. మొదట ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, పరీక్షా పరికరాలు, మందులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలి. రెండవది ప్రైవేట్ ఆసుపత్రుల బిల్లింగ్‌పై కఠిన నియంత్రణ ఉండాలి. మూడవది ఆరోగ్యశ్రీ వంటి పథకాల పరిధిని విస్తరించి మధ్యతరగతిని కూడా కవర్ చేయాలి. మొత్తానికి తెలంగాణలో వైద్య సేవలు ఉన్నాయి, కానీ చవకగా లేవు. ప్రజలు చికిత్స పొందుతున్నారు, కానీ దాని కోసం అప్పులు చేస్తున్నారు. ఉద్యోగులు సేవలందిస్తున్నారు, కానీ రిటైర్ అయిన తర్వాత ఆరోగ్య భద్రత కోసం ఎదురుచూస్తున్నారు.

నిజమైన సంక్షేమ రాష్ట్రం అంటే ఆసుపత్రులు కట్టడం మాత్రమే కాదు–ప్రతి కుటుంబం భయపడకుండా వైద్యం పొందే పరిస్థితి కల్పించడం. తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు అదే దిశగా త్వరిత నిర్ణయాలు తీసుకోవాలి.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# బెంగాల్ ఎన్నికలు: మహిళా ఓటు నిర్ణయిస్తుందా ఫలితం?

పశ్చిమ బెంగాల్‌లో హై వోల్టేజ్ ఎన్నికల ప్రచారం చివరి దశకు చేరుకున్న ఈ సమయంలో రాజకీయ వాతావరణం అత్యంత ఉద్రిక్తంగా మారింది. అధికార తృణమూల్ కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్ష బీజేపీ రెండూ 294 స్థానాల్లో 200కు పైగా గెలుస్తామనే ధీమాతో ప్రచారం కొనసాగిస్తున్నాయి. ఈ పోటీ కేవలం ఎన్నికల పోటీగా కాకుండా భావజాల యుద్ధంగా మారింది. ఓటర్లలో ప్రభావం చూపేందుకు "పెర్సెప్షన్ వార్" కీలక వ్యూహంగా మారింది. బెంగాల్ రాజకీయాల్లో ప్రతీకార సంస్కృతి ఉండటంతో ఓటర్ల భద్రత భావన ముఖ్యాంశంగా మారింది. ఓటర్లు స్వేచ్ఛగా బయటకు వచ్చి ఓటు వేయగలగడం ఎన్నికల ఫలితాన్ని ప్రభావితం చేసే అంశంగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా హిందూ ఓటర్లలో తృణమూల్ వ్యతిరేక భావన పెరుగుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. అయితే వారు తమ అసలు అభిప్రాయం ప్రకారం ఓటు వేయడంలో కొంత సంకోచం చూపిస్తున్నారు. ఇది 2021 ఎన్నికలతో పోలిస్తే మరింత స్పష్టంగా కనిపిస్తోంది. మహిళా ఓటర్లు ఈ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించబోతున్నారు. గతంలో మమతా బెనర్జీకి బలమైన మద్దతు ఇచ్చిన ఈ వర్గం ఇప్పుడు విభజనలో ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ స్థాయిలోనే ఓట్ల విభజన కనిపిస్తోంది. పట్టణ మహిళలు భద్రత, అభివృద్ధి అంశాలపై దృష్టి పెడుతున్నారు. సంక్షేమ పథకాల ప్రభావం కొంత తగ్గినట్లు భావన పెరుగుతోంది. గ్రామీణ మహిళలు సంక్షేమ ప్రయోజనాలు కోల్పోతామన్న భయంతో ఉన్నారు. "లక్ష్మీర్ భండార్" వంటి పథకాలు వారి జీవనాధారంగా మారాయి. అయితే గ్రామీణ ఆర్థిక సమస్యలు వారిని సందిగ్ధంలో పడేస్తున్నాయి. వ్యవసాయ ఉత్పత్తుల ధరల పతనం రైతులపై ప్రభావం చూపుతోంది. నిరుద్యోగం యువతలో అసంతృప్తిని పెంచుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మహిళల ఓటు నిర్ణయాత్మకంగా మారే అవకాశం ఉంది.

ఇదే సమయంలో బీజేపీ మహిళలపై ప్రత్యేక దృష్టి సారించింది. సంక్షేమ పథకాలు కొనసాగిస్తామని, ఉద్యోగాలలో రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇస్తోంది. భద్రత అంశాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తూ ప్రచారం కొనసాగిస్తోంది. పట్టణ మహిళలు అభివృద్ధి ఆశలపై దృష్టి పెడుతుండగా గ్రామీణ మహిళలు భయాంశాన్ని పరిగణిస్తున్నారు. ఈ విభిన్న ధోరణి ఎన్నికల ఫలితాన్ని క్లిష్టం చేస్తోంది. తృణమూల్ కూడా మహిళలను ఆకర్షించేందుకు సంక్షేమ పథకాలపై దృష్టి పెడుతోంది. ప్రభుత్వం మారితే లబ్ధులు ఆగిపోతాయని ప్రచారం చేస్తోంది. ఇది పేద కుటుంబాల్లో ప్రభావం చూపుతోంది. ముస్లిం ఓటర్లు ఎక్కువగా ఏకీకృతంగా తృణమూల్ వైపు మొగ్గు చూపుతున్నారు. మైనారిటీలలో భద్రత భావన కీలకంగా మారింది. ఇతర చిన్న పార్టీలు పెద్దగా ప్రభావం చూపలేకపోతున్నాయి. బీజేపీకి సంస్థాగత బలహీనత సవాలుగా ఉంది. హిందూ ఓటర్ల అసంతృప్తిని ఓటుగా మలచడం ప్రధాన లక్ష్యంగా ఉంది. భయాంశం కొంత తగ్గినా పూర్తిగా తొలగిపోలేదు. మొదటి దశలో అధిక ఓటింగ్ ఇందుకు సంకేతంగా ఉంది. మహిళా ఓటర్ల తుది నిర్ణయం కీలకం. 2021లో మహిళా ఓటర్లలో తృణమూల్‌కు ఆధిక్యం కనిపించింది. ఇప్పుడు పట్టణ ప్రాంతాల్లో అది తగ్గే సూచనలు ఉన్నాయి. గ్రామీణ మహిళల ఓటు మార్పు కీలక అంశం. బెంగాల్ రాజకీయాలు ఇంకా అంచనాలకు అందని స్థితిలోనే ఉన్నాయి.

రవాణా ఖర్చులు పెరగడంతో సరఫరా వ్యవస్థలు దెబ్బతింటున్నాయి. డేటా సెంటర్ ఖర్చులు పెరిగి ఏఐ శిక్షణ ఖరీదవుతోంది. 15–20% వరకు ఖర్చులు పెరిగినట్లు అంచనా. కంపెనీలు పెట్టుబడులపై మళ్లీ ఆలోచిస్తున్నాయి. ఆసియా ఏఐ వృద్ధి మందగించే ప్రమాదం ఉంది. మొత్తంగా ఈ యుద్ధం గ్లోబల్ టెక్నాలజీ వ్యవస్థను కుదిపేసింది.

ఈ నేపథ్యంలో బెంగాల్ రాజకీయాల విశ్లేషణ మరింత లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఏర్పడింది. ఎన్నికల ప్రచారం చివరి దశలోకి వెళ్లినకొద్దీ స్థానిక అంశాలు, వ్యక్తిగత నాయకత్వం, వర్గాల మధ్య ఉన్న భావోద్వేగ అనుబంధాలు అన్నీ కలసి ఓటర్ల నిర్ణయాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ నిబద్ధత కంటే ప్రస్తుత ప్రయోజనాలే ప్రధానంగా మారుతున్నాయి. ఒక కుటుంబంలోనే భిన్న రాజకీయ అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇది గత ఎన్నికలతో పోలిస్తే కొత్త పరిణామంగా చెప్పుకోవచ్చు. మహిళలలో ఈ విభజన మరింత స్పష్టంగా కనిపిస్తోంది. ఒకవైపు సంక్షేమ పథకాల వల్ల లభిస్తున్న ఆర్థిక భద్రత, మరోవైపు భవిష్యత్తుపై ఉన్న అనిశ్చితి మధ్య వారు తడబడుతున్నారు. పట్టణ మహిళలు మాత్రం ఉద్యోగాలు, భద్రత, జీవన ప్రమాణాలపై దృష్టి పెట్టి



నిర్ణయం తీసుకునే అవకాశముంది.

ఇక ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సంఘం పాత్ర కూడా కీలకంగా మారింది. స్వేచ్ఛ, నిష్పక్షపాత వాతావరణం కల్పించడంలో అధికారులు ఎంతవరకు విజయవంతమవుతారన్నది ప్రజాస్వామ్య నాణ్యతను నిర్ధారిస్తుంది. ఓటర్లలో భయం తగ్గి పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు రావడం ఒక సానుకూల సూచనగా భావించవచ్చు. అయితే చివరి దశలో జరిగే ప్రచారం, స్థానిక సంఘటనలు, సోషల్ మీడియా ప్రభావం వంటి అంశాలు ఓటర్ల అభిప్రాయాన్ని త్వరగా మార్చగలవు. ఈ నేపథ్యంలో ఎన్నికల ఫలితంపై స్పష్టమైన అంచనాలు వేయడం కష్టతరంగా మారింది. బెంగాల్ రాజకీయాలు మళ్లీ ఒకసారి అనూహ్య మలుపు తిరిగే అవకాశాన్ని కూడా కొట్టిపారేయలేం.

ఇదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న భౌగోళిక రాజకీయ పరిణామాలు సాంకేతిక రంగంపై చూపుతున్న ప్రభావం కూడా విశ్లేషణకు అర్హమైన అంశంగా మారింది. పశ్చిమ ఆసియా యుద్ధం కేవలం ప్రాంతీయ ఘర్షణగా కాకుండా గ్లోబల్ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే సంఘటనగా మారింది. ముఖ్యంగా ఏఐ రంగం ఈ ప్రభావాన్ని తీవ్రంగా అనుభవిస్తోంది. ఒకవైపు రక్షణ రంగంలో ఏఐ వినియోగం వేగంగా పెరుగుతుండగా, మరోవైపు దాని మౌలిక వసతులపై దాడులు, సరఫరా అంతరాయాలు అభివృద్ధిని మందగింపజేస్తున్నాయి. ఇది సాంకేతిక రంగంలో ఒక విరోధాభాసాన్ని సృష్టిస్తోంది.

ఏఐ అభివృద్ధి పూర్తిగా డిజిటల్ ప్రపంచంలోనే జరుగుతుందనే భావన ఇప్పుడు మారుతోంది. దీనికి అవసరమైన భౌతిక వనరులు, శక్తి సరఫరా, తయారీ సామర్థ్యాలు అన్నీ కలిసి ఒక సంక్లిష్ట వ్యవస్థను రూపొందిస్తున్నాయి. ఈ వ్యవస్థలో ఏ చిన్న అంతరాయం జరిగినా మొత్తం రంగంపై ప్రభావం పడుతోంది. హీలియం, బ్రోమిన్, టంగ్‌స్టన్ వంటి వనరుల కొరత చిప్ తయారీని ప్రభావితం చేస్తోంది. ముఖ్యంగా అధునాతన సెమీకండక్టర్ తయారీ ప్రక్రియల్లో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. ఈ వనరుల సరఫరా అంతరాయం వల్ల తయారీ ఖర్చులు పెరగడం మాత్రమే కాకుండా, ఉత్పత్తి ఆలస్యమవుతోంది.

శక్తి సంక్షోభం కూడా పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది. డేటా సెంటర్లు, సెమీకండక్టర్ ప్లాంట్లు భారీగా విద్యుత్ వినియోగిస్తాయి. చమురు, ఎల్ఎన్‌జీ సరఫరా అంతరాయం కారణంగా శక్తి ఖర్చులు పెరిగాయి. దీనివల్ల ఏఐ శిక్షణ, క్లౌడ్ సేవలు, డిజిటల్ మౌలిక వసతుల నిర్వహణ ఖరీదవుతోంది. కంపెనీలు తమ వ్యయాలను నియంత్రించేందుకు ప్రాజెక్టులను వాయిదా వేయడం ప్రారంభించాయి. ఇది డిజిటల్ మార్పిడి వేగాన్ని తగ్గించే ప్రమాదం కలిగిస్తోంది.

రవాణా వ్యవస్థలో వచ్చిన అంతరాయాలు కూడా సరఫరా గొలుసును ప్రభావితం చేస్తున్నాయి. సముద్ర మార్గాల్లో భద్రత సమస్యలు, పెరిగిన బీమా ఖర్చులు, మార్గమార్పులు అన్నీ కలసి వస్తువుల రవాణాను ఆలస్యపరుస్తున్నాయి. ఇప్పటికే "జస్ట్ ఇన్ టైమ్" విధానంపై ఆధారపడిన పరిశ్రమలు ఇప్పుడు నిల్వలు పెంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది అదనపు ఖర్చులకు దారితీస్తోంది. ముఖ్యంగా చిప్ తయారీ రంగంలో ఈ ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది.

ఆసియా దేశాలు ఏఐ అభివృద్ధిలో ముందంజలో ఉన్నప్పటికీ, ఈ సంక్షోభం వాటి బలహీనతలను బయటపెట్టింది. దిగుమతులపై అధికంగా ఆధారపడటం, శక్తి వనరుల కొరత, భౌగోళిక రాజకీయ ప్రమాదాలు అన్నీ కలసి అభివృద్ధి వేగాన్ని తగ్గిస్తున్నాయి. భవిష్యత్తులో దేశాలు తమ సరఫరా గొలుసులను విభిన్నీకరించడానికి, స్థానిక ఉత్పత్తిని పెంచడానికి ప్రయత్నించే అవకాశం ఉంది. ఇది గ్లోబల్ వాణిజ్య నమూనాలను మార్చే అవకాశముంది.

మొత్తంగా చూస్తే, ఒకవైపు బెంగాల్ ఎన్నికలు దేశీయ రాజకీయ దిశను నిర్ధారించగా, మరోవైపు పశ్చిమ ఆసియా యుద్ధం గ్లోబల్ సాంకేతిక, ఆర్థిక వ్యవస్థలను ప్రభావితం చేస్తోంది. ఈ రెండు పరిణామాలు వేర్వేరు రంగాలకు చెందినవైనా, అవి ఒక సామాన్య సందేశాన్ని ఇస్తున్నాయి. అనిశ్చితి ఇప్పుడు ప్రతి రంగంలోనూ కీలక పాత్ర పోషిస్తోంది. రాజకీయాల్లో ఓటర్ల నిర్ణయం ఎలా మారుతుందో అంచనా వేయడం కష్టమైతే, సాంకేతిక రంగంలో సరఫరా, ఖర్చులు ఎలా మారతాయో అంచనా వేయడం కూడా అంతే కష్టం. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలు, సంస్థలు, ప్రజలు అన్నీ కొత్త వ్యూహాలను అవలంబించాల్సిన అవసరం ఏర్పడింది. భవిష్యత్తు మరింత అనిశ్చితంగా మారుతున్న ఈ సమయంలో స్థిరత్వం సాధించడం ప్రతి వ్యవస్థకు పెద్ద సవాలుగా మారుతోంది. ఈ సమగ్ర పరిణామాలను పరిశీలించినప్పుడు ఒక ముఖ్యమైన విషయం స్పష్టంగా కనిపిస్తోంది---ప్రస్తుతం రాజకీయ వ్యవస్థలకైనా, సాంకేతిక రంగానికైనా స్థిరత్వం అనేది అత్యంత కీలక అవసరంగా మారింది. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు కేవలం ఒక రాష్ట్రానికి పరిమితమైన రాజకీయ పోటీగా కాకుండా, దేశవ్యాప్తంగా మారుతున్న ఓటర్ల మానసిక ధోరణులకు ప్రతిబింబంగా నిలుస్తున్నాయి. మహిళా ఓటర్ల ప్రాధాన్యం, సంక్షేమ పథకాల ప్రభావం, భద్రతపై పెరుగుతున్న చర్చ--- ఇవి భవిష్యత్ రాజకీయ వ్యూహాలను నిర్ణయించే అంశాలుగా మారుతున్నాయి. ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమం అనే ద్వంద్వ సమీకరణంలో పార్టీలు తమ స్థానాన్ని స్థిరపరచుకునే ప్రయత్నం చేస్తున్నాయి.

ఈ నేపథ్యంలో ఓటర్ల ప్రవర్తన కూడా గణనీయంగా మారుతోంది. భావోద్వేగాలకంటే ప్రయోజనాత్మక దృక్పథం పెరుగుతోంది. కుటుంబ స్థాయిలోనే రాజకీయ చర్చలు విభిన్న దిశల్లో సాగుతున్నాయి. ఒకే ఇంట్లో భిన్న అభిప్రాయాలు వ్యక్తమవడం ప్రజాస్వామ్య పరిపక్వతకు సూచనగా భావించవచ్చు. అయితే అదే సమయంలో భయం, అనిశ్చితి పూర్తిగా తొలగిపోకపోవడం ప్రజాస్వామ్యానికి సవాలుగా మిగులుతోంది. ఈ పరిస్థితుల్లో ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, భద్రత, నమ్మకం అనే మూడు అంశాలు అత్యంత ప్రాముఖ్యత సంతరించుకుంటాయి.

ఇక గ్లోబల్ స్థాయిలో చూస్తే, పశ్చిమ ఆసియా యుద్ధం సాంకేతిక రంగానికి ఇచ్చిన పాఠం చాలా లోతైనది. ఏఐ వంటి ఆధునిక సాంకేతికతలు కూడా భౌతిక వనరులపై ఎంతగా ఆధారపడి ఉన్నాయో ఈ సంక్షోభం స్పష్టంచేసింది. సరఫరా గొలుసుల లోపాలు, శక్తి సంక్షోభం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు–ఇవి కలిసి అభివృద్ధి వేగాన్ని ఒక్కసారిగా మందగింపజేయగలవని ఇది నిరూపించింది. ముఖ్యంగా ఆసియా దేశాలు తమ ఆధారపాటు విధానాలను పునర్విమర్శించాల్సిన అవసరం ఏర్పడింది. స్థానిక ఉత్పత్తి, ప్రత్యామ్నాయ వనరులు, శక్తి భద్రత వంటి అంశాలు ఇప్పుడు వ్యూహాత్మక ప్రాధాన్యం పొందుతున్నాయి.

ఈ రెండు వేర్వేరు రంగాల్లో జరుగుతున్న పరిణామాలు ఒక సామాన్య సందేశాన్ని అందిస్తున్నాయి–అనిశ్చితి యుగం ప్రారంభమైంది. రాజకీయాల్లో ఓటర్ల నిర్ణయం, ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడుల దిశ, సాంకేతిక రంగంలో అభివృద్ధి–ఖ్రీశ్రీ ఇవి ముందుగానే అంచనా వేయడం కష్టంగా మారుతోంది. ఈ పరిస్థితుల్లో స్థిరమైన వ్యూహాలు, దూరదృష్టి కలిగిన విధానాలు అత్యంత అవసరం. ప్రభుత్వాలు మాత్రమే కాదు, ప్రైవేట్ సంస్థలు, సాధారణ ప్రజలు కూడా ఈ మార్పులకు అనుగుణంగా తమ నిర్ణయాలను మార్చుకోవాల్సి ఉంటుంది. మొత్తానికి, పశ్చిమ బెంగాల్ ఎన్నికలు గాని, పశ్చిమ ఆసియా యుద్ధం గాని ఒక్కో ప్రాంతానికి పరిమితమైన సంఘటనలు కావు. అవి విస్తృత ప్రభావాన్ని చూపుతున్నాయి. ఒకటి ప్రజాస్వామ్య దిశను నిర్ధారిస్తే, మరొకటి సాంకేతిక భవిష్యత్తును మలుస్తోంది. ఈ రెండు పరిణామాలు కలిపి చూస్తే ప్రపంచం ఒక మార్పు దశలో ఉందని స్పష్టమవుతోంది. ఈ మార్పును అర్థం చేసుకుని, సమయానికి సరైన నిర్ణయాలు తీసుకునే వారే భవిష్యత్తులో ముందంజలో నిలుస్తారు. లేదంటే అనిశ్చితి ప్రవాహంలో చిక్కుకుని వెనుకబడే ప్రమాదం ఉంటుంది. ఇదే ఈ సమగ్ర విశ్లేషణ అందించే ప్రధాన సందేశం.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# 'మేడే' పోరాట దినాన్ని ఎత్తిపడదాం

నేటి 140వ మేడే ను బలమైన పోరాట రోజుగా మనం జరుపుకోవాల్సిన అవసరం ఉన్నది. ఒకవైపు ప్రభుత్వాలన్ని పెట్టుబడిదార్ల సామ్రాజ్యవాదుల గుప్పిట్లో బందీలుగా మారిపోయాయి. ముఖ్యంగా బిజెపి ప్రభుత్వమైతే పూర్తిగా కార్మిక వ్యతిరేక ప్రభుత్వంగా మారిపోయింది. తరతరాలుగా ప్రపంచ వ్యాప్తంగా కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక హక్కులు మన రాజ్యాంగంలో పొందుపరచబడ్డప్పటికి అవి 44 చట్టాల రూపంలో ఉన్నప్పటికి వాటన్నింటిని సవరణకు గురి చేసి 4 కోడ్‌లుగా మార్చి కార్మికులకు ఎటువంటి ప్రాథమిక బలమైన హక్కులు లేకుండా ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్చేసింది. అందులో ముఖ్యమైనది 'మేడే'కు సంబంధించింది కూడా ఎంతో మంది ప్రాణ త్యాగం చేసి 1886లో పోరాడి సాధించుకున్న 8గంటల పని దినం మేడే హక్కు కూడా అణచివేతకు గురవుతున్నది. దాని స్థానంలోనే 12 గంటల పని దినాన్ని లోపాయికారిగా ప్రవేశపెట్టేశారు. దాని చట్టరూపంగా తేవడం కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంలోనే మనం 140 మేడే అనే పోరాట దిన్నాని జరుపుకుంటున్నాను. ఈ రోజుకు కూడా ఒక ప్రత్యేకత ఉంది. నిన్న మొన్ననే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్.టి.సి. కార్మికులు గత ప్రభుత్వం కార్మిక సంఘాలను నిషేధించినా, కార్మిక సంఘాలన్ని కలిసి జెఎసిగా ఏర్పడి బలమైన కార్మిక పోరాటాన్ని 3 రోజులు కొనసాగిస్తే విజయాన్ని కైవసం చేసుకోగలిగారు. మధ్యలో చిన్న శంకర్‌గౌడ్ లాంటి బలిదానాన్ని మనం విస్మరించడానికి వీలే లేదు. మొత్తంగా తెలంగాణ రాష్ట్రంలో ఒక బలమైన కార్మిక ఉద్యమం సింగరేణిలో కొనసాగుతున్నది మరొకిటి ఆర్.టి.సి.లో కొనసాగుతున్నది. సింగరేణి ఉద్యమం దేశంలోనే ఒక బలమైన ఉద్యమంగా కొనసాగింది, పోరాటాలు చేసింది, దేశంలో ఎక్కడా లేని విధంగా హక్కులను కూడా సాధించుకున్నది. కానీ నేడు ఆ కార్మిక సంఘాల బలహీనతల నుంచి శాశ్వత కార్మికుల నియామకం తగ్గిపోగా తాత్కాలిక ఉద్యోగుల సంఖ్యనే పెరిగిపోయింది. ఇది ఒక బలమైన కారణంగా కార్మిక ఉద్యమాలు ముందుకు సాగకుండా పని చేస్తున్నవి. అయినప్పటికి శాశ్వత ఉద్యోగులు అనేక కార్మిక సంఘాలలో భాగస్తులుగా ఉన్నప్పటికి కార్మిక వర్గ దృక్పథంతో పోరాటాలు నిర్మించడంలో విఫలమవుతున్నాయి. తాత్కాలిక ఉద్యోగులు అసంఘటితంగా బలహీనంగా ఉన్నప్పటికి వాళ్ళు పోరాటాలు చేస్తూనే ఉన్నారు. కనీసం వాళ్ళకు మద్దతుగా కూడా శాశ్వత ఉద్యోగులు నిలబడలేకపోతున్నారు. ఇది ఒక బలహీనమైన అంశంగా సింగరేణి కార్మిక ఉద్యమంలో కొనసాగుతుంది. ఆ సమస్యను పరిష్కరించుకొని తాత్కాలిక శాశ్వత ఉద్యోగుల ఐక్యతలోంచి సింగరేణి కార్మిక ఉద్యమాలు నిలబడగలిగితే సింగరేణిని ప్రైవేటీకరణ కాకుండా ఇప్పటికే సాధించుకున్న హక్కులతో నిలబెట్టుకోగలుగుతాం. లేకపోతే సింగరేణి యాజమాన్య ఒత్తిడిలో, అణచివేతలో సాధించుకున్న హక్కులతో సహ అన్ని హక్కులను కూడా కోల్పోతున్న స్థితి ఏర్పడుతుంది. మరొకవైపు ఆర్.టి.సి. కార్మికులకు తెలంగాణ ఉద్యమాలన్ని పోరాట అభినందనలు తెలపాల్సిన అవసరం ఉంది. ఎంతగా ప్రభుత్వాలు నిర్బంధాలకు అణచివేతకు గురి చేసినప్పటికి కరోనా కాలంలో నిర్వహించిన సమ్మెలో అనేక మందిని బలిదానాల రూపంలో పోగొట్టుకున్నప్పటికి పోలీసు బాసులనే తీసుకువచ్చి ఆర్.టి.సి.కి అధికారులుగా పెట్టి అణచివేతను పెంచినప్పటికి ఎదుర్కొని నిలబడ్డదే ఆర్.టి.సి. కార్మికుల వర్గం. నిత్యం సస్పెన్షన్లు, రిమూవల్స్ ఉన్నప్పటికి అదే స్థాయిలో మహిళా కార్మికులపై యాజమాన్య అణచివేత కొనసాగినప్పటికి మొన్న నిర్వహించిన బలమైన కార్మిక పోరాట ఉద్యమాన్ని మనందరం గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత మొట్టమొదటి సమ్మె అంత బలంగా సాగింది, చివరికి విజయం కూడా పొందగలిగింది. ఇదే విధంగా సింగరేణి కార్మికులు




ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు, కార్మిక సంఘాలు ఐక్యంగా ఏర్పడి పోరాడడం ద్వారా హక్కులను సాధించుకోగలగుతాం. ఆ వైపుగా కార్మిక ఉద్యమాలన్ని కొనసాగడం ద్వారానే మేడేను మనం పూర్తిగా గుర్తించగలిగిన వాళ్ళమవుతాం. అంతేకాక సిగాచి కంపెనీలో 55 మంది కార్మికులు సజీవ దహనం అయితే ఇంత వరకు బాధిత కుటుంబాలకు న్యాయం అందించడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలం అయింది. 8 శవాలు దొరకకపోతే వారి మొబైల్ ఫోన్లు అక్కడ ఉన్నప్పటికి వాటిని గుర్తించడానికి అంగీకరించలేదు. అదీగాక వారి కుటుంబాలకు ఇస్తామన్న ఆర్థిక సహాయం ఇప్పటికి పూర్తి స్థాయిలో అందలేదు. జీడిమెట్ల, పాశమైలారం, కాజీపల్లి, వైపు ఉన్న రసాయన పరిశ్రమలలో నిత్యం ఏదోరకమైన ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అక్కడ ఉన్న కార్మిక సంఘాల బలహీనతలను ఆసరా చేసుకొని బాధిత కుటుంబాలకు నష్టపరిహారాన్ని చట్టం నిర్దేశించినట్లు ఇవ్వడానికి వాళ్ళను బెదిరించి ఎంతోకొంత ముట్టజెప్పి శవాలను వాళ్ళ ఇంటికి తరలిస్తున్నారు. ఇది పట్టణ ప్రాంతంలో సెక్యూరిటీ గార్డు నుంచి మొదలు పెడితే ఏ రకమైన ఉద్యమం చేస్తున్నప్పటికి ఏ ప్రమాదంలో వాళ్ళు చనిపోయినప్పటికి చట్టప్రకారం రావాల్సిన సహాయాన్ని వాళ్ళు అందుకోలేకపోతున్నారు.

'మేడే' ఒక పోరాట దినం. అనే చరిత్రను దాయడానికి కంపెనీలు, కార్పొరేట్లు 'మేడే' కు ఉన్న రక్త చరిత్రను లేనట్లుగా చివరికి ఆ పోరాటమే జరగనట్లుగా 8 గం॥ల పనిదినాన్ని ఏ కంపెనీ, కార్పొరేట్లు అమలు జరిపితే ఆ కంపెనీ నష్టాల ఊబిలో కూరుకుపోతుందని కార్మికులకే నష్టమని భావించేలా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. కానీ కార్మిక హక్కుల కోసం పోరాడే చైతన్యం కార్మిక వర్గానికి లేకుండా చేయడం కోసం ప్రభుత్వాలు కంపెనీలు తీవ్రంగా ప్రయత్నిస్తూ ముందుకు వచ్చిన కార్మిక నాయకత్వాలను హత్య చేసే స్థితిలో కొనసాగుతున్న నేపథ్యంలో కార్మిక సంఘాలంటే కంపెనీలకు ప్రభుత్వాలకు కార్మికుల మధ్య దళారి పాత్రను పోషించే స్థితికి కార్మిక సంఘాన్ని నెట్టేసాయి. నిజాయితీగా చిత్తశుద్ధితో పనిచేసే కార్మిక నాయకులనే నిర్ధాక్షిణ్యంగా చంపేసే స్థితి చత్తీస్‌ఘడ్ కార్మిక నాయకుడు శంకర్ గుహనియోగితో మనకు అర్థమైంది. ఇప్పుడు కార్మిక పోరాటాలే కాదు, అన్యాయానికి వ్యతిరేకంగా పాత్రికేయులు పోరాటాలు చేసిన గౌరీ లంకేష్ లాగా మొన్నీ మధ్య హత్యకు గురైన ముఖేష్ చంద్రాకర్ లాగా చనిపోవాల్సిన స్థితిని ప్రభుత్వాలు కొనసాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'మేడే' కార్మిక హక్కుల పోరాట దినమైన మార్చి 8 'మహిళా హక్కుల పోరాట దినం' అయినా రెండింటికి సమాజంలో విలువ లేకుండా ఒక పండగ లాగా చేసుకునే స్థితికి ప్రభుత్వాలు కార్పొరేటు రంగం మార్చేస్తున్నాయి. వాటి వెనక ఉన్న నెత్తుటి చరిత్ర ఎవరికి కనబడకుండా చెరిపేస్తున్నాయి. కాని బాధ్యత గల కార్మిక వర్గం ముందుకు వచ్చి కార్మిక హక్కుల కోసం ఎప్పటికైనా పోరాటం చేయడం ద్వారానే కార్మిక హక్కులను సాధించుకుంటామని సత్యాన్ని ప్రజలకు తెలియజెప్పాల్సిన బాధ్యత కార్మిక సంఘాలపై ఉంది.

'మేడే' కార్మిక వర్గ పోరాట దినం. 1886 లో చికాగో కార్మికులు తమ విలువైన నెత్తురును పారించి "మేడే" 8 గంటల పనిదినం హక్కును సాధించారు. 139 సం॥రాల క్రితం మనం సాధించిన 8 గంటల పని దినం హక్కు నిత్యం ఉల్లంఘనకు గురయ్యేలా పబ్లిక్, ప్రైవేట్ రంగ సంస్థలు ఇంకా అదనపు విలువను దోపిడి చేయడం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థలో గ్రామాల్లో, పట్టణాల్లో ప్రభుత్వ రంగం నుండి ప్రైవేట్ రంగం వరకు కార్మికుల శ్రమ శక్తిని విపరీతంగా దోచుకుంటున్నారు. దోపిడీ రూపాలను కార్మిక వర్గం గుర్తించకుండా ఎక్కువ పని గంటలు తప్పనిసరని కార్మికులే భావించేలా సామాజిక స్థితిని, ఉద్యోగ అభద్రతను కల్పిస్తున్నారు. శ్రమ శక్తినే కాదు, చివరికి కార్మికుల ప్రాణాలు కూడా కోల్పోయే లాగా ఉద్యోగ పరిస్థితులను సృష్టిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా "మేడే" 8 గంటల పనిదినానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న పరిస్థితుల్లో కార్మిక వర్గం సాధించుకున్న హక్కును కోల్పోతున్నది.

ఒక వైపు సామ్రాజ్యవాద దేశాలలో వస్తున్న సంక్షోభం, అనేక దేశాల మధ్య యుద్ధాలను కొనసాగిస్తున్నాయి. అందులో భాగమే ఉక్రెయిన్ యుద్ధమైనా, నేడు జరుగుతున్న ఇరాన్‌పై యుద్ధం కావచ్చు. ఇవన్నీ కూడా ప్రజాస్వామిక దేశాలుగా ప్రకటించుకున్నప్పటికి అమలులో మాత్రం కేవలం సామ్రాజ్యవాద ప్రయోజనాలకు సంబంధించే నియమాలను అమలు చేయడంలో భాగంగా యుద్ధాలకు సృష్టికర్తలవుతాయి. ఆయుధ కంపెనీలకు యుద్ధమే పెద్ద మార్కెట్టు. ఆయుధాల మార్కెట్ కోసమే యుద్ధాలు కొనసాగుతున్నాయి. ఈ యుద్ధంలో పసి పిల్లల మొదలు అనేక వేల మంది ఇప్పటికే చనిపోయారు. దానికి పాలస్తీన, ఇరాన్, ఉక్రేయిన్‌లు తాజా ఉదాహరణ. ఈ నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం బలపడుతున్నది. దీన్ని సాకుగా తీసుకొని అన్ని దేశాలు కూడా తమ రాజ్యాంగంలో ఉన్న ప్రజల హక్కులను యుద్ధం కారణంగా అణచివేస్తాయి. అందులో భాగంగానే సామ్రాజ్యవాదుల ఇజ్రాయెల్ అమెరికాల బలంతో సాంకేతికతతో మన మధ్యభారత ఆదివాసీలపై కగార్ యుద్ధం పేరుతో వేల మందిని చంపేసారు. దానికి మావోయిస్టు ఉద్యమాన్ని సాకుగా చూపెట్టి సుమారు ఏడు లక్షల సాయుధ బలగాలతో బస్తర్ ప్రాంతాన్ని బందూకుల మయం చేశారు. ఆదివాసీ చట్టాలైన 1/70, పేసా చట్టం, 5వ షెడ్యూలు, 6వ షెడ్యూలు అన్నీ అమలు కాకుండా మూలవాసులైన ఆదివాసీలనే వేటాడి వెంటాడి హననం చేస్తున్నారు. దీనిపై కూడా కార్మిక సంఘాలన్ని మాట్లాడడం, పోరాటాలు నిర్వహించడం ద్వారానే ప్రజాస్వామిక హక్కులను, రాజ్యాంగ హక్కులను కాపాడుకునే అవకాశం ఉన్నది. ఆ వైపుగా కార్మిక ఉద్యమాలన్ని పయనించాలని రాజ్యాంగ హక్కులను కాపాడుకోవాలని కార్మిక వర్గానికి పౌర హక్కుల సంఘం పిలుపునిస్తుంది.



ఎన్. నారాయణ రావు
ప్రధాన కార్యదర్శి
పౌరహక్కుల సంఘం



## ఇదీ సంగతి!

సరిహద్దులు
వాతావరణం
సముద్రాలు
నదీజలాలు
అడవులు
పంటభూములు
జీవరాసులు
ఇవన్నీ ఉన్నదే
ఏ దేశమైనా!

వాటన్నిటినీ
బలవంతుడు
కాజేసాడు!
భూమినాక్రమించి
రాజ్యం చేసాడు!
ప్రజలకష్టంతో
సంపదసృష్టి!
ఈ సంపద
పంపిణీ దగ్గరే
రాజకీయం పుట్టింది!

రాచరికాలు
భూస్వామ్యం
గతించిన
చరిత్ర అది!
ఇప్పుడున్నది
పెట్టుబడిదారీ
ప్రజాస్వామ్యం!
రేపురాబోయేది
సోషలిజం!
రాదనుకోవద్దు!

పరిపాలనలో
ఒక్కోదేశం
ఒక్కోరకం!
మనదేశంలో
నాయకత్వం
మరీఅధ్వాన్నం!

విద్యలేనిప్రజలు
దానినిసరిదిద్దరు!
మారుతున్న
'కాలం'తోమారరు!

అవిద్యకుతోడు
కులమతాలు
అజ్ఞానాన్ని
అహంకారాన్ని
ఎగదోస్తారు!
వీళ్ళకే సైన్స్ రాదు!
దేవుడికొదిలేసారు!
పళ్ళాలుమోగిస్తే
'కరోనా'పోతుందని
చెప్పిన –అశాస్త్రీయ
భావజగత్తు వీళ్లది!

పార్టీ ఏదైనా
స్వార్థంకోసం
ఎన్నికల్లో
కూటములు!
ఓట్లుకొనటం
మందుపంచటం
రానురాను
అనైతిక
పద్ధతులతో
రాజ్యాధికారం!

చట్టాలు
పథకాలు
వాళ్ళశాశ్వత
రాజ్యాధికారానికి
దుష్టప్రయోగాలు!
విద్య వైద్యం
సర్వనాశనం!
డీలిమిటేషన్
పచ్చిమోసం!
ఇదీసంగతి!

–తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

## పెట్రోల్, డీజిల్ కొరత కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే..




**వనపర్తి టౌన్, ఏప్రిల్ 28 (జనంసాక్షి) :** జిల్లాలో పెట్రోల్ డీజిల్ కొరత కేంద్ర వైఫల్యమేనని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ విమర్శించారు. వనపర్తి భగత్ సింగ్ నగర్ సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అమెరికా ఇజ్రాయిల్-ఇరాన్ యుద్ధం వస్తుందని ముందే తెలిసినా ఇంధనాన్ని నిలువ చేసుకోవడంలో కేంద్రం విఫలమైందన్నారు. జిల్లాలో పెట్రోల్ డీజిల్ కొరతతో వినియోగదారులు అల్లాడుతున్నారన్నారు. వనపర్తి పట్టణం, మండలాల్లో బంకులన్నీ నో స్టాక్ బోర్డుతో కనిపిస్తున్నాయన్నారు. పెట్రోల్ డీజిల్ ఉన్న బంకుల వద్ద వందలాదిమంది క్యూ కడుతున్నారని గొడవలు జరుగుతున్నాయి అన్నారు. దీని అవకాశంగా తీసుకొని పట్టణంలో కొందరు లీటర్ పెట్రోల్ రూ. 200 లకు బ్లాక్ మార్కెట్లో అమ్ముతున్నారన్నారు. ఇప్పటికే వంట గ్యాస్ లేక అల్లాడుతున్న ప్రజలకు ఇప్పుడు పెట్రోల్ డీజిల్ కొరత కూడా ఏర్పడటంతో దిక్కు తోచని పరిస్థితి ఏర్పడిందన్నారు. జిల్లాలో వరి కోతలు ఊపందుకున్నాయని మిషన్లకు డీజిల్ దొరకటం లేదన్నారు. ఆటోలు జీపులు కార్లు అద్దెకు నడుపుకునే వారికి కూడా పెట్రోల్ డీజిల్ దొరకటం లేదన్నారు. పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ కొరతను తీర్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని లేదంటే ప్రజలను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు మోష, డిహెచ్పిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి శేఖర్, పెబ్బేర్ పట్టణ నేత శాంతమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

**మర్పల్లి, ఏప్రిల్ 28 (జనంసాక్షి) :** బాలికలు తమ కెరీర్ పైన దృష్టి పెట్టాలని, తద్వారా వారు ఆర్థికంగా నిలదొక్కుకోవడమే కాక జీవితంలో ముందుకు వెళ్లగలరని, బాలికలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే దేశం, రాష్ట్రం, జిల్లా అభివృద్ధి చెందుతుందని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల్లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని కొట్లాపూర్, ఘనాపూర్ సబ్ సెంటర్లను మర్పల్లి కమ్యూనిటి హెల్త్ సెంటర్ ను ఆకస్మిక తనిఖీ చేశారు. మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసి, మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ వాత్సల్య పథకం, జిల్లా మహిళా శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కౌమార దశల బాలికలు గర్భాలు దాల్చడం వలన కలిగే అనర్థాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలను నిర్మూలనకు కృషి చేయాలని, బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పౌష్టిక ఆహారం తీసుకోవాలని, బాలికల పౌష్టిక కారా విషయంలో ఆరోగ్య శాఖ నుంచి ఏఎన్ఎం, మహిళా శిశు సంక్షేమ శాఖ నుండి అంగన్వాడీ టీచర్లు రెగ్యులర్గా ఫాలో అప్ చేయాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారిని కృష్ణవేణి మాట్లాడుతూ బాలికలు రక్తహీనత బారిన పడకుండా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు బలవర్ధకమైన పౌష్టికాహారం తీసుకోవాలి మరియు గర్భాశయము ముఖ ద్వారా క్యాన్సర్ రాకుండా వ్యాక్సిన్




తప్పకుండా తీసుకోవాలని హెచ్ పి వి వ్యాక్సినేషన్ 9 నుండి 18 సంవత్సరాలు బాలికలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు, ముఖ్యంగా బాలికలకు విద్యా ఉద్యోగ అవకాశాల కల్పనకు మరియు మహిళా సాధికారతకు కృషి చేయాలని తెలిపారు. ఉప వైద్యాధికారి జ్యోతి మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరమని, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, వ్యాయామం అలవాటు చేసుకోవాలని సూచించారు.

**ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ..**

ప్రభుత్వ ఆసుపత్రిలకు వచ్చే ప్రతి రోగికి మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రులోని వార్డులో ల్యాబ్, ఫార్మసీ, గదులను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు.. వైద్యం కోసం వచ్చిన రోగులతో కలెక్టర్ మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని, వారికి అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో పనిచేసే డాక్టర్లు సిబ్బంది సమయాల పాలన పాటించాలని అన్నారు. పాడైపోయి ఉన్న ఎక్సరే మిషను వెంటనే మరమ్మత్తులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. బయోమెట్రిక్ ఆధార్ టెస్ట్ హాజీరో నివేదికను చూపాలని కోరారు. అయితే సిబ్బంది నుంచి సరైన సమాధానం రాకపోవడంతో కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పనిసరి అని హెచ్చరించారు. మండలంలో 108 అంబులెన్స్ సేవలు సక్రమంగా లేక గర్భిణీలు రోగులు ఇబ్బందులకు పడుతున్నారని ల్యాబ్ టెక్నీషియన్ సివిల్ సర్జన్ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రిలో చుట్టూ తిరగవలసి వస్తుందని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ ప్రవీణ, ప్రోగ్రాం ఆఫీసర్ పవిత్ర, ఐసిడిఎస్ సూపర్వైజర్లు రిజ్వాన, వైష్ణవి, జయశ్రీ ఇందిరా కాంతి పథకం ఏపిఎం అంజిరెడ్డి, కమ్యూనిటీ కోఆర్డినేటర్, డిస్టిక్ చైర్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీకాంత్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఆంజనేయులు, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ రాజు నాయక్, డి సి పి యు కౌన్సిలర్ లక్ష్మణ్, జ్యోతి, మహిళా సాధికారత సిబ్బంది వరలక్ష్మి, రాందాస్, బాబు సఖి అడ్మినిస్ట్రేటర్ యశోద, తాసిల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ రామేశ్వర్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ స్వీయ గణన ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి, ఏప్రిల్ 28 (జనంసాక్షి) :** డిజిటల్ స్వీయ గణన ప్రక్రియను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. ఆన్ లైన్ వెబ్ సైట్ https://se.census.gov.in ద్వారా తన వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్ పాండు, సెన్సెస్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రమాదేవి, సిపిఓ తో కలిసి కలెక్టర్ మీడియా తో ప్రెస్ మీట్ ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జన గణన ప్రక్రియను సులభంగా, సమగ్రంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం డిజిటల్ స్వీయ గణన విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. ఆన్లైన్ ద్వారా ప్రజలు తమ వ్యక్తిగత, కుటుంబ వివరాలను వెబ్ పోర్టల్ లో కానీ , మొబైల్ యాప్ ద్వారా స్వయంగా నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించారని కలెక్టర్ తెలిపారు. స్వీయ గణన ఈ నెల 26 నుండి ప్రారంభమైందని,మే 10వ తేదీ వరకు స్వీయ నమోదు చేసుకోవచ్చని సూచించారు. జన గణనకు సంబంధించిన సమాచారాన్ని 15 నిమిషాల వ్యవధిలో పూర్తి చేసుకోవచ్చని




అన్నారు. వివరాలు నమోదు చేసిన అనంతరం ప్రత్యేకమైన సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐడి (సైడ్) జారీ చేయబడుతుందని తెలిపారు. ప్రభుత్వంచే నియమించబడిన ఫీల్డ్ ఎన్యుమరేటర్లు క్షేత్రస్థాయిలో ఇంటికి వచ్చిన సమయంలో వారికి సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐ.డి నెంబర్ తెలియజేయాలని సూచించారు. ప్రజలు తమ వివరాలను ప్రస్తుతం ఆన్లైన్ పోర్టల్ ద్వారా స్వీయ నమోదు చేసుకుంటే, ఆన్లైన్లో నమోదు చేసిన సమాచారాన్ని సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐ.డి ద్వారా ఎన్యూమరేటర్ పరిశీలించి ధృవీకరిస్తారని అన్నారు. దీనివల్ల ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాల్లో ఉండే వారు, విద్యార్థులు, వలస కార్మికులు, ప్రయాణాల్లో ఉన్న ప్రజలు కూడా జనగణనలో వివరాలు నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించారని కలెక్టర్ తెలిపారు.స్వీయ గణనలో ఖచ్చితమైన చిరునామా, సరైన వివరాలు నమోదు చేయాలని, వీటి ఆధారంగానే ఎన్యూమరేటర్లను నియమించడం జరుగుతుందన్నారు. జనగణన ప్రక్రియలో సాంకేతికతను వినియోగించి సమగ్రతను పెంచడం, ప్రతి పౌరుడి వివరాలు జన గణనలో చేరేలా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన డిజిటల్ స్వీయ గణన ప్రక్రియను జిల్లాలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ప్రతి ఒక్కరి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని భరోసా కల్పించారు. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, సమగ్ర అభివృద్ధి సాధించేందుకు ఎంతగానో దోహదపడే జన గణనలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని, జిల్లాలో ఈ ప్రక్రియ విజయవంతం అయ్యేందుకు సహకరించాలని కలెక్టర్ కోరారు. డిజిటల్ స్వీయ గణన గురించి ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించి ప్రజలను చైతన్య పరచాలని కలెక్టర్ కోరారు.

## గోమాత రక్షణ కోసం చట్టాలు అమలు చేయాలి



**బొంరాస్‌పేట, ఏప్రిల్ 28 (జనం సాక్షి) :** గోమాత గౌరవ దినోత్సవం సందర్భంగా గోమాత రక్షణ కోసం చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని కోరుతూ గో ఆరాధన ఉద్యమ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన తిరిగి ప్రజల నుండి సంతకాలు సేకరించిన పత్రాలను మంగళవారం స్థానిక తహసీల్దార్ పద్మావతి కి అందజేశారు.ఈ సందర్భంగా గో ఆరాధన మండల కమిటీ సభ్యులు రాజు నాయక్ మాట్లాడుతూ గోవును దేశమాతగా గుర్తించాలని గో సేవ కోసం మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల గో ఆరాధన కమిటీ సభ్యులు మహేందర్ గౌడ్,రాజా రామ్ రెడ్డి, శ్రీకాంత్ ,మహేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి, ఏప్రిల్ 28 (జనం సాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. మంగళవారం నారాయణఖేడ్ మండలం తుర్కపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నిర్వహణ విధానాన్ని సమగ్రంగా పరిశీలించారు. రిజిస్టర్లు తనిఖీ చేయడంతో పాటు ల్యాబ్, ఫార్మసీ తదితర విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో కలెక్టర్ మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. గర్భిణులతో ప్రత్యేకంగా మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలు, చెకప్‌లు క్రమం తప్పకుండా జరుగుతున్నాయా అనే విషయాలను తెలుసుకున్నారు. ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా, అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా అనే అంశాలపై సంబంధిత అధికారులను ప్రశ్నించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు మరియు ఇతర అత్యవసర మందులు అందుబాటులో ఉన్నాయని



మెడికల్ ఆఫీసర్ తెలిపారు.ప్రతి రోజు ఇన్‌పేషెంట్స్, ఔట్‌పేషెంట్స్ సంఖ్య, గర్భిణీల చెకప్‌లు, అందుబాటులో ఉన్న పరీక్షలు, ప్రతి నెల జరిగే ప్రసవాల సంఖ్య తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించడం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలన్నారు. ముఖ్యంగా సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా వైద్యులు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమా హారతి, ఎంపీడీవో, మెడికల్ ఆఫీసర్, తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ సరఫరా నిరంతరం కొనసాగేందుకు చర్యలు

**వనపర్తి బ్యూరో, ఏప్రిల్ 28 (జనంసాక్షి) :** జిల్లాలో పెట్రోల్ ,డీజిల్ సరఫరా నిరంతరంగా కొనసాగేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కొత్తకోట తహసిల్దార్ కార్యాలయం నుంచి జిల్లాలో



ఇంధన లభ్యతపై తహసిల్దార్లతో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వెబ్ఎక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం తో పాటు అన్ని మండలాల తహసీల్దార్ల, ఇంధన అవుట్ లెట్ డీలర్లు, ఎస్ ఓలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బావుల వద్ద ప్రమాదాలు నివారించేందుకు అవగాహన

**మల్దకల్, ఏప్రిల్ 28 (జనంసాక్షి) :** వేసవి సెలవుల సందర్భంగా జోగులాంబ గద్వాల్ జిల్లా మల్దకల్ మండల పరిధిలోని పలు గ్రామాలలో ఉన్న బావుల వద్ద ఇటీవల చిన్నారులు ఎక్కువ సంఖ్యలో ఈత కొట్టడానికి వస్తుండటంతో వారి భద్రతను దృష్టిలో పెట్టుకొని మల్దకల్ పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు,మల్దకల్ ఎస్ఐ శ్రీహరి సూచనలతో ఏ.ఎస్సై ఈశ్వరయ్య, కానిస్టేబుల్ సురేశ్ నాయుడు, తిప్పరెడ్డిలు మండలంలోని పలు గ్రామాల్లోని బావుల



వద్దకు వెళ్లి అక్కడ ఈతకు వచ్చిన చిన్నారులకు భద్రతపై మంగళవారం అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పోలీసులు చిన్నారులకు పలు జాగ్రత్తలు సూచించారు.పిల్లలు ఎప్పుడైనా బావులకు ఈత కొట్టడానికి వెళ్లాలనుకుంటే ముందుగా ఇంట్లో తల్లిదండ్రులకు లేదా పెద్దలకు తప్పనిసరిగా చెప్పి వారి సహాయంతో మాత్రమే వెళ్లాలని సూచించారు. సరదాగా లేదా ఆకతాయి తనంతో స్నేహితులతో కలిసి ఒంటరిగా బావులకు వెళ్లడం చాలా ప్రమాదకరమని, అలాంటి నిర్లక్ష్యం వల్ల ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని హెచ్చరించారు. పిల్లలు బావుల వద్ద ఆడుకోవడం లేదా ఈత కొట్టడం సమయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని, బావుల వద్ద జారిపడే ప్రమాదం కూడా ఉంటుందని పోలీసులు తెలిపారు.ఈత బాగా రాకపోయినా సరదాగా నీళ్లలోకి దిగడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని చెప్పారు.అందువల్ల పిల్లలు ఎప్పుడూ ఒంటరిగా బావులకు వెళ్లకుండా పెద్దల పర్యవేక్షణలోనే ఈత కొట్టాలని సూచించారు. అలాగే పిల్లలు బావులకు వెళ్లే ముందు ఇంట్లో పెద్దలకు తెలియజేయాలని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారో తెలుసుకొని జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు పేర్కొన్నారు. పిల్లలు నీళ్లలో ఉన్న సమయంలో పెద్దలు అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను ముందుగానే గుర్తించి నివారించవచ్చని తెలిపారు.ప్రాణం విలువ ఎంతో గొప్పదని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని ఈ సందర్భంగా చిన్నారులకు పోలీసులు వివరించారు. గ్రామాల్లోని బావుల వద్ద భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మల్దకల్ పోలీసులు సూచించారు.

# వేసవిలో త్రాగునీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**నారాయణఖేడ్, ఏప్రిల్ 28 (జనం సాక్షి) :** వేసవి సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ప్రతి నివాస ప్రాంతానికి నిరంతర తాగునీటి సరఫరా జరిగేలా ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. మంగళవారం నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని మండలాల ఎంపీడీవోలు, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, ఎంపీఓలు, మున్సిపల్ కమిషనర్, విద్యుత్, తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచినీటి సరఫరా, ఇందిరమ్మ ఇండ్లు, శానిటేషన్, సాదా బైనామాలు, భూభారతి దరఖాస్తుల పరిష్కారం వంటి అంశాలపై వివరంగా చర్చించారు. మండలాల వారీగా గ్రామాల్లో నీటి సరఫరా పరిస్థితి, అందుబాటులో ఉన్న నీటి వనరులు, మరమ్మతులు అవసరమైన పనులపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత వేసవిలో సమస్యలు ఎదురైన




ప్రాంతాలను గుర్తించి, ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. చుక్క నీరు కూడా వృథా కాకుండా సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ప్రతి ఇంటికి తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే ముందుగానే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి, యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని సూచించారు. అలాగే అన్ని గ్రామ పంచాయతీలలో పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా అమలు కావాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ పరిధి స్పష్టంగా తెలిసేలా ప్రతి గ్రామ పంచాయతీకి ప్రారంభం, ముగింపు సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఎంపీడీవోలకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ పనులు త్వరగా పూర్తి చేసేలా చూడాలని, బిల్లులు ఆలస్యం లేకుండా వెంటవెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులకు ఆదేశించారు.సాదా బైనామాలు, భూభారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని రెవిన్యూ అధికారులకు సూచించారు. విద్యుత్ శాఖకు సంబంధించి లో వోల్టేజ్, ట్రాన్స్ఫార్మర్లు, లైన్ల మరమ్మత్తులు వంటి సమస్యలను 15 రోజుల్లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీఓలు, విద్యుత్, హౌసింగ్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనపై మానవహారం



**శివ్వంపేట, ఏప్రిల్ 28 (జనంసాక్షి) :** మండల కేంద్రమైన శివ్వంపేటలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం బాల్య వివాహాల నిర్మూలనపై మండల స్థాయి అధికారులతో పాటు వారి సిబ్బంది విద్యార్థులతో కలసి మానవహారం నిర్వహించి ర్యాలీ చేశారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యవివాహాలతో కలిగే అనార్థాలు, ఇబ్బందులను అర్థమయ్యేలా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకట లక్ష్మమ్మ, డాక్టర్ సాయిసౌమ్య, ఎస్ఐ మధుకర్ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, ఐకేపీ ఏపీఎం పెంటాగౌడ్, సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
29 ఏప్రిల్ 2026

# ఆడపిల్లలకు ఆర్థిక స్వాతంత్ర్యం అవసరం

- జీవితంలో అనుకున్నది సాధించాలి
- చిన్న వయసులో పెళ్లిళ్లు వద్దు
- జిల్లా కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 28 (జనం సాక్షి) :** ఆడపిల్లకు ఆర్థిక స్వాతంత్రం అవసరమని, చిన్న వయస్సులో పెళ్లి చేసుకోకుండా ఉన్నత చదువులు చదివి జీవితం లో అనుకున్నది సాధించాలని జిల్లా కలెక్టర్ సీ.హెచ్. ప్రియాంక సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక ,బాలల భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మహిళాభి వృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కౌమార బాలి కల గర్భధారణ సమస్యలపై, ఇంటి నుంచి పారిపోవడం అనే అంశంపై జిల్లా బాలల సంరక్షణ విభాగం మద్దూరు రైతు వేదికలో కిశోర బాలికల తో ఏర్పాటు చేసిన కార్యక్ర మానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూఒక్క నిర్ణయం జీవితాన్నే మార్చేస్తుందని, ఎలాంటి పరిస్థితుల్లోనైనా తొందర పాటు నిర్ణయం తీసుకోరాదని చెప్పారు.తాను హాస్టల్ లో చదువు కునే రోజుల్లో తన రూమ్ మెట్ ఒక అమ్మాయి వాళ్ల అమ్మకు ఆరోగ్యం బాగా లేదని చదువు ఆపేసి పెళ్లి చేసుకుందని, ఇప్పుడు ఆమె ఇద్దరు పిల్లలతో సాధారణ గృహిణిగా జీవనం సాగిస్తోందని, అదే చిన్న వయసులో పెళ్లి చేసుకోకుండా ఉంటే చదువుకుని ఉంటే ఇప్పుడు ఆమె ఎంతో ఉన్నత స్థాయి ఉద్యోగంలో ఉండేదని కలెక్టర్ చెప్పారు. అలాగే 2012 లో తాను డిప్యూటీ కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఒక కౌమార దశ బాలిక ప్రేమ పేరిట ఆకర్షణకు గురైతే స్వయంగా తానే పోలీసులు, అంగన్ వాడీ సీ డి పీవో లకు సమాచారం ఇచ్చి బాల్య వివాహాన్ని అడ్డుకున్నానని అప్పటి జ్ఞాపకాలను కలెక్టర్ విద్యార్థినులతో పంచుకు న్నారు.కౌమార దశలో ప్రేమా, ఇష్టం, అభిమానం అనేవి కేవలం ఆకర్షణ అని, విద్యార్థినిలు వాటికి దూరంగా ఉండాలని కలెక్టర్ హితవు చెప్పారు. బాలికలు మంచిగా చదువుకుని జీవితంలో సెట్ కావాలని అప్పుడే ఆ తర్వా త జీవితం ప్రశాంతంగా ఉంటుందన్నారు. కౌమార వయసులో పెళ్లిళ్లు చేసుకో వడం వల్ల వచ్చే ఆరోగ్యపర మైన, సామాజికపరంగా వచ్చే సమస్యలు వాటి వల్ల ఎదుర్కొనే ప్రమాదాలపై అదేవిధంగా ఇంటి నుంచి పారిపోవడం వలన లైంగిక దోపిడి,శ్రమ దోపిడి, అక్రమ రవాణా జరగడం, చట్ట పరంగా వచ్చే సమస్యల గురించి వివరించారు. బాల్యవివాహాల నిరోధక చట్టం ,బాలలపై జరిగే లైంగిక దోపిడీ నుంచి రక్షణ చట్టాల గురించి, ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సోషల్ మీడియా ప్రభావం గురించి బాలికలకు అవగాహన కల్పించారు. ప్రతి బాలిక వాళ్లు అనుకున్న లక్ష్యాన్ని సాధించే విధంగా చదువు కోవాలని జీవితంలో ఆర్థిక స్థిరత్వం సాధించడం వల్లనే ఏదైనా సాధ్యపడుతుందని ప్రతి ఒక్కరూ చదువు కొనసా గించడంపై దృష్టి పెట్టి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్ డీ సీ ఆర్డీవో రాజేందర్ గౌడ్, మద్దూరు మున్సిపల్ చైర్ పర్సన్ సరస్వతి జనార్దన్,కమిషనర్ శ్రీకాంత్, డిపివో సుధాకర్ రెడ్డి, తహసిల్దార్ మహేష్, డిసిపిఓ కరిష్మా, ఎంపీడీవో, సిడిపిఓ, చైల్డ్ వెల్ఫేర్ అధికారి తిరుపత య్య, అంగన్వాడి సూపర్ వైజర్లు, డిసిపియు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను నిరోధించడం ప్రతి ఒక్కరి బాధ్యత




**తూప్రాన్, ఏప్రిల్ 28 (జనం సాక్షి) :** బాల్య వివాహాలను నిరోధించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తూప్రాన్ ఆర్డిఓ జయచంద్ర రెడ్డి తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా బాల్య వివాహాల నిరోధం బాలికల సంరక్షణ డ్రగ్స్ నియంత్రణపై నర్సాపూర్ చౌరస్తాలో మానవహారం, ఆర్డీవో జయచంద్ర రెడ్డి, తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్, సిఐ రందకృష్ణ ,ఎస్సై గంగరాజు ఆధ్వర్యంలో జరిగింది. మున్సిపల్ ఆఫీస్ నుంచి నర్సాపూర్ చౌరస్తా వరకు ర్యాలీ గా వెళ్లి బాల్య వివాహం బతుకు ఆగం అనే స్లోగన్ తో బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతిజ్ఞ చేశారు. బాలల రక్షణ కొరకు , మహిళా రక్షణ కొరకు తీసుకోవలసిన చర్యలపై, బాలల హక్కులకు మహిళా హక్కులకై అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉదండాపూర్ నిర్వాసితుల పరిహారం విడుదల చేయండి

- డిప్యూటీ సీఎంకు ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి విజ్ఞప్తి



**జడ్చర్ల, ఏప్రిల్ 28 (జనంసాక్షి) :** ఉదండాపూర్ భూ నిర్వాసితులకు అందాల్సిన మిగిలిన రూ. 200 కోట్ల పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని డిప్యూటీ సీఎంను జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి కోరారు. మంగళవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన ఎమ్మెల్యే ఇప్పటికే రూ. 150 కోట్లు విడుదలయ్యాయని, మిగతా మొత్తం కోసం నిర్వాసితులు ఎదురు చూస్తున్నారని వివరించారు. అలాగే నియోజకవర్గ అభివృద్ధికి ఎస్.డి.ఎఫ్, ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు మంజూరు చేయాలని అభ్యర్థించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, త్వరలోనే నిధుల విడుదలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## సీనియర్ సిటిజన్ డే కేర్ సెంటర్ ఏర్పాటు

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 28 (జనం సాక్షి) :** గద్వాల పట్టణంలో వృద్ధుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, మహిళ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖతో పాటు రెడ్ క్రాస్ సంస్థల సహకారంతో సీనియర్ సిటిజన్ డే కేర్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రం గద్వాల పట్టణంలోని రెండవ రైల్వే గేట్ సమీపంలో ఉన్న పాత సాయుధ దళాల కార్యాలయ ప్రాంగణంలో, పంచాయతీరాజ్ ఇంజనీర్ కార్యాలయం పక్కన ప్రారంభించబడినట్లు ఆయన తెలిపారు. ఈ కేంద్రం ప్రతిరోజు ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 6:00 గంటల వరకు పనిచేస్తుంది. ఆదివారాలు, ప్రభుత్వ సెలవు దినాలలో మూసివేయబడుతుంది.ఈ కేంద్రంలో వృద్ధులకు మధ్యాహ్న భోజనం, సాయంత్రం టీ అల్పాహార సౌకర్యాలు కల్పించబడతాయి. అదేవిధంగా, 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ప్రాథమిక సంరక్షణ, ఆరోగ్య సేవలు,సామాజిక మద్దతు అందించబడుతుంది. వృద్ధుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ఈ కేంద్రం యొక్క ప్రధాన లక్ష్యం.ఇంకా టీవీ, వార్తాపత్రికలు, ఇండోర్ గేమ్స్, తోటి వృద్ధులతో సమయం గడపడానికి సామాజిక కార్యక్రమాలు వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. అర్హులైన వృద్ధులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.మరిన్ని వివరాలకు 9949463238 ను సంప్రదించగలరనీ ఆయన అన్నారు.

## డ్రగ్స్ నిర్మూలన, బాలల, పిల్లల భద్రత అందరి బాధ్యత

- వనపర్తి డిసీఆర్బి డిఎస్పీ బాలాజీ నాయక్




**వనపర్తి బ్యూరో, ఏప్రిల్ 28 (జనంసాక్షి) :** బాలల భద్రతను పర్యవేక్షించడం, వ్యసనాలకు అలవాటుపడ్డ వారిలో మార్పు తేవడం, నేటి యువతను పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని జిల్లా నుండి పారదోలడమే ముఖ్య ఉద్దేశమని, వనపర్తి డిసిఆర్బి డీఎస్పీ బాలాజీ నాయక్ అన్నారు.మంగళవారం ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు నిర్వహిస్తున్న, ఆరు రోజుల బాలల భద్రత, రక్షణ మరియు మాదకద్రవ్యాల వ్యతిరేక సంక్షేమ వారోత్సవాలలో భాగంగా రెండవ రోజు మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ విద్యార్థులకుభరోసా, ఏహెచ్‌టియు, షీ-టీమ్ సంయుక్తంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి, వనపర్తి డిసిఆర్బి డీఎస్పీ శ్రీ బాలాజీ నాయక్, ముఖ్య అతిథిగా పాల్గొని లింగ సమానత్వం,సమ్మతి, సైబర్ నేరాలు, యవ్వన దశలో యువతలో సురక్షిత ప్రవర్తన సమస్యలు ఎదురైనప్పుడు ఫిర్యాదు చేసే విధానం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన హక్కులు, బాధ్యతలు తెలుసుకొని సురక్షితంగా ఉండటం చాలా అవసరం. సమాజంలో జరుగుతున్న మార్పులను అర్థం చేసుకుని, సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ సైబర్ నేరాల నుంచి అప్రమత్తంగా ఉండాలని లింగ సమానత్వం ప్రతి ఒక్కరి బాధ్యత. అమ్మాయిల పట్ల గౌరవం, సమ్మతి, పట్ల అవగాహన ఉండటం సమాజాన్ని మరింత సురక్షితంగా మారుస్తుందని ఏ సమస్య వచ్చినా భయపడకుండా వెంటనే పోలీసులను లేదా షీ-టీమ్‌ను సంప్రదించాలి. మీ భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో భద్రతపై అవగాహన పెంపొందడంతో పాటు, సురక్షిత సమాజ నిర్మాణంలో యువత పాత్రను మరింత బలపరిచే దిశగా ముందడుగు వేయాలని మాదక ద్రవ్యాల వాడకం వల్ల ఆరోగ్యం క్షీణించడమే కాకుండా యువత ఉజ్వలమైన భవిష్యత్తు అంధకారమవుతుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్ టి యు, ఎస్సై,అంజద్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, మరియు అధ్యాపకులు, భరోస కోఆర్డినేటర్, శిరీష, షీ టీం సిబ్బంది, శ్రీనివాస్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జనగణన ఖచ్చితత్వంతో నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్



**వనపర్తి బ్యూరో, ఏప్రిల్ 28 (జనంసాక్షి) :** జనగణన పనులు ఖచ్చితత్వంతో, పారదర్శకంగా నిర్వహించాలని, ప్రతి కుటుంబ వివరాలను సరైన రీతిలో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్ ఆదేశించారు.మంగళవారం అదనపు గోపాలపేటలోని జెడ్‌పీహెచ్‌ఎస్ గర్ల్స్ హై స్కూల్‌లో నిర్వహించిన జనగణన శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మరియు తహసీల్దార్‌తో కలిసి శిక్షణ కార్యక్రమాన్ని సమీక్షించారు.శిక్షణలో భాగంగా ఎన్యూమరేటర్లకు అందిస్తున్న మార్గదర్శకాలను పరిశీలించిన అదనపు కలెక్టర్, జనగణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు చేశారు. ముఖ్యంగా డిజిటల్ జనగణన విధానంపై అధికారులు, సిబ్బంది పూర్తి అవగాహనతో పని చేయాలని సూచించారు. అనంతరం శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడిన అదనపు కలెక్టర్ , జనగణన పనులు ఖచ్చితత్వంతో, పారదర్శకంగా నిర్వహించాలని, ప్రతి కుటుంబ వివరాలను సరైన రీతిలో నమోదు చేయాలని కోరారు. డిజిటల్ విధానాన్ని సద్వినియోగం చేసుకొని వేగవంతంగా, సమగ్రంగా జనగణన పూర్తిచేయాలని ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో సిపిఓ హరికృష్ణ, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పంటల మార్పిడితోనే నేల సారవంతం

- వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ భానుశ్రీ



**నారాయణపేట, ఏప్రిల్ 28 (జనం సాక్షి) :** పంటల మార్పిడి వల్లనే భూమి యొక్క సారవంతం పెరుగుతుందని దానివల్ల రైతులకు అధిక దిగుబడి పొందే అవకాశాలు ఎక్కువ అని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎం ఆర్ భాను శ్రీ అన్నారు మంగళవారం మండలంలోని జాజాపూర్ రైతు వేదిక లో అన్నదాతల కు అవగాహన కార్యక్రమం నికి ఆమె హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ పంటలకు క్రిమినాశకాలు ఆధునిక వ్యవసాయ పద్ధ తులు పంటల మార్పిడి వాతావరణ పరిస్థితుల్లో ఏ పంటను సాగు చేయాలో అధిక దిగుబడి రాబట్టడం ఎలా అనే అంశాలపై రైతు లకు అవగాహన కల్పించారు రైతులు ఒకే పంటను సాగు చేయడంతో అధిక దిగుబడి ని పొందలేరని పంట మార్పి డి వల్ల భూసారం పెరిగి రైతు లకు అధిక లాభాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆమె అన్నారు. మండల వ్యవసాయ అధికా రి దినాకర్ మాట్లాడుతూ రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం పై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మని రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలను పాటించాలని ఆరోగ్యానికి హానికరమైన పురుగుమం దులను వాడకుండా జీవ వైవిధ్యమైన రసాయనలను వాడుకోవాలని ఆయన రైతు లకు సూచించారు మండలం లోని రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా మని రైతులు శాస్త్రవేత్తలు యొక్క సలహా సూచనలు పాటిస్తూ అధిక లాభాలను పొందాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ రాజేష్, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ ప్రియా సుకృత, సర్పంచ్, ఉప సర్పంచ్ ,వెంకోబా, లక్ష్మీకాంత్, వెంక టేష్,రైతులు సిబ్బంది విద్యా ర్థులు తదితరులు పాల్గొ న్నారు.

## వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 28 (జనం సాక్షి) :** నారాయణ పేట మండలం సింగారం వరి ధాన్యం కొనుగో లు కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్సీ.హెచ్.ప్రియాంక పరిశీలించారు.కేంద్రానికి ఇంతవరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యం వచ్చిందని, తేమ శాతం సరిగ్గా ఉంటుందా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు.ధాన్యం తేమ శాతాన్ని ఆమె చెక్ చేశారు.నిన్న సాయంత్రం కురిసిన తేలిక పాటి వర్షానికి కేంద్రంలోని ధ్యానం ఏమైనా తడిసిందా అని ఆరా తీశారు.ధాన్యం సేకరణకు అవసరమైన తేమ శాతం కొలిచే యంత్రాలు, టార్పాలి న్లు, ఎలక్ట్రానిక్ కాంటాలు, గన్ని బ్యాగులు అందుబా టులోఉంచుకోవాలని, ఇంకా అవరమైన వాటి కోసం ఇండెంట్లు పెట్టి తెప్పించుకో వాలని ఆమె సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలింప చేయాలన్నారు. ఒకరిద్దరు రైతులతో మాట్లాడి కేంద్రాని కి ఎప్పుడు వచ్చారు ?ఎన్ని బస్తాల ధ్యానం తీసుకువ చ్చారని వాకబు చేశారు. కేంద్రంలో కొనుగోలు చేసిన సన్న రకం,దొడ్డు రకం వడ్లను వేరువేరుగా నిల్వ చేసి మిల్లులకు తరలించాలని ఆదేశించారు.జిల్లాలో ఉన్న రైస్ మిల్లులు ,కేంద్రా ల్లో కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను ఆయా మిల్లులకు తరలించే ప్రక్రియ గురించి రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను కలెక్టర్ కు క్లుప్తంగా వివరించారు.ఈ కార్యక్రమంలో డీసీవో ఎన్.ప్రసాద్ రావు,అసిస్టెంట్ డీసీవో ఆంజనేయులు, సివిల్ సప్లై అధికారి సైదులు, స్థానిక సింగిల్ విండో కార్యాలయ సీ.వో. పళ్ళ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయం ద్వారా అధిక దిగుబడి



**తూప్రాన్, ఏప్రిల్ 28 (జనం సాక్షి) :** సేంద్రియ వ్యవసాయం ద్వారా అధిక దిగుబడి సాధించాలని వ్యవసాయ శాస్త్రవేత్త సైదా నాయక్ తెలిపారు వెంకటాపూర్ గ్రామంలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" అనే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో క్రింది అంశాల పైన రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ యూరియా వాడకం సాగు ఖర్చు తగ్గించుకోవడం వలన అధిక దిగుబడి సాధించవచ్చు అని అన్నారు. అవసరం మేరకు రసాయాలను వినియోగించడం, పంట మార్పిడి విధానం పాటించాలని దీంతో ఎక్కువ దిగుబడి వస్తుందని అన్నారు. మార్కెట్లో గిరాకీ ఉన్న వరి రకాలను సాగు చేయాలని, సేంద్రియ వ్యవసాయం గురించి. వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గంగమలు ఏ ఈ ఓ సంతోష్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ హైమావతి




**సిద్ధిపేట బ్యూరో, ఏప్రిల్ 28 (జనంసాక్షి) :** మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్లో మే-3 తేదీన నీట్(నీట్) - 2026 ఆఫ్ లైన్‌లో జరగబోయే పరీక్షకు సంబంధించి జిల్లాలోనీ రెండు పరీక్షా కేంద్రాల్లో నిర్వహణ గూర్చి జిల్లా కలెక్టర్ కె. హైమావతి సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యూజిసి - నీట్ - 2026 ఆఫ్ లైన్ పరీక్ష మే-3 వ తేదీన మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు జిల్లా కేంద్రంలో 2 సెంటర్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించే 937 మంది విద్యార్థులు పరీక్ష రాయనుండగా దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) మార్గదర్శకాల ప్రకారం సెంటర్ లను ఎంపిక చేసి ఆ సెంటర్ లో సీసీ కెమెరా, పవర్ సప్లై, వాటర్ ఫెసిలిటీ, ఫర్నిచర్, టాయిలెట్స్ ఇతరత్రా అన్ని సౌకర్యాలు ముందస్తుగా చెక్ చేయాలని అధికారులను ఆదేశించారు. మే 2, 3వ తేదీన రెండు సెంటర్లలో ఎలాంటి విద్యుత్ కోతలు లేకుండా చూసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను, వైద్య శిబిరం ఏర్పాటు చెయ్యాలని డిఎంఅండ్ఎచ్ఓకి, విద్యార్థులకు సకాలంలో సెంటర్కు చేరుకునేలా అదనపు బస్సులు నడపాలని ఆర్టీసీ డిఎంను ఆదేశించారు. పరీక్ష రోజు స్ట్రాంగ్ రూమ్ నుండి ఎగ్జామ్స్ సెంటర్ కు పరీక్ష పేపర్లను ఎస్కార్ట్ సహాయంతో తీసుకురావాలని అలాగే రెండు సెంటర్లలో ప్రిస్కింగ్, చుట్టూ 144 సెక్షన్ అమలు చేస్తూ పకడ్బందీగా బందోబస్తు నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.పరీక్ష రాసే 937 విద్యార్థులు అలాట్మెంట్ కార్డు, ఒరిజినల్ రెండు పాస్ ఫొటోస్, ఒరిజినల్ గుర్తింపు కార్డు మాత్రమే తీసుకురావాలని మిగతా ఎలాంటి వస్తువులు తీసుకురావద్దని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, డిఆర్ఓ నాగరాజమ్మ, ఏఓ రాజ్ కుమార్, కెవి ప్రిన్సిపల్ సూర్య ప్రకాష్, నవోదయ స్కూల్ ప్రిన్సిపల్ రాజేందర్, ఈ డి ఎం ఆనంద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

# మహబూబాబాద్ పార్లమెంట్ ఎంపీపై ప్రజాగ్రహం!

- ఓటు వేసి గెలిపిస్తే.. వెతుక్కునే పరిస్థితి తెచ్చిన పోరిక బలరాం నాయక్
- హాస్టల్ సీట్లు, కళ్యాణ లక్ష్మి చెక్కుల కోసం విద్యార్థుల తల్లిదండ్రుల హాహాకారాలు!



**మహబూబాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 28 (జనం సాక్షి):** రాజకీయ నాయకులకు అధికారం వచ్చే వరకు ప్రజలే దేవుళ్లు.. అధికారం దక్కిన తర్వాత ఆ ప్రజలే వారికి పరాయివాళ్లు అవుతున్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే ఇది అక్షర సత్యం అనిపిస్తోంది. నియోజకవర్గ ప్రజల సమస్యలను పార్లమెంట్‌లో వినిపించి, స్థానికంగా వారికి అందుబాటులో ఉండాల్సిన ఎంపీ పోరిక బలరాం నాయక్, గత కొన్ని నెలలుగా ప్రజలకు ముఖం చాటేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విద్యా సంవత్సరం ప్రారంభమై విద్యార్థులు హాస్టళ్లలో సీట్లు సంపాదించుకోవడానికి నానా తంటాలు పడుతున్న తరుణంలో, ఎంపీ సహాయం అందకపోవడంపై తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రికమెండేషన్ లెటర్ల కోసం తిప్పలు పడుతున్నారు. దూరాభారం నుంచి వచ్చే నిరుపేద విద్యార్థులు హాస్టల్ సీట్ల కోసం ఎంపీ రికమెండేషన్ లెటర్ల కోసం ఆఫీసు చుట్టూ తిరుగుతున్నారు. మేము రెక్కాడితే గాని డొక్కాడని వాళ్లం. మా పిల్లలను చదివించుకోవడానికి ఒక్క లెటర్ కోసం నెల రోజులుగా పనులు మానుకుని ఎంపీ ఆఫీసు దగ్గర కాపలా కాస్తున్నాం. అక్కడ ఉన్న పీఆర్వోలు మాత్రం 'సార్ వచ్చినప్పుడే ఇస్తాం' అని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. మా పిల్లల సీట్లు రాకపోతే దానికి బాధ్యులు ఎవరు అంటూ తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

### కళ్యాణ లక్ష్మి చెక్కుల నిరీక్షణ అప్పుల ఊబిలో పేదలు!..

పేదింటి ఆడబిడ్డ పెళ్లికి కొండంత అండగా నిలిచే కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో ఎంపీ గైర్హాజరు తీవ్ర ఆటంకంగా మారింది. వందలాది చెక్కులు ఆఫీసులో సిద్ధంగా ఉన్నా, కేవలం ఎంపీ నియోజకవర్గానికి రాకపోవడం వల్ల అవి లబ్ధిదారులకు అందడం లేదు. చెప్పులు అరిగేలా తిరుగుతున్నా.. పెళ్లి కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక, ప్రభుత్వం ఇచ్చే సాయం ఎప్పుడు వస్తుందా అని లబ్ధిదారులు రోజుకోసారి ఎంపీ కార్యాలయానికి వచ్చి వెళుతున్నారు. మా చెప్పులు అరుగుతున్నాయి తప్ప ఎంపీ కనిపించడం లేదు అని ఆవేదన చెందుతున్నారు.

### స్తంభించిన సిఫార్సు వ్యవస్థ -- పీఆర్వోల రాజ్యమేనా?

ఎంపీ కార్యాలయం ప్రస్తుతం అధికారుల కన్నా పీఆర్వోల కనుసన్నల్లోనే నడుస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఏ దరఖాస్తు పట్టుకెళ్లినా సార్ వస్తేనే సంతకాలు అవుతాయి అన్న మూస సమాధానం వినాల్సి వస్తోంది. నెలల తరబడి ఎంపీ సాబ్ రాకపోవడంతో సామాన్యుల నుంచి సీనియర్ కార్యకర్తల వరకు అందరిలోనూ అసహనం పెరిగిపోతోంది. ప్రజా సమస్యలు తీర్చలేని పక్షంలో ఆ కార్యాలయం ఎందుకు? అనే ప్రశ్నలు ఇప్పుడు బహిరంగంగా వినిపిస్తున్నాయి.

ఎంపీ బలరాం నాయక్ వెంటనే నియోజకవర్గంలో పర్యటించి ప్రజల గోడు వినాలి. హాస్టల్ సీట్ల కోసం రికమెండేషన్ లెటర్లు కోరుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఎలాంటి జాప్యం లేకుండా సహాయం అందించాలి. పెండింగ్‌లో ఉన్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను వెంటనే పంపిణీ చేయాలి. ఓటు వేసిన ప్రజలను విస్మరించి, నియోజకవర్గానికి దూరంగా ఉండటం ప్రజాప్రతినిధికి ఏమాత్రం శ్రేయస్కరం కాదు. మహబూబాబాద్ ప్రజలు తమ ఓటు హక్కుతో సాధించుకున్న అధికారం ప్రజల కోసమేనని ఎంపీ గారు గుర్తించాలి. ఇప్పటికైనా నియోజకవర్గ అభివృద్ధిపై, ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని, లేనిపక్షంలో నియోజకవర్గ వ్యాప్తంగా నిరసన జ్వాలలు తప్పవని ప్రజలు హెచ్చరిస్తున్నారు.



# డాక్యుమెంట్ రైటర్స్ లైసెన్సులు రెన్యువల్ చేయాలి

- కొత్త లైసెన్సులు ఇవ్వాలి
- డాక్యుమెంట్ రైటర్ల సంఘం అధ్యక్షులు శివ నాగేశ్వరరావు
- కొనసాగుతున్న డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్

**వరంగల్ బ్యూరో, ఏప్రిల్ 28 (జనం సాక్షి) :** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డాక్యుమెంట్ రైటర్స్ ల లైసెన్సులు రెన్యువల్ చేయాలని, అదేవిధంగా కొత్త లైసెన్సులు ఇవ్వాలని డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శివ నాగేశ్వరరావు అన్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు రోజులపాటు డాక్యుమెంట్ రైటర్లు పెన్డౌన్ చేసి నిరసన తెలుపుతున్న క్రమంలో మంగళవారం రెండో రోజు హనుమకొండ లోని ఆర్ ఆఫీస్ వద్ద జిల్లా డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మూల శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన అసోసియేషన్ బాధ్యులు మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షులు శివ నాగేశ్వరరావు మాట్లాడుతూ వేలాది మందితో ఉన్నటువంటి డాక్యుమెంట్ రైటర్లను ప్రభుత్వం గుర్తించాలన్నారు. వాళ్ళని ఇబ్బంది పెట్టే పయత్నం చేయొద్దని కోరారు. సహజంగా డాక్యుమెంట్ రైటర్లు ఎవరు తప్పులు చేయరని అన్నారు. అదేవిధంగా డాక్యుమెంట్ రైటర్లు తమ వృత్తి నైపుణ్యాన్ని కూడా పెంచుకోవాలని కోరారు. డాక్యుమెంట్ రైటర్లు ఐకమత్యంతో ఉండే సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జహంగీర్ మాట్లాడుతూ డాక్యుమెంట్ రైటర్ల సమస్యల పరిష్కారం అయ్యేవరకు నిరంతరం పోరాటాలు చేయాలని అన్నారు. తమ రాష్ట్ర నాయకత్వం ఎల్లవేళలా ముందుంటుందని పేర్కొన్నారు. 29వ తారీఖున కూడా పెన్డౌన్ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. మావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జహంగీర్ , గోనె రాంప్రసాద్, ఎం. వేణుగోపాల్, సంజీవ్, వెంకటరమణారెడ్డి, ఎన్. గోపాల్, నరేష్, హబీబ్, కలీముల్లా వేణుగోపాల్, రామ్ లక్ష్మణ్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- మల్లంపల్లిలో ఘనంగా బొడ్రాయి ప్రతిష్ట



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** గ్రామీణ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని మల్లంపల్లి గ్రామంలో నిర్వహించిన భూలక్ష్మి, బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని మాట్లాడుతూ మన సంప్రదాయాలు సమాజానికి బలమైన పునాది అని తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామాలలో ఐక్యతను పెంపొందించడమే కాకుండా, ప్రజల్లో భక్తి భావాన్ని మరింత బలపరుస్తాయని అన్నారు. దేవతల ఆశీర్వాదంతో గ్రామం సుభిక్షంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, నాయకులు జంపయ్య, గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ బ్యూరో, ఏప్రిల్28 (జనంసాక్షి) :** పెట్రోల్, డీజిల్ సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు కలుగకూడదని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరాపై సంబంధిత అధికారులతో మంగళవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న పెట్రోల్ బంకుల వివరాలు, రోజువారీగా పెట్రోల్, డీజిల్ అమ్మకాల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు తప్పనిసరిగా వచ్చిన స్టాక్, అమ్మిన స్టాక్, మిగిలిన స్టాక్ వివరాలు డైలీ స్టాక్ రిజిస్టర్ లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఎవరికి కూడా అవసరానికి మించి పెట్రోల్, డీజిల్ ఇవ్వరాదన్నారు. పెట్రోల్, డీజిల్ అక్రమ రవాణా, నిల్వ చేయకూడదన్నారు. కృత్రిమ కొరత సృష్టించరాదని పేర్కొన్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద పెట్రోల్, డీజిల్ అక్రమ రవాణా పై ప్రత్యేకంగా ఉంచాలన్నారు. జిల్లా ప్రజల అవసరాలను మేరకు పెట్రోల్, డీజిల్ సరఫరా చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్, ఏఎస్పీ లు అజ్మీరా సంకేత్ కుమార్, సాయి కిరణ్, ఆర్డీవో రత్నకళ్యాణి, పౌర సరఫరాల అధికారి రాజేందర్, డిఎంహెచ్ఓ రాజేందర్, బీసీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు శ్రీనివాస్, అంబాజీ, మోహన్ సింగ్, వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, డిపిఆర్ఓ విష్ణువర్ధన్, ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతు బజార్లలో దళారుల ప్రమేయం ఉండొద్దు

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఆదిలాబాద్ ప్రతినిది, (జనంసాక్షి):** జిల్లాలోని రైతు బజార్లలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, కేవలం అసలైన రైతులు మాత్రమే తమ ఉత్పత్తులను విక్రయించేలా కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉద్యానవన, మార్కెటింగ్ శాఖ అధికారులతో రైతు బజార్ నిర్వహణపై ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలను అందుబాటులో ఉంచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. రైతు బజార్లలో దళారులు చొరబడకుండా నిరంతరం నిఘా ఉంచాలని, కేవలం గుర్తింపు పొందిన రైతులకే స్టాళ్లు కేటాయించాలని సూచించారు. బహిరంగ మార్కెట్ ధరల కంటే రైతు బజార్లలో ధరలు తక్కువగా ఉండేలా చూడాలని, ప్రతిరోజూ నిర్ణయించిన ధరల పట్టికను వినియోగదా రులకు కనిపించే విధంగా బోర్డులపై ప్రదర్శించాలని ఆదేశించారు. తూకాల్లో ఎలాంటి మోసాలు జరగకుండా అన్ని స్టాళ్లలో తప్పనిసరిగా డిజిటల్ తూకపు యంత్రాలనే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రైతు బజార్లకు వచ్చే రైతులకు, కొనుగోలుదారులకు ఇబ్బంది కలగకుండా షేడ్ నెట్లు ఏర్పాటు చేయాలని, తాగునీరు, పారిశుధ్య సౌకర్యాలను మెరుగుపరచాలని సూచించారు. నిత్యావసర వస్తువుల ధరలను అదుపులో ఉంచేందుకు మార్కెటింగ్ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. రైతు బజార్ల ద్వారా అటు రైతులకు ఆర్థిక లాభం, ఇటు సామాన్యులకు ఉపశమనం కలగాలన్నదే ప్రభుత్వ సంకల్పమని ఆయన వివరించారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, జిల్లా మార్కెటింగ్ అధికారి గజానన్, ఉద్యానవన శాఖ అధికారి నర్సయ్య, రైతు బజార్ ఎస్టేట్ అధికారులు పాల్గొన్నారు.

# రైతులు యూరియాను మోతాదుకు మించి వాడకూడదు

- జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త శేషు...



**చెన్నారావుపేట, ఏప్రిల్ 28 (జనంసాక్షి):** రైతులు యూరియాను మోతాదుకు మించి వాడకూడదని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ శేషు అన్నారు. మంగళవారం మండలంలోని పాపయ్యపేట గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధర్వంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు యూరియాను మోతాదుకు మించి వాడకూడదని రసాయనిక ఎరువులు విచక్షన రహితంగా వాడకుండా భూమిని సంరక్షించాలన్నారు. పచ్చిరొట్ట పైర్లు వేసుకోవాలని, రసాయన పురుగులు, తెగుళ్ల మందులను అవసరం మేరకు వినియోగించి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. మార్కెట్లో మంచి గిరాకీ ఉన్న వరి వంగడాల గురించి, సాగునీటిని ఆదా చేయాలని పంట మార్పిడి, సేంద్రియ వ్యవసాయం గురించి వివరించారు. అలాగే రైతులకు వ్యవసాయం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల పై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుర్ర సుదర్శన్ గౌడ్, మండల వ్యవసాయ అధికారి గోపాల్ రెడ్డి, వ్యవసాయ కళాశాల బిఎస్సి విద్యార్థులు హర్ష, దేవరాజు, ఏఈఓ తిరుపతి, సాగర్, రైతులు పాల్గొన్నారు.

# పెట్రోల్ డీజిల్ కొరత ఏమీ లేదు

- అసత్య ప్రచారాలు నమ్మొద్దు
- హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి



**హనుమకొండ ప్రతినిధి ఏప్రిల్ 28 (జనం సాక్షి) :** హనుమకొండ జిల్లాలో పెట్రోలు, డీజిల్ ఇంధన కొరత లేదని, వివిధ పెట్రోలియం సంస్థల ద్వారా డీజిల్, పెట్రోలు నిల్వలు అందుబాటులో ఉండే విధంగా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని ప్రజలు ఆందోళన చెందవద్దని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో జిల్లాలో పెట్రోలు, డీజిల్ సరఫరాపై పెట్రోలియం సంస్థల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో ఎనర్జీ కమిటీ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ పెట్రోలియం సంస్థల పెట్రోలు, డీజిల్ నిల్వలు గురించిన వివరాలను ఆయా సంస్థల ప్రతినిధులను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ జిల్లాలో పెట్రోలు డీజిల్ కొరత లేనప్పటికీ పెట్రోల్ బంకుల్లో డీజిల్ పెట్రోల్ కొరకు క్యూలైన్లో ఉంటున్నారని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ కొరత అంటూ అసత్య ప్రచారం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ కు ఎలాంటి కొరత లేదని అన్నారు. పెట్రోల్ బంకుల్లో క్యూ లో ఉన్న వాహనదారులకు పెట్రోల్, డీజిల్ పోయాలని అన్నారు. అర్బన్ ప్రాంతంలో బాటిళ్లు, క్యాన్లలో పోయడం ద్వారా వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. పెట్రోల్ బంకుల్లో పెట్రోల్ డీజిల్ కోసం వచ్చే వాహనాల వారికి ప్రాధాన్యత ఇచ్చి పెట్రోల్, డీజిల్ పోయాలన్నారు. జిల్లాలో పెట్రోలు, డీజిల్ కు ఎలాంటి కొరత లేదని, కొరత అంటూ జరుగుతున్న అసత్య ప్రచారాన్ని పెట్రోలియం సంస్థలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎండి వాజీద్ అలీ, జిల్లా రవాణా శాఖ అధికారి వేణుగోపాల్, డి డబ్ల్యు ఓ విశ్వజ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ప్రేమకళా, ఇండియన్ ఆయిల్, హిందుస్థాన్, భారత్ పెట్రోలియం సేల్స్ మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

# 175 కిలోల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం



**రెబ్బెన, ఏప్రిల్ 28(జనంసాక్షి):** కొమరంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలోని కొమురవెల్లి గ్రామంలో నిషేధిత నకిలీ పత్తి విత్తనాల అక్రమ రవాణా వెలుగులోకి వచ్చింది. జిల్లా ఎస్పీ నికిత పంత్ ఆదేశాల మేరకు రెబ్బెన సి.ఐ సంజయ్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం ఉదయం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన గజ్జెల సూర్యకాంత్ వద్ద నుండి సుమారు 175 కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.4,37,500గా అంచనా వేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారి డి. దిలీప్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, గజ్జెల సూర్యకాంత్‌తో పాటు అతని స్నేహితులు ధోని రాజేష్, కొల్లూరి సాయికిరణ్‌లను అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణలో వీరు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శ్రీనివాస్ వద్ద నుండి నిషేధిత విత్తనాలను కొనుగోలు చేసి, వాటిని వాడితే అధిక దిగుబడి వస్తుందని రైతులను మోసం చేస్తూ విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. ఈ విధంగా అక్రమంగా డబ్బు సంపాదిస్తూ రైతులను నష్టపరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. ఇకపై ఎవరైనా నకిలీ విత్తనాల విక్రయానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్.ఐ వెంకటకృష్ణతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సాదాబైనామా ఉండగానే రిజిస్ట్రేషన్ మరొకరికి చేసిన భూ యజమాని

- కార్యాలయానికి వచ్చి గొడవ చేసిన సాదాబై నామ కొనుగోలుదారుడు
- రెడ్డి స్వామి ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేసిన ఎస్ఐ

**భీమిని. ఏప్రిల్ 28 (జనం సాక్షి) :** భీమిని మండలంలోని చిన్న గుడిపేట గ్రామానికి చెందిన రెడ్డి స్వామి అనే వ్యక్తి 2013 సంవత్సరంలో పై 107 సర్వే నంబర్లు రెండు ఎకరాల భూమిని ఎటకారి రామయ్య అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసినాడు 2013 సంవత్సరం నుండి ఇప్పటివరకు కొనుగోలు చేసిన భూమిని సాగు చేసుకుంటూ కాస్తులో ఉండగానే. ఎటకారి రామయ్య ఇదే భూమిని మేకల అంజన్న పూరెల్ల సాయి అనే వ్యక్తులకు విక్రయించి రిజిస్ట్రేషన్ చేశాడు. చాలా బాయి కొనుగోలు చేసిన కొనుగోలుదారుడు మంగళవారం కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకునే ప్రయత్నంలో ఈ భూమి ఇతరుల పేరు మీద రిజిస్ట్రేషన్ అయిందని తాసిల్దార్ తెలపడంతో. కార్యాలయంలో ఆత్మహత్య చేసుకున్న ప్రయత్నం చేశాడు ఇది గమనించిన తహసిల్దార్ వెంటనే ఎస్ఐకి సమాచారం ఇవ్వడంతో ఎస్సై పి కోటేష్ సిబ్బందితో వచ్చి వివరాలు తెలుసుకొని గొడవను చల్ల పరచడంతో రెడ్డి స్వామి వికితపూర్వకంగా భీమిని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు స్వామి ఫిర్యాదు మేరకు వెతకారి రామయ్య పై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### తహసిల్దార్ బికరణ దాస్ వివరణ

శారబోయినామా ఉండగా రిజిస్ట్రేషన్ చేసిన విషయంపై తాసిల్దార్ బికర్ణ దాస్ వివరణ కోరగా. 2013 సంవత్సరంలో ఎటకారి రామయ్య సాదా బాయినామాపై పూటాయిడ్ సర్వర్ణం 107 సర్వే నంబర్ లోని రెండు ఎకరాల భూమిని సాదా బైనామా విక్రయించినట్లు మాకు సమాచారం లేదని ఇదే భూమిని 20 రోజుల క్రితం ఎటకారి రామయ్య మీసేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకొని ఇరువురు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ కోసం రాగా ఈ భూమిపై ఎలాంటి వివాదాలు లేకపోవడంతో రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని. సదా బైనమా ఉన్నట్లు కనీసం కొనుగోలుదారుడు కార్యాలయంలో ఎప్పుడు దరఖాస్తు చేసుకోలేదని దరఖాస్తు చేసుకునే ఉంటే రిజిస్ట్రేషన్ ఆపి అవకాశం ఉండేదని మాకు సమాచారం లేకపోవడంతో రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని తహసీల్దార్ తెలిపారు



# సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ సందర్శన

- ఏయిమ్స్ హైదరాబాద్ సీనియర్ వైద్యులు

**ములుగు ప్రతినిధి, ఏప్రిల్ 28(జనంసాక్షి) :** సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ, ములుగు ను ఏయిమ్స్ హైదరాబాద్ సీనియర్ వైద్యులు సందర్శించి, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వై ఎల్ శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధి, ఆరోగ్య సేవల మెరుగుదలకు యూనివర్సిటీని నోడల్ కేంద్రంగా చేసుకుని పలు కార్యక్రమాలను ప్రారంభించాలని ఏయిమ్స్ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనల్లో మెడికల్ సైన్సెస్‌లో సర్టిఫికేట్ కోర్సులను ప్రారంభించడం కూడా ముఖ్యాంశంగా ఉంది. త్వరలోనే ఎయిమ్స్ హైదరాబాద్ మరియు సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ మధ్య పరస్పర సహకారం కోసం అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదిరే అవకాశం ఉంది అని వారు తెలిపారు.

# కలెక్టర్‌ను కలిసిన అదనపు కలెక్టర్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 28(జనంసాక్షి):** సమీకృత కలెక్టరేట్ భవనంలోని కలెక్టర్ చాంబర్ లో ఇటీవల జిల్లాకు అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలుగా ప్రమోషన్ పై వచ్చిన యువరాజ్ మార్మట్ కలెక్టర్ హరితను కలిసి పుష్ప గుచ్చం అందించారు. అనంతరం తన చాంబర్ లో అదనపు కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంలో కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సంబంధాల అధికారి వై. సంపత్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి కిరణ్ కుమార్ అదనపు కలెక్టర్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# నూతన కలెక్టర్‌ను కలిసిన కాంగ్రెస్ పార్టీ నేతలు



**నిర్మల్,ఏప్రిల్ 28 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన భవేష్ మీశ్రాని మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జ్ కూచాడి శ్రీహరి రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ,ఎఎంసి చైర్మన్ సోమ భీంరెడ్డి, సారంగాపూర్ ఎఎంసి చైర్మన్ అబ్దుల్ హాది, మాజీ గ్రంథాలయ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్ లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గారిని శాలువ తో సత్కరించి బొకే ను అందజేసి శుభాకాంక్షలు తెలియజేస్తూ స్వాగతం పలికారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
29 ఏప్రిల్ 2026

# గ్రామీణ వైద్యులకు గుర్తింపు కల్పించాలి



**భువనగిరి, ఏప్రిల్ 28 (జనం సాక్షి) :** గ్రామీణ ప్రాంతాల్లో నిరంతరం వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు ప్రభుత్వం తగిన గుర్తింపు కల్పించాలని సుశృత గ్రామీణ వైద్యుల సంఘం ప్రతినిధులు కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లా సుశృత గ్రామీణ వైద్యుల 9వ వార్షికోత్సవ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించగా, రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జారీ చేసిన జీవో 428 ప్రకారం దాదాపు 30 వేల మందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. మరో 20 వేల మందికి శిక్షణ ఇవ్వాల్సి ఉండగానే ఆయన మరణించడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. అనంతరం వచ్చిన ప్రభుత్వాలు కూడా శిక్షణ, గుర్తింపు అంశాలను అమలు చేయలేదని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జారీ చేసిన జీవో 429 ప్రకారం శిక్షణ ఇస్తామని హామీ ఇచ్చినా అమలు కాలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో గ్రామీణ వైద్యులకు గుర్తింపు ఇస్తామని చెప్పినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లో 24 గంటలపాటు వైద్య సేవలు అందిస్తున్న తమపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వేధింపులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వార్షికోత్సవ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు వినతిపత్రం అందజేసి, గతంలో శిక్షణ పూర్తిచేసిన వారికి గుర్తింపు కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే గ్రామీణ వైద్యులపై అనవసర దాడులు జరగకుండా చూడటానికి చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు హనుమంతరావు, రాష్ట్ర అధ్యక్షులు నేతి రాజేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు అంబటి చెన్నకృష్ణయ్య, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్, నారాయణ, నరసింహ, వివిధ జిల్లాలు, మండలాలకు చెందిన ప్రతినిధులు, జిల్లా కార్యవర్గ సభ్యులు సహా సుమారు 500 మంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 28 (జనం సాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. మంగళవారం భూదాన్ పోచంపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్సీ)ను సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచి, రోగులకు స్వచ్ఛమైన వాతావరణం కల్పించాలని సిబ్బందికి సూచించారు. అవసరమైన అన్ని రకాల మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భిణీలు తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ప్రసవాలు కూడా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరిగేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. గ్రామ స్థాయిలో ఏఎన్ఎంలు ప్రజలకు అవగాహన కల్పించి ప్రభుత్వ ప్రసవాలను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. మనోహర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. యశోద, డా. సుమన్ కళ్యాణ్, ఏడి హ్యాండ్లూమ్స్ శ్రీనివాస్ రావు, మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేష్, మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి, వైద్యులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌పై సమీక్షించిన కలెక్టర్ ప్రియాంక




**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 28 (జనం సాక్షి) :** కేంద్ర ఎన్నికల సంఘం దేశ వ్యాప్తంగా సమగ్రమైన, పారదర్శక మైన ఓటరు జాబితాలను రూపొందించ డానికి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ కు శ్రీకారం చుట్టిందనీ, జిల్లాలో ఈ ప్రక్రియను మూడు రోజుల్లో వేగం చేసి 85 శాతం మ్యాపింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ సీ. హెచ్. ప్రియాంక ఆదేశించారు. మంగళ వారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్ లో జిల్లా అదనపు కలెక్టర్లు ఫణీంద్ర రెడ్డి, శ్రీను తో కలిసి కలెక్టర్ ఎస్. ఐ.ఆర్, సాదా బైనామా పై తహసీల్దార్లు, డీటిలు, సూపర్ వైజర్లు, ఏ ఈ ఆర్ వో లతో సమీక్ష జరిపారు. ఎస్. ఐ ఆర్ ప్రక్రియను చాలా పారదర్శకంగా చేయాలన్నా రు.జిల్లాలోని ప్రతీ పోలింగ్ కేంద్రంలో 85 శాతం పూర్తి చేయాలని ఆమె తేల్చి చెప్పారు. లేని పక్షంలో సంబంధిత అధికారులు, ఉద్యోగులపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరిం చారు. అనంతరం సాదా బైనామా, భూ భారతి దరఖాస్తుల పై తహసిల్దార్ల తో చర్చించారు. జీవో 74, 76 ప్రకారం సాదా బైనామా దరఖాస్తులను పరిష్కరించా లని కలెక్టర్ సూచించారు. జిల్లాలో 2075 సాదా బైనామా దరఖాస్తులు ఉన్నాయని, 2674 సర్వే నంబర్లను విచారణ చేసి ఈ నెలాఖరు నాటికి ఆయా దరఖాస్తులను అనుమ తించాలని, లేదా తిరస్కరిం చాలని, ఆయా దరఖాస్తుల నుఅనుమతించిన, తిరస్కరించిన కారణాలను స్పష్టంగా పేర్కొనాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను తహసిల్దార్ల కు సూచిం చారు. చివరగా భూ భారతి పెండింగ్ దరఖాస్తులపై చర్చించి వాటిని క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు



**పెనుబల్లి, ఏప్రిల్ 28 (జనం సాక్షి) :** విద్యుత్ ట్రాన్స్ఫార్మర్‌లోని రాగి వైరు,మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను వి ఎం బంజర్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు మంగళవారం స్టేషన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో కల్లూరు డివిజన్ ఏసీపీ వసుంధర యాదవ్ వెల్లడించారు. సమావేశంలో ఏసిపి మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రాలో వందల సంఖ్యలో కేసులు ఉన్నప్పటికీ భారీగా దొంగతనాలకు పాల్పడుతూ పెనుబల్లి పోలీసులకు చిక్కిన నలుగురు దొంగలపై పిడి యాక్ట్ నమోదు చేయాలని సత్తుపల్లి ఏసిపి ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అశ్వరావుపేటకు చెందిన దశరథుడు, ఏలూరు జిల్లా చింతలపూడి కి చెందిన అల్లం శివ, అశ్వరావుపేట మండలం దొంతికుంటకు చెందిన ముల్లగిరి రామకృష్ణ, తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి కి చెందిన ముదర బోయిన ఏడుకొండలు. వీరంతా ఒక ముఠాగా ఏర్పడి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ లోని రాగి వైరు, కరెంటు మోటార్లు, మోటార్ సైకిల్ దొంగిలించి వాటిని విక్రయిస్తూ వచ్చిన డబ్బుతో జలసాలు చేస్తున్నారని ఈ క్రమంలో లంకా సాగర్ క్రాస్ రోడ్డు వద్ద దొంగిలించిన మోటార్ సైకిళ్ళపై గోన సంచిలో రాగి వైరును నింపుకొని సత్తుపల్లి నుండి తిరువూరు వైపు వస్తుండగా అదే సమయంలో వి ఎం బంజర్ ఎస్ ఐ కే వెంకటేష్, తన సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండటంతో అనుమానం వచ్చిన వారిని స్టేషన్ తీసుకుపోయి విచారించగా చేసిన దొంగతనాలు బయటపడ్డాయన్నారు. రెండు రాష్ట్రాల్లో ఏడు పోలీస్ స్టేషన్ల పరిధిలో 45 ట్రాన్స్ఫర్ ల కాపరు వైరు దొంగిలించినట్లు తేలింది అన్నారు. ముఖ్య నిందితుడైన దశరథుడు పై గతంలో వివిధ పోలీస్ స్టేషన్లో 50 పైగా కేసులు నమోదయాయని ఈ సందర్భంగా వివరించారు. ట్రాన్స్ఫర్లోని రాగి వైర్లు, రైతుల కరెంటు మోటార్లను దొంగిలించి రైతులకు పంట నష్టం తో పాటు ప్రజలకు విద్యుత్ వాడకం ద్వారా తీవ్ర అసౌకర్యం కల్పిస్తున్న ఈ వ్యక్తులపై చట్టపరంగా కఠిన శిక్షలకు అర్హులని ఏసీపి పేర్కొన్నారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తుల ను గుర్తించడంలో వారి వద్ద ఉన్న సొత్తును రికవరీ చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఐడి హెడ్ కానిస్టేబుల్ నాగేంద్ర, కానిస్టేబుల్ సత్యం, రాజమల్లు ను ఏసిపి రివార్డ్ ను అందజేసి అభినందించారు. సమావేశంలో రూరల్ సిఐ ముత్తు లింగయ్య, వియ్యం బంజర్ ఎస్సై కే వెంకటేష్, కల్లూరు ఎస్సై కవిత తదితరులు పాల్గొన్నారు.

## మహిళా పెట్రోల్ బంక్ నిర్వహణ భేష్



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 28 (జనం సాక్షి) :** నారాయణ పేట జిల్లా కేంద్రం లో జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కొనసాగుతున్న మహిళా పెట్రోల్ బంక్ కు రాష్ట్రంలో మంచి పేరు ఉంద ని, బంక్ లాభాల బాటలో నడుస్తుందని, ఐ అండ్ పీ ఆర్ కమిషనర్ గా తాను మహిళా పెట్రోల్ బంక్ నిర్వ హణ గురించి పలు పత్రిక లలో పాజిటివ్ కథనాలను ప్రచురిశీప చేయించిన విషయాన్ని ఈ సందర్భంగా కలెక్టర్ సి ఎచ్.ప్రియాంక గుర్తు చేశారు. ఇప్పుడు తానే నారాయణ పేట జిల్లా కలెక్టర్ గా వచ్చానని, జిల్లాలో కొత్త కొత్త ఆలోచనలతో పెట్రోల్ బంక్ లా మరిన్ని కొత్త వ్యాపారాలకు శ్రీకారం చుడదామని కలెక్టర్ తెలిపారు. అంతకు ముందు సమావేశంలో గత నెల నిర్వహించిన సమావేశం పై సమీక్ష, ఎస్.హెచ్ జీ ల పనితీరు, జిల్లా సమాఖ్య, పెట్రోల్ బంక్ లావాదేవీలు, బ్యాంకు లింకేజీ,స్త్రీ నిధి తదితర అంశాల గురించి చర్చించారు. సమావేశంలో డీ ఆర్డీ వో మొగులప్ప, సేర్ప్ పి.ఎం. బాలస్వామి, డి పి ఎం గోవింద్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు అరుంధతి, సుజాత, కోశాధికారి అంజ మ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించిన కలెక్టర్



**టేకులపల్లి, ఏప్రిల్ 28 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం బొమ్మనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించి, అక్కడ జరుగుతున్న కొనుగోలు ప్రక్రియను సమగ్రంగా పరిశీలించారు. కేంద్రంలో రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా స్వీకరిస్తు న్నారా అనే విషయంపై ప్రత్యేకంగా దృష్టి సారించి, సంబంధిత అధికారులను వివిధ అంశాలపై ప్రశ్నించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ధాన్యంలో తేమ శాతాన్ని నిర్ధారించడానికి ఉపయోగిస్తున్న మాయిశ్చరైజింగ్ యంత్రం పనితీరును కలెక్టర్ పరిశీలించారు. తేమ శాతం నిర్ధారణలో ఎలాంటి లోపాలు లేకుండా, ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాల న్నారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా పరీక్షించి వెంటనే కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని సూచించారు.రైస్ మిల్లులకు ధాన్యం ట్యాగింగ్ విధానం, కొనుగోలు రిజిస్టర్ల నిర్వహణ, టోకెన్ పంపిణీ వ్యవస్థపై సమగ్ర సమాచారం సేకరించారు. టోకెన్లను సమయానికి జారీ చేసి రైతులు అనవసరంగా వేచి ఉండకుండా చూడాలని, ప్రతి రైతుకు పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. కొనుగోలు కేంద్రంలో సరైన రికార్డుల నిర్వహణ ఎంతో కీలకమని, ప్రతి నమోదు ఖచ్చితంగా ఉండాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం రైతులకు మద్దతుగా చేపట్టిన ధాన్యం కొనుగోలు కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి, ప్రతి రైతు లాభపడేలా చూడటం అధికారుల బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. తనిఖీలు నిర్వహించిన కలెక్టర్ వెంట తాసిల్దార్ వీరభద్రం సంబంధిత శాఖల అధికారులు వ్యవసాయ శాఖ అధికారి అన్నపూర్ణ, ఏ ఈ ఓ లు,బేతంపూడి సొసైటీ సీఈఓ ప్రేమ చారి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండ మున్సిపాలిటీ కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక




**దేవరకొండ, ఏప్రిల్ 28 (జనం సాక్షి) :** దేవరకొండ మున్సిపాలిటీ కో ఆప్షన్ ఎన్నిక మంగళవారం పురపాలిక కార్యాలయంలో చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, కమీషనర్ పూర్ణ చందర్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ ప్రత్యేక సమావేశంలో కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవంగా నిర్వహించారు. ఎన్నికైన సభ్యులు పట్టణ అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై కౌన్సిల్ సభ్యులకు సలహాలు సూచనలు అందజేయాలని ఎమ్మెల్యే కోరారు.ఈ ఎన్నికల్లో 12 మంది కాంగ్రెస్ కౌన్సిల్ సభ్యులతోపాటు ఆరుగురు బీఆర్ఎస్ సభ్యులు, ఒక్కరు ఇండిపెండెంట్, ఒక్కరు బీజేపీ కూడా మద్దతు తెలుపుతూ చేయి ఎత్తి బలపరచడంతో నాలుగు స్థానాలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కైవసం చేసుకుందని తెలిపారు. కాంగ్రెస్ తరుపున బరిలో నిలిచిన నాలుగురు కోఆప్షన్ సభ్యులు ఏకగ్రీవంగా విజయం సాధించడంతో తమ పాలకవర్గానికి మరింత బలం చేకూరిందని తెలిపారు. జనరల్ (జనరల్) గార్లపాటి దామోదర్ తండ్రి శివ లింగం, జనరల్ (మహిళా) – నేతాళ్ళ భాగ్యలక్ష్మి భర్త శ్రీనివాసులు మైనారిటీ (జనరల్) –మొహమ్మద్ మైనోద్దీన్ తండ్రి అమిరోద్దీన్, మైనారిటీ (మహిళా) – ఏకుల శిపోరమ్మ భర్త సుదర్శన్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు అత్యుత్తమ సేవలను అందించాలని స్థానిక ఎమ్మెల్యే కో ఆప్షన్ సభ్యులను సూచించారు. కో–ఆప్షన్ సభ్యులుగా ఎన్నికైన సభ్యులందరికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవలో మీ అనుభవం, నిబద్ధత పట్టణ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని ఆకాంక్షించారు.పట్టణ అభివృద్ధి పథంలో మీరు ముందుకు సాగేందుకు నా సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పూర్ణ చందర్, మున్సిపల్ ఛైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డులో 'గుర్రంపోడు' క్రీడాకారుల జోరు



**గుర్రంపోడు, ఏప్రిల్ 28 (జనంసాక్షి) :** అంతర్జాతీయ వేదికపై గుర్రంపోడు మండల క్రీడాకారులు మెరిశారు. హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జయంత్ రెడ్డి ఇంటర్నేషనల్ తైక్వాండో అకాడమీ, విజన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ సామూహిక కరాటే ప్రదర్శనలో వీరు పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించారు. దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల నుండి క్రీడాకారులు తరలివచ్చిన ఈ ఈవెంట్‌లో, గతంలో ఉన్న 8 నిమిషాల రికార్డును అధిగమించి ఏకధాటిగా 11 నిమిషాల పాటు కరాటే పంచులు, బ్లాకులతో అద్భుత ప్రదర్శన ఇచ్చి సరికొత్త రికార్డు నమోదు చేశారు. గిన్నిస్ బుక్ ప్రతినిధి స్వప్నిల్ చేతుల మీదుగా రికార్డు పత్రాన్ని అందుకున్న వీరిని స్థానికులు ఘనంగా సన్మానించారు. గిన్నిస్ విజేతలను గుర్రంపోడు మాజీ జెడ్పీటీసీ గాలి సరిత రవికుమార్ గౌడ్, గుర్రంపోడు సర్పంచ్ జాల యాదయ్య, కట్టవారిగూడెం సర్పంచ్ చాడ ప్రమీల చక్రవర్తి, సెయింట్ మేరీస్ స్కూల్ హెచ్ఎం జోసెఫ్, గుర్రంపోడు ఉపసర్పంచ్ మేకల కోటిరెడ్డి, కట్టవారిగూడెం ఉపసర్పంచ్ పర్సనబోయిన రాధా వెంకన్న తదితరులు అభినందించారు.

## ప్లాస్టిక్ రహిత క్యాంపస్ కోసం ఓయూ టెక్నాలజీ కళాశాల 3కే రన్



**సికింద్రాబాద్, ఏప్రిల్ 28 (జనంసాక్షి) :** ఓయూ టెక్నాలజీ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ ఫెస్ట్ టెక్నోస్మానియా –2026 కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ ఫ్రీ క్యాంపస్ కోసం మంగళవారం ఎన్సీసీ గేట్ నుండి టెక్నాలజీ కళాశాల వరకు 3కే రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఓయూ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ వి.రమేష్ కుమార్, టెక్నోస్మానియా కన్వీనర్ ఎస్.శ్రీను నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రన్నర్స్ అసోసియేషన్ వారు పాల్గొని ప్రసంగించారు. అనంతరం రన్నింగ్ లో విజేతలను ప్రకటించారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీ వద్ద ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. టెక్నాలజీ కలశాల నుండి ఓయు క్యాంపస్ లో బైక్ ర్యాలీ నిర్వహించారు.

## కలెక్టరేట్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలి

- కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 28 (జనం సాక్షి) :** జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద కొనసాగుతున్న నూతన కలెక్టరేట్ (ఐడిఓసి) భవన నిర్మాణ పనులను మే నెలాఖ రు నాటికి పూర్తి చేసి జూన్ 2 న ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సీ. హెచ్. ప్రియాంకఆర్.అండ్.బీ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ నూత న కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. భవనంలోని కలెక్టర్ ఛాంబర్, మీటింగ్ హాల్, వివిధ సెక్షన్ గదులలో కొనసాగుతున్న పనులను చూశారు.మిగిలిన పనులన్నీ మే నెలాఖరు వరకు పూర్తి చేసి జూన్ 2న కొత్త కలెక్టరేట్ ను ప్రారంభానికి సిద్ధం చేయాల ని సూచించగా, ఆర్ అండ్ బీ అధికారులు జూన్ 2 వరకు నిర్మాణ పనులు పూర్తి కావ డం సాధ్యం కాదని, జులై నెలలో పూర్తి అవుతాయని చెప్పారు. మ్యాన్ పవర్ పెంచుకుని ఎలాగైనా మే నెలాఖరు వరకు పూర్తి చేసే ప్రయత్నం చేయాలని కలెక్టర్ మరోసారి అధికారులకు సూచించారు. అయితే నూతన కలెక్టరేట్ భవన నిర్మాణానికి మంజూరైన నిధులు సరిపోవడం లేదని అదనంగా నిధులు కావాలని అధికారులు కలెక్టర్ ను కోరారు. స్పందించిన కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. కలెక్టరేట్ భవనంలో అవసరమైన ఫర్నిచర్ టెండర్ ఎవరు తీసుకున్నారనీ, మిగతా ఫర్నిచర్ అంతా సమకూ ర్చాలని ఆమె ఆదేశించారు.భవన ఆవరణలో గ్రీనరీ, వాహనాల పార్కింగ్, అంతర్గత రహదారుల నిర్మాణం పై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఎస్.ఈ. వెంకట రమణ, డీ.ఈ. రాములు, ఏ ఈ లు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

# మిర్యాలగూడను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతాం

- మంత్రి కోమటిరెడ్డి

**మిర్యాలగూడ, ఏప్రిల్ 28 (జనంసాక్షి) :** మిర్యాలగూడ నియోజకవర్గం పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతామని రోడ్లు భవనాలు శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం నాడు మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఉమ్మడి నల్గొండ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి సస్యశ్యామలం చేస్తుందని, హైదరాబాదు నుండి మచిలీపట్నం వరకు హాలియా, అడవిదేవులపల్లి మీదుగా జాతీయ రహదారిని నిర్మించి మిర్యాలగూడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని , భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణంలో భాగంగా హై స్పీడ్ ట్రైన్లు నేషనల్ హైవేలు డ్రైఫ్రోట్ గ్రీన్ ఫీల్డ్ హైవే లో ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి అని తెలిపారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ సమీపంలో 500 కోట్లతో ట్రైన్ హబ్ ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన డీపీఆర్ ఈ ఏడాది నవంబర్ నాటికి పూర్తవుతుందని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలు కేవలం రాష్ట్ర భవిష్యత్తు,అభివృద్ధి నిధుల కోసమేనని అన్నారు.నేషనల్ హైవేపై నిర్మించాల్సిన ఫ్లైఓవర్ పనుల గురించి ఇప్పటికే కాంట్రాక్టర్లతో చర్చలు జరిపామని, త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయని వెల్లడించారు.హైవేపై ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, తక్షణమే రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.కేంద్ర ప్రభుత్వానికి కూడా అధికారికంగా లేఖ రాశామని,జాతీయ రహదారి పై ఫ్లై ఓవర్ల నిర్మాణ పనులను వేగవంతం చేస్తామని చెప్పారు.హరీష్ రావు, కేటీఆర్ పనిలేక ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ఉమ్మడి నల్గొండ జిల్లాలో వచ్చే ఎన్నికల్లో కూడా జిల్లాలోని 12 స్థానాలను క్లీన్ స్వీప్ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.రాష్ట్రంలో మళ్ళీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని అన్నారు.ఈ ఈ సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పున్న కైలాష్ నేత స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### డిప్యూటీ సీఎం సిపిఆర్వో మధుసూదన్ మృతి బాధాకరం

డిప్యూటీ సీఎం డిప్యూటీ సీఎం సి పి ఆర్ ఓ మృతి బాధాకరమని రాష్ట్ర రోడ్డు రవాణా భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం నాడు గుండెపోటుతో హైదరాబాదులో మృతి చెందిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సి పి ఆర్ ఓ మధుసూదన్ మృతదేహాన్ని మిర్యాలగూడలో వారి స్వగృహం నందు సందర్శించి, భౌతికయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో పలు పత్రికలలో సీనియర్ జర్నలిస్టుగా దశాబ్దం పాటు సేవలు అందించిన మధుసూదన్ ఆకస్మాత్ గా మరణించడం తీరని లోటు అని డిప్యూటీ సీఎం పిఆర్ఓగా అందరితో సన్నిహితంగా మెలిగి, సమన్వయంతో సమర్ధవంతంగా పనిచేసి అందరి మన్ననలు పొందడం జరిగిందని అన్నారు. వారి కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు తక్షణ సహాయం కింద ఐదు లక్షల ఆర్థిక సహాయం చేయడం జరిగింది. వారితో పాటు ప్రభుత్వ చీఫ్ విప్ వేముల వీరేశం, స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, కేతవరం శంకర్ నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పున్నా కైలాష్ నేత, నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ గురు శ్రీనివాస్ రెడ్డి గుమ్ముల మోహన్ రెడ్డి, మిర్యాలగూడ పట్టణ కాంగ్రెస్ నాయకులు నూకల వేణుగోపాల్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి చిలుకూరు బాలకృష్ణ లు నివాళులు అర్పించారు.




## గూగుల్ వాలెట్‌లో ఆధార్ కార్డు.. ఎలా సేవ్ చేసుకోవాలి?

**న్యూఢిల్లీ:**గూగుల్‌కు చెందిన గూగుల్ వాలెట్‌లో ఆధార్ వివరాలను సేవ్ చేసుకునే సదుపాయం వచ్చింది. ఇందుకోసం భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థతో గూగుల్ జట్టు కట్టింది. దీనిద్వారా స్మార్ట్‌ఫోన్‌లో డిజిటల్ వెర్షన్ ఆధార్‌ను పెట్టుకోవడం వీలవుతుందని గూగుల్ తన బ్లాగ్‌పోస్ట్‌లో పేర్కొంది. ఎక్కడైనా మీ ఆధార్ వివరాలను ధ్రువీకరించాల్సిన చోట ఈ వాలెట్‌ను ఉపయోగించొచ్చు. దీనివల్ల ఫిజికల్ కార్డు తీసుకెళ్లే అవసరం తప్పుతుంది.గూగుల్ వాలెట్‌లో ఆధార్ వివరాలను సేవ్ చేయడం వల్ల ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వెరిఫికేషన్ అవసరాల కోసం వినియోగించుకోవచ్చని గూగుల్ తెలిపింది. కేవలం వయసును మాత్రమే ధ్రువీకరించాల్సిన చోట పూర్తి ఆధార్ వివరాలు ఇవ్వాల్సిన అవసరం తప్పుతుందని గూగుల్ తెలిపింది. పీవీఆర్ ఐనాక్స్, భారత్ మ్యాట్రిమోనీ వంటి వేదికల్లో దీన్ని వినియోగించుకోవచ్చని పేర్కొంది. మైగేట్, స్నాబిట్ వంటి ఇతర వేదికలకూ త్వరలో ఈ వెరిఫికేషన్ సదుపాయాన్ని విస్తరిస్తామని తెలిపింది.గూగుల్ లేటెస్ట్ వెర్షన్ వాలెట్ యాప్‌ను ఓపెన్ చేసి + లేదా యాడ్ వాలెట్ బటన్‌ను క్లిక్ చేయాలి. అక్కడ మెనూలో ఐడీ పాస్ లేదా ఆధార్ కార్డ్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. ఆపై ఆధార్‌తో లింకైన మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీని ఎంటర్ చేయాలి. ఉడాయ్ ఆధార్ యాప్‌లోని 'షేర్ ఐడీ' ఆప్షన్ ద్వారా కూడా గూగుల్ వాలెట్‌లో ఆధార్ వివరాలను సేవ్ చేసుకోవచ్చు.

## నష్టాల్లో దేశీయ మార్కెట్ సూచీలు

**న్యూఢిల్లీ:**దేశీయ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ముగిశాయి చమురు భగభగలు, అంతర్జాతీయ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాలతో మన సూచీలు నష్టాల్లో కదలాడాయి. దాంతో సెన్సెక్స్ 400 పాయింట్ల మేర నష్టపోయింది.ఉదయం సెన్సెక్స్ 77,094 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ఒక దశలో 77,493 పాయింట్ల గరిష్ఠానికి.. 76,741 పాయింట్ల కనిష్ఠానికి చేరుకుంది. చివరకు 416 పాయింట్ల నష్టంతో 76,886 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 97 పాయింట్లు కోల్పోయి, 23,995 వద్ద ముగిసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 41 పైసలు కోల్పోయి, చివరకు 94.56కు చేరింది. నిఫ్టీ సూచీలో ఓఎన్‌జీసీ, అదానీ ఎంటర్‌ప్రైజెస్, కోల్ ఇండియా, రిలయన్స్, నెస్లే షేర్లు రాణించగా.. యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, మారుతీ సుజుకీ, శ్రీరామ్ ఫైనాన్స్ స్టాక్స్ నష్టపోయాయి.

కారణాలివీ..

వరుసగా 3 రోజుల నష్టాల తర్వాత, సోమవారం దేశీయ సూచీలు లాభాల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. దాంతో నేటి ట్రేడింగ్‌లో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. బ్యాంకింగ్, ఐటీ, రియాల్టీ షేర్లు నష్టపోయాయి. మరోపక్క చమురు ధరలు భగ్గుమంటున్నాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు 110 డాలర్లు దాటింది.

## మన ఎగుమతులకు న్యూజిలాండ్‌లో సుంకమే లేదు

- ఎఫ్‌టీఏపై సంతకాలు..ఈ ఏడాది ఆఖరుకు అమల్లోకి
- అయిదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యం రెట్టింపు అంచనా
- ఎఫ్‌టీఏ పత్రాలను చూపుతున్న కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్
- గోయల్, న్యూజిలాండ్ వాణిజ్య, పెట్టుబడుల శాఖ మంత్రి టాడ్ మెక్‌క్లే



**న్యూఢిల్లీ:**భారత్–న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) ఎట్టకేలకు కుదిరింది. 2010లో చర్చలు ప్రారంభమైనా, అనివార్య కారణాలతో 2015లో ఆగిపోయాయి. మళ్లీ గత ఏడాది మార్చిలో రెండు దేశాలు చర్చలు ప్రారంభించి, 9 నెలల్లోనే సానుకూలంగా ముగించాయి. సోమవారం దిల్లీలో జరిగిన కార్యక్రమంలో భారత వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, న్యూజిలాండ్ వాణిజ్య పెట్టుబడుల శాఖ మంత్రి టాడ్ మెక్‌క్లే ఎఫ్‌టీఏపై సంతకాలు చేశారు. ఈ ఏడాది చివరకు ఇది అమల్లోకి వస్తుంది. అప్పుడు మన ఎగుమతులపై న్యూజిలాండ్‌లో సుంకమే ఉండదు. ఫలితంగా ద్వైపాక్షిక వాణిజ్యం అయిదేళ్లలో రెట్టింపై 5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.47,000 కోట్ల)కు చేరుతుందని అంచనా. 20 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.88 లక్షల కోట్ల) విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులూ మనదేశంలోకి వస్తాయి. ఈ ఒప్పందం ప్రకారం..వస్త్రాలు, తోలు పాదరక్షలు, రత్నాలు, ఆభరణాలతో పాటు మన 100% ఎగుమతులకు న్యూజిలాండ్‌లో సుంకమే ఉండదు. గతంలో 10% వరకు సుంకం పడేది.ద్వైపాక్షిక వాణిజ్య విలువలో 95 శాతానికి సమానమైన, న్యూజిలాండ్‌కు చెందిన 70% టారిఫ్ లైన్లపై మన దేశం టారిఫ్ సరళీకరణ ఇస్తుంది. మరో 30% విలువకు సమానమైన ఉత్పత్తులను మాత్రం ఒప్పందం నుంచి మినహాయించారు. పాల ఉత్పత్తులు (పాలు, మీగడ, మజ్జిగ, పెరుగు, జున్ను వంటివి), జంతు ఉత్పత్తులు (గొర్రె మాంసం మినహా) వ్యవసాయ ఉత్పత్తులు (ఉల్లిపాయలు, సెనగలు, బఠానీలు, మొక్కజొన్న, బాదం), చక్కెర, కృత్రిమ తేనె, జంతు, వృక్ష లేదా సూక్ష్మజీవుల కొవ్వులు, నూనెలు, ఆయుధాలు, మందు గుండు సామగ్రి, రత్నాలు, ఆభరణాలు, రాగి, ఇతర వస్తువులు (కాథోడ్‌లు, కాట్రిడ్జ్‌లు, రాడ్‌లు, బార్‌లు, కాయిల్స్), అల్యూమినియం, ఇతర వస్తువులు (ఇంగోట్‌లు, బిల్లెట్‌లు, వైర్‌బార్‌లు) ఇందులో ఉన్నాయి. న్యూజిలాండ్ నుంచి కలప దుంగలు, కోకింగ్ బొగ్గు, లోహాల వ్యర్థాలు, తుక్కు, కలప, గొర్రె మాంసం, తోలు, ముడి చర్మాలతో పాటు అనేక వస్తువులకు మన దేశం సుంకం రహిత ప్రవేశాన్ని కల్పిస్తుంది. పెట్రోలియం ఆయిల్, మాల్ట్ ఎక్స్‌ట్రాక్ట్, కూరగాయల నూనెలు, ఎంపిక చేసిన విద్యుత్, యాంత్రిక పరికరాలు, పెప్టోన్‌లు వంటి వస్తువులపై మన దేశం 3, 5, 7, 10 ఏళ్ల వ్యవధిలో దశల వారీగా సుంకాలను తగ్గిస్తుంది. ఈ ఉత్పత్తుల్లో వైన్, ఫార్మాస్యూటికల్స్, పాలిమర్లు, అల్యూమినియం, ఇనుము, ఉక్కు వస్తువులు ఉన్నాయి.సేవల రంగంలో కంప్యూటర్ సంబంధిత సేవలు, వృత్తిపరమైన సేవలు, ఆడియో విజువల్, టెలికమ్యూనికేషన్, నిర్మాణం, విద్య, పర్యావరణ, ఆర్థిక సేవలు, పర్యాటకం, ప్రయాణం వంటి సుమారు 118 రంగాల్లో మన దేశానికి న్యూజిలాండ్ నుంచి మార్కెట్ ప్రవేశ హామీలు లభించనున్నాయి. భారతీయ నిపుణులకు 5,000 వీసాల కోటాతో, గరిష్ఠంగా మూడేళ్ల కాల పరిమితితో వీసాలు జారీ చేయొచ్చు.

## తగ్గిన మారుతీ సుజుకీ లాభం..

### ఒక్కో షేరుకు రూ.140 డివిడెండ్

దిల్లీ: ప్రముఖ కార్ల తయారీ కంపెనీ మారుతీ సుజుకీ త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.3659 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.3911.1 కోట్ల నికర లాభంతో పోలిస్తే లాభం 6.45 శాతం క్షీణించింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో వాహనాలను విక్రయించినా.. లాభాల్లో క్షీణత నమోదు కావడం గమనార్హం.మార్కెట్‌– టు– మార్కెట్ ప్రభావం కారణంగా లాభంలో క్షీణత నమోదైందని మారుతీ సుజుకీ తెలిపింది. నిర్వహణేతర లాభాలు క్షీణించడం, బాండ్ రాబడులు తగ్గడం వంటివి లాభాలపై ప్రభావం చూపాయని పేర్కొంది. భవిష్యత్‌లో ఇవి భర్తీ అవుతాయని తెలిపింది. కార్యకలాపాల ద్వారా ఆదాయం 28.2 శాతం వృద్ధితో రూ.40,920.1 కోట్ల నుంచి రూ.52,462.5 కోట్లకు పెరిగినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. సమీక్షా త్రైమాసికంలో రూ.50 వేల కోట్ల విలువైన విక్రయాలు నమోదు చేసినట్లు కంపెనీ తెలిపింది. మొత్తంగా 6,76,209 యూనిట్లను విక్రయించగా.. అందులో 5.38 లక్షల యూనిట్లను దేశీయంగా, 1.37 లక్షల వాహనాలను విదేశాలకు ఎగుమతి చేసినట్లు తెలిపింది. ఇక పూర్తి ఆర్థిక సంవత్సరానికి కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం రూ.1,52,913 కోట్ల నుంచి రూ.1,83,316 కోట్లకు పెరిగినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. లాభం రూ.14,679.5 కోట్లుగా నమోదైంది. ఏడాది మొత్తంలో 19.74 లక్షల యూనిట్లను దేశీయంగా విక్రయించగా.. 4.47 లక్షల యూనిట్లను ఎగుమతి చేసినట్లు మారుతీ సుజుకీ వెల్లడించింది.

## పీసీబీలకూ వార్ షాక్.. ధరలు 40 శాతం పైకి!

దిల్లీ:అమెరికా–ఇరాన్ యుద్ధం కారణంగా ఇప్పటికే చమురు ధరలు భగ్గుమంటున్నాయి. ఇప్పుడీ ఉద్రిక్తతల కారణంగా ఎలక్ట్రానిక్ పరికరాలకు కీలకమైన ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుల (పీసీబీ) ధరలకు కూడా రెక్కలొచ్చాయి. పీసీబీల తయారీకి అవసరమైన కీలక ముడిపదార్థాల ఉత్పత్తి నిలిచిపోవడం వల్ల వీటి ధరలు ఏకంగా 40శాతం పెరిగాయి. దీంతో రానున్న రోజుల్లో స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లతో పాటు ఏఐ సేవలు కూడా ప్రియం కానున్నట్లు ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.ఏప్రిల్ తొలివారంలో సౌదీ అరేబియాలోని జుబైల్ పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌పై ఇరాన్ దాడి చేసింది. ఈ దాడిలో ఈ ప్రాంగణం తీవ్రంగా ధ్వంసమవడంతో శుద్ధి చేసిన పాలీఫెనిలిన్ ఈథర్ (పీపీఈ) ఉత్పత్తి నిలిచిపోయింది. పీబీసీ లామినేట్స్ తయారీకి ఇది అత్యంత కీలకమైన ముడిపదార్థం. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పీపీఈ సరఫరాలో దాదాపు 70శాతం ఈ కాంప్లెక్స్ నుంచే ఉత్పత్తి కావడం గమనార్హం. ఇప్పుడు ఈ యూనిట్‌లో కార్యకలాపాలను తిరిగి అందుబాటులోకి తెచ్చే పరిస్థితి కన్పించడం లేదు. దీంతో పీపీఈ కొరత తీవ్రంగా ఏర్పడింది.ఇప్పటికే ఏఐ సర్వర్ల నుంచి డిమాండ్ పెరగడంతో గతేడాది నుంచి ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుల ధరలు పెరుగుతున్నాయి. ఇప్పుడు ముడిపదార్థాల కొరతతో వీటి ధరలకు మరింత రెక్కలొచ్చాయి. మార్చితో పోలిస్తే ఏప్రిల్‌లో పీసీబీల ధరలు దాదాపు 40శాతం పెరిగినట్లు గోల్డ్‌మన్ శాక్స్ ఇటీవల తన నివేదికలో వెల్లడించింది. రానున్న రోజుల్లో వీటి ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.25 | ₹ 5.27 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,38,350 (22 క్యారెట్లు) | ₹ 1,50,930 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,65,000

## నాలుగింతలు పెరిగిన ఎటెర్నల్ లాభం

దిల్లీ: జొమాటో, బ్లింకిట్ పేరిట ఫుడ్, క్విక్ కామర్స్ వ్యాపారాలు నిర్వహిస్తున్న ఎటెర్నల్ త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. మార్చితో ముగిసిన త్రైమాసికంలో నాలుగింతలకుపైగా నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.39 కోట్లుగా ఉన్న లాభం.. ఈ ఏడాది రూ.174 కోట్లకు పెరిగింది. కంపెనీ ఆదాయం సైతం గతేడాదితో పోలిస్తే రూ.5,833 కోట్ల నుంచి రూ.17,292 కోట్లకు పెరిగింది. అదే సమయంలో ఖర్చులు రూ.6104 కోట్ల నుంచి రూ.17,406 కోట్లకు పెరిగినట్లు కంపెనీ తెలిపింది.సమీక్షా త్రైమాసికంలో క్విక్ కామర్స్ విభాగం బ్లింకిట్ నెట్ ఆర్డర్ వాల్యూ ఏడాది ప్రాతిపదికన 95.4 శాతం వృద్ధిని సాధించింది. ఈ త్రైమాసికంలో కొత్తగా 216 స్టోర్లను ప్రారంభించడంతో మొత్తం స్టోర్ల సంఖ్య 2,243కి చేరింది. అలాగే, జొమాటో 18.8 శాతం వృద్ధిని కనబరిచింది. దీని సవరించిన ఎబిటా రూ.532 కోట్లుగా ఉంది. పేటీఎం నుంచి కొనుగోలు చేసిన టికెటింగ్ ప్లాట్‌ఫామ్ డిస్ట్రిక్ట్ ఆదాయం 46.5 శాతం పెరిగింది. నష్టాలు రూ.121 కోట్ల నుంచి రూ.81 కోట్లకు తగ్గాయి.




## యుద్ధంలో ఇరుక్కున్న అమెరికా

### ముందుకెళ్తే చైనా.. వెనక్కొస్తే ఇరాన్

**వాషింగ్టన్:**ఇరాన్‌తో యుద్ధం వల్ల అమెరికాకు ఊహించిన దానికంటే ఎక్కువ నష్టమే వాటిల్లుతోంది. ఇప్పటికే అగ్రరాజ్య క్షిపణి నిల్వలు భారీగా కరిగిపోతున్నాయి. మరోవైపు, ఇతర ప్రాంతాల్లో మోహరించిన సైన్యాన్ని పశ్చిమాసియాకు తరలిస్తుండటంతో అమెరికాకు కొత్త ముప్పులు పొంచిఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా తైవాన్ ఆక్రమణపై చైనా కన్నేసిన వేళ.. ఇండో–పసిఫిక్ ప్రాంతం లోని అమెరికా సైనిక సామర్థ్యాలను పశ్చిమాసియాలో వృథా చేయడం ఆందోళన కలిగిస్తోంది. ఈ విషయాన్ని అమెరికా ఇండో–పసిఫిక్ కమాండర్ అడ్మిరల్ శామ్యూల్ జె పాపారో వెల్లడించారు.ఇటీవల యూఎస్ కాంగ్రెషనల్ ఆర్మ్‌డ్ సర్వీసెస్ కమిటీ విచారణకు హాజరైన శామ్యూల్.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల గురించి మాట్లాడారు. పసిఫిక్ మహాసముద్రంలో చైనా (అప్రతినిజీ) నుంచి పొంచిఉన్న ముప్పు గురించి ఆందోళన వ్యక్తంచేశారు. భవిష్యత్తులో చైనాతో యుద్ధం ఎదురైతే.. క్షిపణుల అవసరం ఎక్కువగా ఉంటుందని శామ్యూల్ తెలిపారు. కానీ, ఇప్పుడు ఇరాన్‌తో యుద్ధం కారణంగా క్షిపణి నిల్వలు వేగంగా కరిగిపోతున్నాయన్నారు. చైనా వద్ద పెద్ద సంఖ్యలో క్షిపణి నిల్వలు ఉన్నాయి. తైవాన్ విషయంలో అగ్రరాజ్యంతో ఉద్రిక్తతలు రాజుకుంటే.. ఆసియా–పసిఫిక్ ప్రాంతంలోని అమెరికా, దాని మిత్ర దేశాల స్థావరాలను బీజింగ్ లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉన్న విషయాన్ని అగ్రరాజ్య కమాండర్ గుర్తుచేశారు.ఇక, ఇదే విచారణలో డెమొక్రటిక్ సెనెటర్ రిచర్డ్ బ్లూమెంథల్ మాట్లాడుతూ.. "ఇరాన్‌తో యుద్ధం మన సైనిక సామర్థ్యాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం ఉన్నట్లు కన్పిస్తోంది. ఇప్పటికే జపాన్‌లోని యూఎస్ మెరైన్ కోర్ యూనిట్‌ను పశ్చిమాసియాకు తరలించారు. అమెరికా యుద్ధ విమానవాహక నౌక అబ్రహం లింకన్ కూడా పశ్చిమాసియాలోనే విధులు నిర్వర్తిస్తోంది. ఇవన్నీ ఇండో–పసిఫిక్ ప్రాంతంలో అమెరికాకు ఆందోళన కలిగించే అంశాలే" అని పేర్కొన్నారు.ఇరాన్‌తో యుద్ధానికి అమెరికా సైనిక వ్యయం నానాటికీ పెరుగుతోంది. టెహ్రాన్‌ను ఎదుర్కొనేందుకు అగ్రరాజ్యం రోజుకు ఓ బిలియన్ డాలర్ల మేర వెచ్చిస్తోన్నట్లు అంచనాలు వెలువడుతున్నాయి. దీనిపై స్వదేశంలోనూ పెద్దఎత్తున వ్యతిరేకత ఎదురవుతోంది. పశ్చిమాసియాలో యుద్ధం నుంచి అమెరికా ఉన్నట్టుండి వెనక్కి తగ్గే అవకాశం కన్పించట్లేదు. దీంతో తాను సృష్టించిన యుద్ధంలో.. తానే ఇరుక్కొన్నట్లయ్యింది అగ్రరాజ్యం పరిస్థితి..!



#### హర్మూజ్‌ను దాటిన పుతిన్ సన్నిహితుడి నౌక

అమెరికా– ఇరాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో హర్మూజ్ జలసంధిలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సన్నిహితుడు, బిలియనీర్ అలెక్సీ మోర్దాషావ్‌కు చెందిన ఓ విలాసవంతమైన నౌక ఈ జలసంధిని దాటినట్లు తెలుస్తోంది. హర్మూజ్‌పై అమెరికా దిగ్బంధనం కొనసాగుతోన్న నేపథ్యంలో ఇది చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. షిప్పింగ్ డేటా ప్రకారం.. 500 మిలియన్ డాలర్లకు పైగా (భారత కరెన్సీలో రూ.4,700 కోట్లు) విలువైన ఈ 'నార్డ్' అనే నౌక శుక్రవారం మధ్యాహ్నం దుబాయ్‌లోని మెరీనా నుంచి బయలుదేరింది. శనివారం ఉదయం హర్మూజ్ జలసంధిని దాటి.. ఆదివారం తెల్లవారుజామున మస్కట్‌కు చేరుకుంది. చమురు రవాణాకు హర్మూజ్ అత్యంత కీలకం. అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ఈ జలసంధి మీదుగా నౌకల రవాణా గణనీయంగా తగ్గిపోయింది. మరోవైపు అమెరికా దిగ్బంధనం కూడా కొనసాగుతోంది. ఈ క్రమంలో జలసంధిని దాటేందుకు ఈ విలాసవంతమైన నౌకకు ఎవరు అనుమతులిచ్చారనేది అస్పష్టంగా ఉంది. దీనిపై స్పందించేందుకు మోర్దాషావ్ ప్రతినిధి నిరాకరించారు. పుతిన్ సన్నిహితుడిగా పేరున్న మోర్దాషావ్ 'నార్డ్'కు యజమాని అని అధికారికంగా ఎక్కడా లేదు. కానీ, 2025 నాటి షిప్పింగ్ డేటా ప్రకారం.. ఈ నౌక ఆయన భార్య నిర్వహిస్తున్న ఓ రష్యన్ కంపెనీ పేరు మీద రిజిస్టర్ అయినట్లు తెలుస్తోంది. కాగా.. ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో పుతిన్‌తో సంబంధాలున్న అనేకమంది రష్యన్లపై అమెరికా, ఐరోపా ఆంక్షలు విధించాయి. ఆంక్షలకు గురైన వారిలో మోర్దాషావ్ కూడా ఉన్నారు. ఇక, టైమ్స్ పత్రిక ప్రకారం.. నార్డ్ ప్రపంచంలోని అతిపెద్ద యాట్‌లలో ఒకటి. ఇందులో 20 సూట్‌రూమ్‌లు, ఒక స్విమ్మింగ్ పూల్, ఒక హెలిప్యాడ్, ఒక జలంతర్గామి ఉన్నాయి.

## ఎన్ని అవాంతరాలు వచ్చినా.. మహిళా రిజర్వేషన్ అమలు చేస్తాం

గ్యాంగ్‌టక్‌లో సందడి చేశారు. యువతతో కలిసి ఫుట్‌బాల్ ఆడుతూ ఉల్లాసంగా గడిపారు. సిక్కిం రాష్ట్ర అవతరణ జరిగి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వేడుకలు జరుగుతున్నాయి. మంగళవారం జరగబోయే ముగింపు వేడుకల కోసం ప్రధాని గ్యాంగ్‌టక్ చేరుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఫుట్‌బాల్ ఆడారు. సిక్కిం 50వ అవతరణ దినోత్సవం సందర్భంగా ఆ రాష్ట్రంలో పర్యటిస్తున్న ప్రధాని మంగళవారం ఉదయం అక్కడి క్రీడాకారులతో కలిసి సరదాగా ఫుట్‌బాల్ ఆడారు. ఈ ఆటకు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. గ్యాంగ్‌టక్‌లో యువ మిత్రులతో కలిసి ఆడడం చాలా ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. ప్రధాని స్పోర్ట్స్ దుస్తుల్లో పిల్లలతో కలిసి ఆనందంగా ఫుట్‌బాల్ ఆడుతున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సిక్కిం 50వ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ ముగింపు కార్యక్రమానికి మోదీ హాజరై.. రూ.4,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ఆవిష్కరించారు. ఆ రాష్ట్రం భారత యూనియన్‌లో చేరి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రోడ్‌షోలో పాల్గొన్నారు. అధికారిక కార్యక్రమాలకు ముందు గ్యాంగ్‌టక్‌లో యువతతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. ఈ సందర్భంగా తీసిన ఫొటోలు, వీడియోలను ప్రధాని తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకోవడంతో అవి వేగంగా వైరల్ అయ్యాయి. యువతతో కలిసి క్రీడల్లో పాల్గొనడం తనకు ప్రత్యేక అనుభూతినిచ్చిందని ప్రధాని పేర్కొన్నారు. 'గ్యాంగ్‌టక్‌లో ఉదయం యువ స్నేహితులతో కలిసి ఫుట్‌బాల్ ఆడడం చాలా ఎనర్జీ ఇచ్చిందని మోదీ పేర్కొన్నారు. కాగా, సిక్కింలో ప్రధాని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయబోతున్నారు. సిక్కింలో రహదారుల కనెక్టివిటీ, ఆరోగ్యం, టూరిజం, విద్య, నగర అభివృద్ధి సహా వివిధ రంగాల్లో రూ.4,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించనున్నారు.

## 'అటల్ పెన్షన్'లో చేరతారా?

**న్యూఢిల్లీ:**60 తర్వాత నెలకు రూ.5వేల పెన్షన్+ రూ8.5 లక్షల కార్పస్.. న్యూఢిల్లీ:సాధారణంగా ఉద్యోగులకు పదవీ విరమణ తర్వాత పెన్షన్ అందుతుంది. దీంతో వారి పదవీ విరమణ తర్వాత జీవితం సాఫీగా సాగిపోతుంది. అదే అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు అటువంటి సౌకర్యాలేవీ ఉండవు. వీరికి కూడా ప్రభుత్వ ఉద్యోగుల్లానే 60 ఏళ్లు దాటాక పెన్షన్ అందాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అటల్ పెన్షన్ యోజన పథకాన్ని తీసుకొచ్చింది. ఇప్పటివరకు 9 కోట్ల మంది చందాదారులు ఈ పథకాన్ని ఎంపిక చేసుకున్నారు. ఇందులో ఎలా చేరాలి? నెలకు ఎంత జమ చేయాలి?కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వివిధ సామాజిక భద్రతా పథకాల్లో అటల్ పెన్షన్ యోజన ఒకటి. 2015 బడ్జెట్‌లో దీన్ని ప్రకటించారు. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఖఈఖీఆం) దీన్ని నిర్వహిస్తోంది. తక్కువ ఆదాయం కలిగిన అసంఘటిత రంగ కార్మికులకు పింఛన్ ప్రయోజనాలను కల్పించడం దీని ముఖ్యఉద్దేశం. ఈ పథకంలో చేరినవారు 60 ఏళ్ల తర్వాత వారి పెట్టుబడులకు అనుగుణంగా నిర్ణీత మొత్తాన్ని ప్రతి నెలా పెన్షన్ రూపంలో అందుకుంటారు. ఈ మొత్తం రూ.1000 నుంచి రూ.5వేలు వరకు ఉంటుంది. పెన్షన్ సమయంలో భర్త చనిపోతే భార్యకు, ఆమె మరణానంతరం ఆ కార్పస్‌ను నామినీకి అందిస్తారు.

ఎవరు అర్హులు

18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసున్న వ్యక్తులు ఈ పథకంలో చేరొచ్చు.పోస్టాఫీసు, ఏదైనా ప్రభుత్వరంగ బ్యాంక్‌లో పొదుపు ఖాతా కలిగిఉండాలి.

నేషనల్ పెన్షన్ స్కీమ్, ఆదాయపు పన్ను పరిధిలోకి వచ్చేవారు ఈ పథకానికి అనర్హులు.

ఎంత చెల్లించాలి?

ఈ పెన్షన్ స్కీమ్‌లో చెల్లించాల్సిన మొత్తం వారి వయసును బట్టి మారుతూ ఉంటుంది. రూ.1000 నుంచి రూ.5వేల వరకు పెన్షన్ మొత్తం ఉంటుంది. అందుకు అనుగుణంగానే చెల్లింపులు మారుతూ ఉంటాయి. 18 సంవత్సరాల వయసులో చేరేవారు 60 ఏళ్లు వచ్చేంతవరకు అంటే 42 ఏళ్లు ఈ పథకం కింద కంట్రిబ్యూట్ చేయాల్సి ఉంటుంది. 18 ఏళ్లకే పెన్షన్ స్కీమ్‌లో చేరేవారు.. రూ.42 నుంచి గరిష్ఠంగా రూ.210 వరకు చెల్లించాల్సి ఉంటుంది. అదే 40 ఏళ్ల వయసులో చేరితే 20 సంవత్సరాల పాటు కంట్రిబ్యూట్ చేయాలి. వీరు రూ.291 నుంచి రూ.1,454 వరకు చెల్లించాల్సి ఉంటుంది.

పెన్షన్ మొత్తం ఇలా..

అటల్ పెన్షన్ యోజన స్కీమ్‌లోకి చేరిన సభ్యులు వారి కంట్రిబ్యూషన్‌కు తగినట్టు 60 ఏళ్లు దాటాక నెలవారీ కచ్చితమైన పెన్షన్ పొందుతారు. నెల నెలా చేసే కంట్రిబ్యూషన్‌ను అనుసరించి రూ.1000, రూ.2000, రూ.3000, రూ.4000 గరిష్ఠంగా రూ.5000 వరకు పెన్షన్ అందుతుంది. ఉదాహరణకు మీరు 60 ఏళ్లు దాటిన తర్వాత ప్రతి నెలా రూ.5 వేల పెన్షన్ పొందాలనుకుంటే.. మీ వయసు 18 సంవత్సరాలైతే 60 ఏళ్లు వచ్చేంతవరకు నెలకు రూ.210 చొప్పున కంట్రిబ్యూట్ చేయాలి. అదే మీరు 40 ఏళ్లు వచ్చాక ఈ పథకంలోకి జాయిన్ అయితే 20 ఏళ్ల పాటు నెలకు రూ.1454 పెట్టుబడిగా పెట్టాలి.

ఒక పథకం మూడు ప్రయోజనాలు

అటల్ పెన్షన్ యోజన ద్వారా చందాదారులకు మూడు రకాల ప్రయోజనాలు లభిస్తాయి. నిర్ణీత వయసు దాటాక పెన్షన్‌తో పాటు, ఒకవేళ చందాదారుడు మరణిస్తే జీవిత భాగస్వామికి పెన్షన్ బదిలీ అవుతుంది. వారిద్దరూ దూరమైతే నామినీకి రిటైర్మెంట్ కార్పస్ అందుతుంది. వెయ్యి పెన్షన్ ఎంచుకుంటే రూ.1.7 లక్షలు, రూ.2 వేలకు రూ.3.4 లక్షలు, రూ.5వేలకు



రూ.8.5 లక్షలు కార్పస్‌గా నిర్ణయించారు.

దరఖాస్తు ఎలా?

అన్ని జాతీయ బ్యాంకులతో పాటు పోస్టాఫీసు ద్వారా ఈ పథకంలో చేరొచ్చు. ఆన్‌లైన్, లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆఫ్‌లైన్‌లో అయితే బ్యాంక్ శాఖకు వెళ్లి రిజిస్ట్రేషన్ ఫారంలోని అన్ని వివరాలు పొందుపరిచి అవసరమైన పత్రాల సమర్పించాలి. అన్‌లైన్‌లో అయితే బ్యాంక్ మొబైల్ యాప్/యాప్, వఔఖూ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆధార్ కార్డు, సేవింగ్స్ బ్యాంక్ అకౌంట్ వివరాలు, మొబైల్ నంబర్, వయసు ధ్రువీకరణ పత్రం, కేవైసీ డాక్యుమెంట్లు అవసరమవుతాయి.

ఆటో డెబిట్ సదుపాయం

ఈ పథకం కింద చేరిన సభ్యులు తమ బ్యాంకు ఖాతాను కంట్రిబ్యూషన్ ఖాతాతో లింక్ చేసి నెలవారీ నేరుగా డెబిట్ చేసే విధంగా బ్యాంకుకు అనుమతి ఇవ్వొచ్చు. దీనికోసం ప్రతినెలా తమ బ్యాంకు ఖాతాలో తగిన బ్యాలెన్స్ నిర్వహించాల్సి ఉంటుంది. లేదంటే పెనాల్టీ చెల్లించాల్సి వస్తుంది. నెలకు రూ.100 చెల్లించే వారు ఒక రూపాయి పెనాల్టీ కట్టాల్సి ఉంటుంది. అలాగే, నెలకు రూ.101 నుంచి రూ.500 చెల్లించేవారు రెండు రూపాయలు, రూ.501 నుంచి రూ.1000 చెల్లించే వారు ఐదు రూపాయలు, రూ.1000 కంటే ఎక్కువ చెల్లించే వారు పది రూపాయలు చెల్లించాలి. ఒకవేళ వరుసగా ఆరు నెలల పాటు తమ వాటా చెల్లించకపోతే సదరు ఫించను ఖాతాను స్తంభింపచేస్తారు. అదేవిధంగా 12 నెలల పాటు చెల్లించనట్లయితే ఆ ఖాతాను డీయాక్టివేట్ చేస్తారు. 24 నెలల అనంతరం అయితే ఖాతాను మూసివేసి అంతవరకు సేకరించిన మొత్తాన్ని చందాదారునికి అందజేస్తారు.

స్కీమ్‌లోని ప్రవేశించే సమయంలో తక్కువ చెల్లింపులు చేసినప్పటికీ.. భవిష్యత్‌లో పెన్షన్ మొత్తాన్ని పెంచుకోవాలనుకునే వారు కంట్రిబ్యూషన్‌ను పెంచుకొనే వెసులుబాటు కూడా ఉంది. అలాగే తగ్గించుకునే ఆప్షన్ కూడా ఉంది. ఏడాదికి ఒకసారి మాత్రమే ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది.

మధ్యలో నిష్క్రమించాల్సి వస్తే..?

60 ఏళ్లకు ముందే పెన్షన్ పథకం నుంచి స్వచ్ఛందంగా వైదొలగొచ్చు. అయితే, అప్పటివరకు కంట్రిబ్యూట్ చేసిన మొత్తంపై వచ్చిన రాబడిపై వర్తించే ఛార్జీలను తీసివేసి మిగిలిన మొత్తాన్ని మాత్రమే చెల్లిస్తారు. ఒకవేళ పాలసీ తీసుకున్న వ్యక్తి అనారోగ్యం బారినపడినప్పుడు పథకం నుంచి నిష్క్రమించవచ్చు. కొన్ని నిర్దిష్ట అనారోగ్యాలకు, కొన్ని ప్రత్యేక పరిస్థితులల్లో మాత్రమే ఈ ఆప్షన్ అందుబాటులో ఉంటుంది. ఒకవేళ ప్రభుత్వ నియమాల ప్రకారం నిర్దిష్ట అనారోగ్యం బారిన పడి పెన్షన్ పథకం నుంచి వైదొలగాలనుకుంటే అర్హుడైన వ్యక్తి చేసే కాంట్రిబ్యూషన్, ప్రభుత్వ కంట్రిబ్యూషన్ దానిపై రావాల్సిన వడ్డీ సహా మొత్తం చెల్లిస్తారు.

# నిర్లక్ష్యానికి చెక్..

## కొనుగోలు కేంద్రంపై కలెక్టర్ ఆగ్రహం





- ఐకేపీ ఏపీఎంకు షోకాజ్ నోటీసు ఆదేశం
- రిజిస్టర్ లేమి, నమోదు లోపాలపై తీవ్ర స్పందన
- రైతు ప్రయోజనాలపై రాజీ లేదని స్పష్టం
- తేమ శాతం, తూకాలపై స్వయంగా తనిఖీ

**నిజామాబాద్, ఏప్రిల్ 28 (జనం సాక్షి):** ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం చోటుచేసుకోవడంపై జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల అలసత్వం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరిస్తూ, భీంగల్ మండల ఐకేపీ ఏపీఎంకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. మంగళవారం భీంగల్ మండలంలోని పల్లికొండ, భీంగల్ గ్రామాలలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. పల్లికొండ కేంద్రంలో నిర్వహణలో అనేక లోపాలు ఉన్నట్లు గుర్తించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయకపోవడం, రిజిస్టర్ అందుబాటులో లేకపోవడం వంటి అంశాలపై నిర్వాహకులను ప్రశ్నిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి నిర్లక్ష్యం కొనసాగితే కమీషన్ నిలిపివేయడమే కాకుండా, వచ్చే సీజన్‌లో కేంద్రం కేటాయింపును కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల పర్యవేక్షణ బాధ్యతను నిర్వర్తించడంలో వైఫల్యం చోటుచేసుకుందని పేర్కొంటూ సంబంధిత ఏపీఎంకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలకు భంగం కలిగించే విధంగా ఎలాంటి నిర్లక్ష్యాన్నీ ఉపేక్షించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. కొనుగోలు ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా నిర్వహించి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చిన రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాయిశ్చర్ యంత్రం ద్వారా తేమ శాతాన్ని స్వయంగా పరిశీలించగా, ధాన్యం బస్తాల తూకాన్ని కూడా తనిఖీ చేశారు. 17 శాతం లోపు తేమ ఉన్న ధాన్యాన్ని వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని సూచించారు. వాతావరణ పరిస్థితులపై ముందస్తు సమాచారం అందించేందుకు వెదర్ యాప్ వినియోగించాలని, ట్రక్ షీట్లు, ట్యాబ్ ఎంట్రీలు వేగవంతం చేయాలని సూచించారు. తద్వారా రైతుల ఖాతాల్లో చెల్లింపులు సకాలంలో జమ అవుతాయని తెలిపారు. తహసిల్దార్లు, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో కేంద్రాలను నిరంతరం సందర్శిస్తూ నిర్వహణను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్, డీసీఓ శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# బైపాస్ రోడ్డు..బ్రిడ్జితో మంథని ప్రజలకు ఉపయోగం లేదు!

- రోడ్డు నిర్మాణంపై మంథని ఎమ్మెల్యే పునరాలోచన చేయాలే
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**మంథని, (జనంసాక్షి) :** బైపాస్ రోడ్డు..బ్రిడ్జితో మంథని ప్రజలకు ఉపయోగం లేదని, రోడ్డు నిర్మాణంపై పాలకులు పునరాలోచన చేసి, నిలిపివేయాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని అంగుళూరు శివారులో శ్రీపాద బైపాస్ రోడ్డు నిర్మాణ జరిగే ప్రాంతం, పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రోడ్డు నిర్మాణంతో మంథని ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని, ఇది వృదా అని పలుమార్లు ఎమ్మెల్యే కు విజ్ఞప్తి చేసినట్లు వివరించారు. బైపాస్ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి రెండేళ్ల క్రితమే జీఓ వచ్చిందని, ఇప్పటి వరకు భూసేకరణకు డబ్బులు రాలేదని తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణంలో 80 ఎకరాలు, 137 మంది రైతు కుటుంబాలు రోడ్డున పడనున్నాయని తెలిపారు. మంథని, అంగూళురు, విలోచవరం గ్రామ శివారు రైతులే ఎక్కువగా ఉన్నారని ఆయన వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు ఉంటే రెండు పంటలు పండుతున్న ఈ భూముల్లో మూడు పంటలు తీసుకోవచ్చన్నారు. పచ్చని పొలాలు హైవేకు దగ్గర ఉన్న ఈ భూములకు మంచి డిమాండ్ ఉండగా కేవలం అవసరం లేని రోడ్డు కోసం గుంజుకునే ప్రయత్నాలు మానుకోవాలన్నారు. ఈ ప్రాంతం బాగుపడుతుందంటే మా ఆస్తులు, భూములు తీసుకోవచ్చని, కేవలం తండ్రి పేరుకోసమో, బంధువు భూములకు విలువ కోసమో భూములు తీసుకుంటే ఊరుకునేది లేదన్నారు. ప్రతిపక్షాలు ఏదైనా మాట్లాడితే అందులో వాస్తవాలు, అవాస్తవాలను బేరీజు వేసుకుని వాస్తవాలు ఉంటే గమనించాలని ఆయన హితవు పలికారు. ఈ బైపాస్ రోడ్డు నిర్మాణం చేస్తే ఈ ప్రాంతానికి నష్టమే జరుగుతుందని, కరకట్టలతో నీళ్లు ఆగి పంటలు మునిగిపోయే ప్రమాదం ఉందన్నారు. ఆనాడు ఆరెంద మల్లారం వద్ద కరకట్టల విషయంలో అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని, దీంతో నాలుగేండ్లుగా పంటలు నీళ్లలోనే మునిగిపోతున్నాయని, అలాంటి పరిస్థితులు మళ్లీ ఎదురవుతాయని ఆయన గుర్తు చేశారు. రెండేళ్లయినా భూసేకరణకు డబ్బులు రాలేదన్న విషయాన్ని గుర్తించి ఉపయోగం లేని రోడ్డు నిర్మాణాన్ని తక్షణమే ఆపేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే బోయిన్‌పేట, గొల్లగూడెం మీదుగా రింగ్‌రోడ్డు నిర్మిస్తే ఈ ప్రాంతం కొంత మేర అభివృద్ధి చెందే అవకాశం ఉందని, ప్రజలకు ఉపయోగపడే రీతిలో పనులు చేయాలని, తక్షణమే బైపాస్ రోడ్డు నిర్మాణంపై పునరాలోచన చేయాలని ఆయన స్పష్టం చేశారు.

## కేపీహెచ్‌బీలో ఘోర రోడ్డు ప్రమాదం.. యువకుడు మృతి

**కూకట్‌పల్లి, ఏప్రిల్ 28 (జనంసాక్షి):** కేపీహెచ్‌బీ కాలనీ పరిధిలోని నిజాంపేట్ ఎక్స్‌రోడ్ వద్ద సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. మృతుడు అభినవ్ కుమార్ మిశ్రా (25)గా గుర్తించారు. మియాపూర్ నుంచి కేపీహెచ్‌బీ వైపు బైక్‌పై వస్తుండగా, మైఫీల్డ్ రెస్టారెంట్ సమీపంలో వెనుక నుంచి వచ్చిన హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి వాటర్ ట్యాంకర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యువకుడు కింద పడగా, ట్యాంకర్ వెనుక టైర్లు ఎక్కిపోవడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

ప్రమాదం జరిగిన వెంటనే ట్యాంకర్ డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలి పరారైనట్లు సమాచారం. మృతుడి బంధువు బిజేందర్ మణి త్రిపాఠి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ విషయాన్ని ఎస్ఐ శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు.

# విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన ఏహెచ్‌టియు



**గోదావరిఖని, జనంసాక్షి:** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో విద్యార్థుల్లో సామాజిక చైతన్యం పెంపొందించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, ఆంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ూఉుఖ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు చేపట్టారు.

పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలోని పలు విద్యాసంస్థల్లో ఈ కార్యక్రమాలు జరిగాయి. వాటిలో సెంట్ క్లేర్స్ హై స్కూల్ (ఎన్‌టీపీసీ), శ్రీ చైతన్య డిగ్రీ కాలేజ్ (గోదావరిఖని), కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాల (నస్పూర్), ఏకలవ్య ఆశ్రమం - సేవా భారతీ (మంచిర్యాల) వంటి సంస్థలు ఉన్నాయి.

ఈ కార్యక్రమాలకు ఎస్.ఐ. శైలజ నేతృత్వం వహించారు. విద్యార్థులకు లింగ సమానత్వం, బాల్యవివాహాల నిర్మూలన, పిల్లల భద్రత, పితృస్వామ్య భావజాలం, లింగ వివక్ష, మహిళలపై హింస వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. అలాగే సైబర్ నేరాలు, సైబర్ బులీయింగ్‌పై జాగ్రత్తలు వివరించి, అత్యవసర సమయంలో ఉపయోగపడే హెల్ప్‌లైన్ నంబర్లు - 100, 112, 1930 (సైబర్ క్రైమ్), 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్) గురించి తెలియజేశారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, బాధ్యతగల పౌరులుగా ఎదగాలని సూచించారు. యువతలో భద్రతపై అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమాల ముఖ్య లక్ష్యమని అధికారులు తెలిపారు.

# బాల భద్రతపై చైతన్యం.. వారోత్సవాల్లో విస్తృత అవగాహన





- 'ప్రజా పాలన'లో భాగంగా కార్యక్రమాలు
- కిశోర బాలికలకు మార్గనిర్దేశం
- సోషల్ మీడియా, మాదకద్రవ్యాలపై హెచ్చరికలు

**శంకరపట్నం, ఏప్రిల్ 28 (జనం సాక్షి):** మండలంలోని తాడికల్ గ్రామంలో బాల భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక"లో భాగంగా స్నేహ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ అరుణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సీడీపీవో శ్రీలత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ యుక్తవయస్సులో కిశోర బాలికల్లో కలిగే శారీరక, మానసిక మార్పులపై అవగాహన కల్పించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. సరైన మార్గనిర్దేశం ఉంటే బాలికలు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగగలరని అన్నారు. మిషన్ వాత్సల్య సిబ్బంది సాధినేని రమేష్ సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచిస్తూ, మాదకద్రవ్యాల వల్ల కలిగే ప్రమాదాలను వివరించారు.

గ్రామ సర్పంచ్ దుర్గపు సుజాత పోషకాహారం ప్రాముఖ్యతను తెలియజేస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమం అనంతరం బాలికలు, అధికారులు కలిసి మానవహారం నిర్వహించి బాల భద్రతపై సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి హైమ, అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, వీఓఏలు, కిశోర బాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమం బాలికల్లో ఆరోగ్యం, భద్రత, సామాజిక బాధ్యతలపై చైతన్యాన్ని పెంపొందించిందని నిర్వాహకులు తెలిపారు. ఇదిలా ఉండగా, కొత్తగట్టు-2 అంగన్వాడీ కేంద్రంలో కూడా చైల్డ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్వైజర్ పద్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాలల భద్రత, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్యవివాహాల నివారణ, కిశోర బాలికల పోషకాహారం వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఏపీఎం శ్రీనివాస్ పిల్లలు సమాజంలో ఎలా మెలగాలో, ముఖ్యంగా బాలికలు తమ భద్రత కోసం పాటించాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. గ్రామ సర్పంచ్ మాడ సుజాత బాలల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో కిశోర బాలికలు, తల్లులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు సమాజంలో భద్రతా విలువలను బలోపేతం చేస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

# నేడే పదవ తరగతి ఫలితాలు విడుదల



**అంబర్‌పేట్, ఏప్రిల్ 28 (జనంసాక్షి):** రాష్ట్రంలో నిర్వహించిన పదవ తరగతి (ూుజ) పరీక్షల ఫలితాలు నేడు విడుదల కానున్నాయి. మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు జరిగిన ఈ పరీక్షల ఫలితాలను మధ్యాహ్నం 2 గంటలకు విడుదల చేయనున్నారు. ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణ కలిసి ఫలితాలను ప్రకటించనున్నారు. ఇప్పటికే వాట్సాప్ ద్వారా హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకున్న అభ్యర్థులకు ఫలితాలు ఆటోమేటిక్‌గా అందనున్నాయి. డౌన్‌లోడ్ చేయని విద్యార్థులు 8096958096 నంబర్‌కు "ఎఱ" అని మెసేజ్ పంపి, తరువాత "SSC Result" టైప్ చేసి తమ హాల్ టికెట్ నంబర్ నమోదు చేస్తే వెంటనే ఫలితం స్క్రీన్‌పై పొందవచ్చు.

# మే 5 నిరాహార దీక్షకు సిద్ధం కండి: ఉద్యోగుల జేఏసీ

- పెండింగ్ డిఏలు, పీఆర్సీపై ఆగ్రహం
- ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం విమర్శ
- హక్కుల సాధనకు ఐక్యత అవసరం



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 28 (జనంసాక్షి) :** ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మే 5న నిర్వహించనున్న ఒక్కరోజు నిరాహార దీక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ పిలుపునిచ్చారు. మంగళవారం జేఏసీ ఆధ్వర్యంలో భాగస్వామ్య సంఘాలతో జరిగిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల హక్కుల సాధన కోసం అందరూ ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామస్థాయికి తీసుకెళ్లే ప్రధాన బాధ్యత ఉద్యోగులదేనని, అలాంటి ఉద్యోగుల సంక్షేమాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. అయితే ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు.

ఆరు నెలలకు ఒకసారి ఇవ్వాల్సిన డిఏలు, సంవత్సరానికి ఒకసారి ఇవ్వాల్సిన ఇంక్రిమెంట్లు, ఐదు సంవత్సరాలకు ఒకసారి అమలు చేయాల్సిన పీఆర్సీ వంటి అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని తెలిపారు. 2023 జూలై నుంచి అమలు కావాల్సిన పీఆర్సీ ఇప్పటివరకు అమలు కాలేదని, గతంలో ప్రకటించిన 5 శాతం ఇంటరిమ్ రిలీఫ్‌తోనే ఉద్యోగులను సరిపెట్టడం జరుగుతోందని విమర్శించారు. అలాగే 2024 జూలై నుంచి 2026 జనవరి వరకు రావాల్సిన ఐదు డిఏలను నిలిపివేయడం అన్యాయమ ని అన్నారు. ఉద్యోగుల జిపిఎఫ్, సరెండర్ లీవ్ బిల్లులు, టీజీఎల్ ఐఎఫ్ ఇన్సూరెన్స్, ఇతర బకాయిలు సంవత్సరాలుగా చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఓపిఎస్ పునరుద్ధరణపై ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేదని, సీపీఎస్ రద్దుపై స్పష్టత లేదని విమర్శించారు. హెల్త్ కార్డు పథకం అమలులో లోపాలు ఉన్నాయని, ఎంపానెల్డ్ ఆసుపత్రులను ఖరారు చేయకపోవడం వల్ల వైద్య సేవల్లో సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగు ల రెగ్యులరైజేషన్‌లో జాప్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులందరూ తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మే 5న జిల్లా స్థాయిలో నిర్వహించే నిరాహార దీక్షలో ప్రతి ఉద్యోగి పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, వివిధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లా నోడల్ ఆఫీసర్‌గా తుల శోభారాణి నియామకం



**పెద్దపల్లి, ఏప్రిల్ 28 (జనం సాక్షి):** తెలంగాణ యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీతో సమన్వయం కోసం పెద్దపల్లి జిల్లాకు నోడల్ ఆఫీసర్‌గా తుల శోభారాణిని నియమించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అంతర్గాంలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆమెను జిల్లా కలెక్టర్ ఆమోదంతో జిల్లా విద్యాధికారి శారద ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా తుల శోభారాణి మాట్లాడుతూ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతో సమన్వయం చేస్తూ జిల్లాలో క్రీడల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. శోభారాణి నియామకంపై క్రీడా వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. జిల్లా యువజన క్రీడల అధికారి అక్కపాక సురేష్, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్, వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘ నాయకులు వేల్పుల సురేందర్, దాసరి రమేష్ తదితరులు అభినందనలు తెలిపారు. సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు కే శ్రీనివాస్, విజయ్, శైలజ, మాధవి, మాధురి కూడా శుభాకాంక్షలు తెలియజేశారు.

# యూరియా తగ్గించి.. ఖర్చు తగ్గించండి

- రైతు ముంగిట్లో అవగాహన కార్యక్రమం విజయవంతం
- నేల ఆరోగ్యం, పంట మార్పిడిపై దృష్టి
- పథకాల సద్వినియోగంపై రైతులకు శాస్త్రవేత్తల మార్గనిర్దేశం



**ముస్తాబాద్, ఏప్రిల్ 28 (జనం సాక్షి):** రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించి సాగు ఖర్చులను నియంత్రించుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు. ముస్తాబాద్ మండలం బందనకల్ గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమంలో భాగంగా అన్నదాతలకు విస్తృత అవగాహన కల్పించారు. ఏప్రిల్ 27 నుంచి మే 23 వరకు కొనసాగుతున్న అన్నదాతల అభివృద్ధి కార్యక్రమంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డా. జి. ప్రియదర్శిని (అసిస్టెంట్ ప్రొఫెసర్), ఎం. సంధ్యా (టీచింగ్ అసోసియేట్) రైతులకు ఆరు ముఖ్య అంశాలపై మార్గనిర్దేశం చేశారు. తక్కువ యూరియా వినియోగం ద్వారా ఖర్చులను తగ్గించుకోవడం, నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, పంట మార్పిడి పాటించడం, సాగునీటి వినియోగాన్ని తగ్గించడం, సేంద్రియ పద్ధతులను అవలంబించడం వంటి అంశాలను సవివరంగా వివరించారు.

మండల వ్యవసాయ అధికారి అనుషా రైతులకు ప్రభుత్వ సబ్సిడీలు, వివిధ పథకాలపై అవగాహన కల్పిస్తూ వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ క్లస్టర్ అధికారి డి. హరీష్ పంటల విభిన్నీకరణలో భాగంగా ఆయిల్ పామ్ సాగు ప్రాముఖ్యతను వివరించి, దీని ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. అలాగే విద్యార్థులు బి. సుష్మ తేజ, డి. అఖిల, పి. శ్రీధర్ వర్మ కంపోస్టింగ్‌పై అవగాహన కల్పిస్తూ సేంద్రియ ఎరువుల తయారీ విధానం, వాటి ప్రయోజనాలను వివరించారు. గ్రామ సర్పంచ్ చిగురు నరేష్ రైతులు కొత్త పద్ధతులను స్వీకరించి సాగులో అభివృద్ధి సాధించాలని కోరారు. సుమారు 50 మంది రైతులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, కొత్త విధానాలపై ఆసక్తి చూపారు. ఈ కార్యక్రమం రైతుల్లో చైతన్యం పెంచడంలో కీలక పాత్ర పోషించిందని నిర్వాహకులు తెలిపారు.

# బాలల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ వినియోగంపై సూచనలు : కలెక్టర్ కోయ శ్రీహర్ష
- పిల్లల విద్య, ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక దృష్టి
- బాల్యవివాహాల నిర్మూలనకు ప్రశంసలు
- సంక్షేమ పథకాల అమలుపై అవగాహన కార్యక్రమం



**పెద్దపల్లి, ఏప్రిల్ 28 (జనం సాక్షి):** బాలల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక '99 రోజుల కార్యక్రమం'లో భాగంగా సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి బాలుడికి నాణ్యమైన విద్య, సముచిత పోషకాహారం, సురక్షిత వాతావరణం పొందే హక్కు ఉందని స్పష్టం చేశారు. పిల్లల సమస్యలపై వెంటనే స్పందిస్తూ 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మిషన్ వాత్సల్య్, అంగన్వాడీ సేవలు, ప్రీ-ప్రైమరీ విద్య ద్వారా పిల్లల సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

జిల్లాలో విద్యా రంగంలో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు నాణ్యత పెంపుపై దృష్టి సారిస్తున్నామని, విద్యార్థుల చదవడం, అర్థం చేసుకునే సామర్థ్యాల్లో మెరుగుదల సాధించినట్లు పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నపిల్లలకు సమతుల్య పోషకాహారం అందిస్తూ, వారి ఎదుగుదలను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఆర్‌బీఎస్‌కే కార్యక్రమం ద్వారా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం బాల్యవివాహాల రహిత గ్రామంగా ఎంపికైన పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామ సర్పంచ్‌కు సర్టిఫికెట్ అందజేశారు. గ్రామ ప్రజలు చూపిన చైతన్యాన్ని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

**మే 6న మెగా జాబ్ డ్రైవ్**

జిల్లా యువతకు ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు మే 6న మెగా జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. టాస్క్, డేట్ సంయుక్తంగా నిర్వహించే ఈ డ్రైవ్‌లో 57 సంస్థలు పాల్గొని సుమారు 1,799 ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయి. టెలికాం, కమ్యూనికేషన్, కస్టమర్ సపోర్ట్, బిపిఓ, సేల్స్, మార్కెటింగ్, డిజిటల్ సర్వీసెస్ వంటి విభిన్న రంగాల్లో అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్, ఎంబీఏ వంటి అర్హతలు కలిగిన యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అభ్యర్థులు తమ రెజ్యూమ్‌లతో హాజరుకావడంతో పాటు డేట్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. యువతకు ఉపాధి కల్పించడం ద్వారా వారి కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడటమే కాకుండా జిల్లా అభివృద్ధికి దోహదపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

# ఇందుర్తి రేషన్ షాపులో 130క్వింటాళ్ల బియ్యం మాయం

- సివిల్ సప్లై అధికారుల దాడుల్లో బయటపడ్డ అక్రమాలు
- డీలర్ పై కేసు నమోదు చేసి, ఇన్చార్జికి అప్పగింత




**చిగురుమామిడి ఏప్రిల్ 28 (జనంసాక్షి):** మండలంలోని ఇందుర్తి గ్రామంలోని రేషన్ షాప్ లో ఇటీవల సివిల్ సప్లై అధికారులు నిర్వహించిన దాడుల్లో దాదాపు 130క్వింటల్లకు పైగా రేషన్ బియ్యం మాయమైనట్లు సివిల్ సప్లై అధికారులు గుర్తించారు.ఇందుర్తి గ్రామానికి చెందిన దుస్స రాజమణి 2053922,2053914 తన రేషన్ షాప్ తోపాటు ఇటీవల మృతి చెందిన బురికి హనుమంత్ షాపుకు రాజమణి ఇన్చార్జిగా నిర్వహిస్తున్నారు. రేషన్ షాప్ లో అక్రమాలు జరుగుతున్నాయని పలువురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సివిల్ సప్లై అధికారులు రేషన్ షాప్ లో దాడులు నిర్వహించగా 58.78 క్వింటాళ్ల సన్న బియ్యం,71.58క్వింటాళ్ల దొడ్డు బియ్యం మాయం కావడంతో రేషన్ షాపును రద్దుచేసి,రాజమనిపై కేసు నమోదు చేసి,ఓగులాపూర్ గ్రామానికి చెందిన గట్టు మధు అనే రేషన్ డీలర్ కు ఇన్చార్జిగా బాధ్యతలు అప్పగించినట్లు డీఎస్ఓ నర్సింగ్ రావు,చిగురుమామిడి తాహాశీల్దార్ ముద్దసాని రమేష్ తెలిపారు.పేదలకు అందాల్సిన 130క్వింటాళ్ల బియ్యం ఏమైనట్లు,ఎవరికైనా విక్రయించారా అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు సివిల్ సప్లై అధికారులు తెలిపారు.విచారణ పూర్తికాగానే 130క్వింటల్లా బియ్యానికి రావాల్సిన అమౌంట్ ను రికవరీ చేసి మరి ఎక్కడ ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్ కు తరలిస్తూ,రేషన్ షాపులో పలుమార్లు అక్రమాలకు పాల్పడిన రేషన్ డీలర్ రాజమణిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అదే గ్రామానికి చెందిన దుస్స గౌరీ శంకర్ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
29 ఏప్రిల్ 2026

# స్కాలర్ షిప్‌లు అడిగితే.. అక్రమ నిర్బంధాలా?

## అరెస్టులతో విద్యార్థుల గొంతులను నొక్కలేరు

**ప్రభుత్వ తీరుపై మండిపడ్డ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి**



**హయత్‌నగర్, ఏప్రిల్ 28 (జనం సాక్షి) :** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఇచ్చిన "విద్యార్థి పాదయాత్ర" పిలుపును అడ్డుకునేందుకు పోలీసులు కుట్ర పూరితంగా వ్యవహరించారు. నారాయణగూడ నుండి ముఖ్యమంత్రి నివాసం వరకు తలపెట్టిన ఈ శాంతి యుత పాద యాత్రలో పాల్గొనకుండా, ఏఐఎస్ఎఫ్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టుల పేరుతో అక్రమంగా అదుపులోకి తీసుకున్నారు. ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు బొంగు అరుణ్ కుమార్ గౌడ్, జిల్లా సహాయ కార్యదర్శి చింత వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఈనపల్లి ఉపేందర్ లను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోందని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. విద్యార్థులు తమ న్యాయమైన హక్కులైన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం గళమెత్తితే పోలీసులతో అణచివేయడం ప్రభుత్వ చేతకాని తనానికి నిదర్శనమన్నారు. ముందస్తు అరెస్టులు, పోలీసుల నిర్బంధాలను చూసి ఏఐఎస్ఎఫ్ ఎన్నటికీ భయపడదని, ఇలాంటి చర్యలు తమ పోరాట స్ఫూర్తిని మరింత రగిలిస్తాయని ప్రభుత్వానికి తేల్చిచెప్పారు. విద్యార్థుల చదువు లకు భరోసా కల్పిస్తూ ప్రభుత్వం తక్షణమే పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, ఫీజుల చెల్లింపుపై స్పష్టమైన కాల పట్టిక (షెడ్యూల్) ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థు లపై వేధింపులు ఆపి, అరెస్టు చేసిన నాయకులను బేషరతుగా విడుదల చేయాలని, లేని పక్షంలో రాబోయే రోజు లలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్మిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# పరిగి సబ్ జైల్ తనిఖీ చేసిన న్యాయమూర్తి



- ఖైదీలకు అందుతున్న వసతులపై ఆరా
- జైల్లో మౌలిక సదుపాయాల పట్ల సంతృప్తి
- ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ఉచిత న్యాయం
- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ న్యాయమూర్తి రాధిక

**వికారాబాద్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 28 (జనం సాక్షి);** పరిగి సబ్ జైలును వికారాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సెక్రటరీ రాధిక సందర్శించి ఖైదీల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా జైల్లో ఖైదీల రోజువారీ దినచర్య వసతుల గురించి జైలు సూపరింటెండెంట్ రాజ్ కుమార్ జడ్జి కి వివరించారు. జైలు పరిసరాలు, బ్యారక్ ల నిర్వహణ, ఖైదీల ఆహార పదార్థాలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్బంగా జడ్జి ఖైదీలనిద్దేశించి మాట్లాడుతూ క్షనికావేశంలో చేసిన తప్పుల వలన మీరే కాకుండా మీ కుటుంబ సభ్యులు కుడా క్షోభ పడతారని మొదటిసారి చేసిన తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలని అన్నారు. జైలు నుండి విడుదల అయిన తర్వాత రెండవసారి జైలుకు రాకుండా సత్ప్రవర్తనతో సమాజంలో మెలగాలని కుటుంబం పైన భాధ్యతతో వ్యవరించాలన్నారు. ఆర్థిక స్థోమత లేని పేద ఖైదీలకు జిల్లా న్యాయ సేవా సంస్థ ద్వారా ఉచితంగా డిఫెన్స్ లాయర్ ను ఇవ్వడం బెయిల్ మంజూరు చేయించడం జరుగుతుందన్నారు. లాయర్ ను పెట్టుకునే ఆర్థిక స్థోమత లేని ఖైదీలు జిల్లా న్యాయ సేవా సంస్థ సేవలను ఉచితంగా పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ డిఫెన్స్ లాయర్స్ వెంకటేష్, శ్రీనివాస్, గౌస్ పాషా మరియు జైలు సిబ్బంది విశ్వనాథరావు, హరికృష్ణ పాల్గొన్నారు.

# రాయపోల్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి
- ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న రాయపోల్ సర్పంచ్
- ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరిక



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 28 (జనం సాక్షి) :** రాయపోల్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో సర్పంచ్ ఎన్నికలలో బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిగా అచ్చన మమత శ్రీశైలం 2382 ఓట్ల భారీ మెజారిటీ గెలుపొందారు. గ్రామ అభివృద్దె ధ్యేయంగా బిఆర్ఎస్ పార్టీని వీడి ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కాగా వారు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీ లో చేరుతున్నారని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రాయపోల్ గ్రామ సర్పంచ్ అచ్చన మమత శ్రీశైలంతోపాటు పలువురు వార్డు సభ్యులు మొలుగు అనిత సంజీవ, కంటే హారిక లింగం, వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీ లో ఎమ్మెల్యే సమక్షంలో భారీ సంఖ్యలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ లో చేరుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని, ప్రభుత్వ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాయపోల్ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రాచకొండ మైలారం వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ భూపతిగల్ల మహిపాల్, రాష్ట్ర నాయకులు ఈసీ శేఖర్ మామ, కొత్తకుర్మ మంగ శివకుమార్, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్ గౌడ్, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మంకాల కరుణాకర్, పాండురంగా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయస్వామిని సేవలో దేవాదాయ శాఖ కమిషనర్

**మల్యాల ఏప్రిల్ 28 (జనంసాక్షి) :** తెలంగాణ లోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కొండగట్టు ఆంజనేయస్వామిని దేవాదాయ శాఖ కమిషనర్ ఎం. హన్మంతరావు మంగళవారం దర్శించుకున్నారు. కమిషనర్‌తో ధార్మిక సలహాదారు గోవిందహరి కూడా పాల్గొన్నారు. ఆలయ ఈవో అంజనారెడ్డి అర్చకులు వేద పండితులు కమిషనర్‌కు ఆలయ సంప్రదాయం పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా మండపంలో ఆలయ అర్చకులు కమిషనర్‌ను వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఈవో అంజనారెడ్డి శేషవస్త్రం కప్పి స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.

**పారిశుద్ధ్య కార్మికులకు కూలి పెంపు**

ఆలయంలో సేవలందిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల రోజు కూలిని రూ.295 నుండి రూ.350కు పెంచడం పట్ల అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆదిరెడ్డి,నాయకులు శ్రీనివాస్, హరినాథ్, మల్లేశం, ప్రధానార్చకులు కపిందర్ ఉపప్రధాన అర్చకులు చిరంజీవి ,ఆలయ అధికారులు సునీల్, పాల్గొన్నారు.

# మానవత్వం మరచి...

- దంపతుల మధ్య కలహాలతో పోలీస్ స్టేషన్‌లో పిల్లలను వదిలిన తల్లిదండ్రులు
- పోలీసుల ఎదుటే కుటుంబ విభేదాలు.. వాగ్వాదం
- పిల్లల రోదనలతో కలచివేసిన ఘటన



**తిమ్మాపూర్, ఏప్రిల్ 28 (జనం సాక్షి):** మానవత్వాన్ని మరిచిన తల్లిదండ్రులు అభం, శుభం తెలియని చిన్నారులను పోలీస్ స్టేషన్‌లో వదిలి వెళ్లిన హృదయ విదారక ఘటన కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అల్గునూర్‌లో చోటుచేసుకుంది. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర చర్చకు దారి తీసింది. స్థానికుల వివరాల ప్రకారం పెద్దలను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకున్న రవి కుమార్, లలితల మధ్య గత కొంత కాలంగా కుటుంబ కలహాలు కొనసాగుతున్నాయి. సమస్య పరిష్కారం కోసం ఇరువురు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నప్పటికీ, అక్కడే వాగ్వాదం మరింత తీవ్రరూపం దాల్చింది.

ఈ క్రమంలో లలిత భర్త, పిల్లలు వద్దంటూ తాళి, మెట్టెలు తీసేసి అక్కడి నుంచి వెళ్లిపోవడం పరిస్థితిని మరింత దిగజార్చింది. ఆ తర్వాత తండ్రి రవికుమార్ కూడా పిల్లలను తన వద్ద ఉంచుకోవడానికి నిరాకరించి ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌లో వదిలి వెళ్లిపోయాడు. తల్లిదండ్రులు వదిలి వెళ్లడంతో చిన్నారులు పోలీస్ స్టేషన్‌లోనే కన్నీళ్లు పెట్టుకోవడం అక్కడున్న వారిని కలచివేసింది. ఈ హృదయ విదారక దృశ్యం చూసిన వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే స్పందించిన పోలీసులు పిల్లల నానమ్మను పిలిపించి వారికి అప్పగించారు. కుటుంబ వివాదాలు ఎంత ఉన్నా చిన్నారుల భవిష్యత్తును పణంగా పెట్టకూడదని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు

# మే 10న హైదరాబాద్ కు ప్రధాని నరేంద్ర మోదీ రాక

- బిజెపి తెలంగాణ రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి



**వికారాబాద్ ఏప్రిల్ 28, (జనంసాక్షి):** మే 10న హైదరాబాద్ కు భారత ప్రధాన నరేంద్రమోడీ పర్యటన విజయవంతం చేయాలనీ తెలంగాణ రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి తెలిపారు, మంగళవారం నాడు వికారాబాద్ లో మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాల తరువాత భారత ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ రాష్ట్రానికి రావడం ఎంతో ప్రత్యేకతను సంతరించుకుంటుందని మే 10 నాడు సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ పరేడ్ గ్రౌడ్ లో జరగబోయే భారీ బహిరంగ సభకు బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నారపనేని రామచంద్ర రావు సూచనల మేరకు రాష్ట్ర మెడికల్ సెల్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల వారిని మరియు వికారాబాద్ జిల్లాలోని పరిగి, తాండూర్, వికారాబాద్ లో వైద్య వృత్తిలో ఉన్నవారు మరియు అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో మెడికల్ సెల్ జిల్లా నాయకులు పి. నర్సిములు, డాక్టర్ రాములు, యాదయ్య జిల్లా మీడియా సెల్ కన్వీనర్ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టీనేజ్ గర్భధారణ ఎలోప్మెంట్ పై అవగాహనా కార్యక్రమం

- సోషల్ మీడియా ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి
- మునిసిపల్ చైర్ పర్సన్ దేవర సమత వెంకటరెడ్డి



**చేవెళ్ల, ఏప్రిల్ 28 (జనంసాక్షి) :** టీనేజ్ గర్భధారణ ఎలోప్మెంట్ వంటి సమస్యల పై సమాజంలో ప్రతి ఒక్కరు అవగాహన అవగాహనా కలిగి ఉండాలని చేవెళ్ల మునిసిపల్ చైర్ పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. చేవెళ్ల పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మంగళవారం మున్సిపల్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో "ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ" అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఊరెళ్ల, కేసారం, మల్లారెడ్డిగూడ, కందవాడ, మల్కాపూర్, దామరగిద్ద, రామన్న గూడ, ఇబ్రహీంపల్లి, మొండివాగు ప్రాంతాల్లో కార్యక్రమాలు సాగాయి. మున్సిపల్ కార్యాలయం సమీపంలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమతా వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్న వయస్సులో తీసుకునే నిర్ణయాలు జీవితంపై ప్రభావం చూపుతాయని తెలిపారు. ఫేస్ బుక్, ఇన్స్టాగ్రామ్, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్త అవసరమని, అపరిచితుల మాటలకు లోనవ్వకూడదని సూచించారు. అమ్మాయిలు తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ముందడుగు వేయాలని హితవు పలికారు. ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశం, వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్లు శైలజఆగి రెడ్డి, మద్దెల శ్రీనివాస్, దూత మల్లేష్, పెద్దోళ్ల దయాకర్, సుచిత బల్వంత్ రెడ్డి, పైండ్ల మధుసూధన్ రెడ్డి, తాళ్ళపల్లి నర్సింహులు, గోపాల్ రెడ్డి, ఏఎస్ఐ వనం శిరీష, ఐసిడిఎస్ సూపర్వైజర్ రేవతి, అంగన్వాడీ టీచర్లు ఉమారాణి, ప్రవీణ, ఆశా వర్కర్లు, మహిళలు, మున్సిపల్ అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి మదర్ థెరిసా ఇంజనీరింగ్ కళాశాలలో భరోసా టీం అవగాహన సదస్సు

**పెద్దపల్లి,ఏప్రిల్ 28(జనంసాక్షి) :** రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా ఐపీఎస్ సార్ ఆదేశానుసారంగా మంగళవారం మదర్ థెరిసా ఇంజనీరింగ్ కాలేజీ,గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణలో ప్రజా పాలనా- ప్రగతి ప్రణాళిక (90 రోజుల ప్రణాళిక) లో బాగంగా భరోసా టీం, అవగాహన కార్యక్రమంను నిర్వహించడం జరిగింది. రకరకాల పద్ధతుల్లో మాయ మాటలు చెప్పి అమ్మాయిలను, మహిళలను మోసాలు చేస్తున్న నేటి కాలంలో నేరాల అదుపులో ప్రజలు కీలకపాత్ర పోషించాలని, , జాగ్రత్తతో మెలగడం వల్ల నేరాలను అదుపు చేయవచ్చని వారు పేర్కొన్నారు.లింగ వివక్షత చూపించకుండా పిల్లల పెంపకం వుండాలని, బాల్య వివాహంల నిర్ములన గురించి,సైబర్ నేరాలు, మానవ అక్రమ రావణ మరియు మహిళలపై అత్యాచారాలు, విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల నిర్ములన గురించి ఎవరైనా మాదక ద్రవ్యాలు తీసుకున్నట్లు తెలిసిన వెంటనే పోలీసు వారికీ సమాచారమివ్వాలని, సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1930కి ఫిర్యాదు చేయాలి వివరించారు. మనకు తెలియని నెంబర్స్ నుండి మహిళలకు ఇబ్బందులు గురైనప్పుడు, ఎవరైనా మహిళలపై అనుచితంగా అసభ్యంగా ప్రవర్తించినట్లయితే ధైర్యంగా పోలీస్ వారికి సమాచార అందించాలని సూచించారు.భరోసా సెంటర్ మరియు విధులు గురించి, మహిళలకు మరియు పిల్లలకు భరోసా సెంటర్ కల్పిస్తున్న సదుపాయాలు గురించి, ఫోక్స చట్టం గురించి ప్రజలకు వివరించారు భరోసా ఇంచార్జ్ ఎస్సై ఎం లావణ్య,కో-ఆర్డినటార్ డకౌన్సలర్ కే. ఆశ్రిత,లీగల్ సపోర్ట్ పర్సన్ ఎం సంధ్యారాణి, సపోర్ట్ పర్సన్స్ ఎండి ఆస్మా, మరియు ఏఎన్ఎం వి భారతి తదితరులు పాల్గొన్నారు.

# గింజ కటింగ్ లేకుండా కొనుగోలు జరిపే నియోజకవర్గం పెద్దపల్లి

- అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు
- కొనుగోలు జరిపిన వెంటనే ఖాతాలోకి డబ్బులు జమ
- ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే సిహెచ్ విజయ రమణారావు



**పెద్దపల్లి, ఏప్రిల్ 28 (జనం సాక్షి):** పెద్దపల్లి నియోజకవర్గంలో రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని, గింజ కటింగ్ పేరుతో ఎలాంటి అన్యాయం జరగనీయబోమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సిహెచ్ విజయ రమణారావు స్పష్టం చేశారు. మంగళవారం పెద్దపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి, రాగినేడు, కూరమపల్లి, అందుగులపల్లి, దేవునిపల్లి, రంగా పూర్, గౌరెడ్డిపేట, ముత్తారం, హన్మంతునిపేట, చీకురాయి గ్రామాలతో పాటు సుల్తానాబాద్ మండలం కట్నపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో కటింగ్ పేరుతో రైతులను దోచుకున్న పరిస్థితులు ఇక పునరావృతం కావని స్పష్టం చేశారు. రైతులు కష్టపడి పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, ఎలాంటి అక్రమాలకు తావులేకు ండా పారదర్శకంగా కొనుగోళు జరుగుతాయని తెలిపారు. కొనుగోలు పూర్త య్యగానే రైతుల ఖాతాల్లోకి డబ్బులు నేరుగా జమ అవుతాయని పేర్కొన్నారు.

రైతు సమస్యల విషయంలో తాను ఎప్పుడూ రాజీపడనని, రైతుల విశ్వాసం తనకు బలమని అన్నారు. రైతులు తనను రైతుబిడ్డగా భావించడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు వచ్చినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని రైతులను కోరారు. ఈ సందర్భంగా రంగాపూర్ గ్రామంలో 30 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పత్రాలను అందజేశారు. అర్హులందరికీ ఇండ్లు మంజూరు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సన్న వడ్లకు బోనస్ అందించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొంటూ, రైతు భరోసాపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. విడతల వారీగా రైతు భరోసా నిధులు విడుదలవుతున్నాయని వివరించారు. ముఖ్యమంత్రి సహకారంతో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, సింగిల్ విండో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచులు, నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులకు డీజిల్ కొరత లేకుండా చూడాలి

**బీఆర్ఎస్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎడవెల్లి కొండాల్ రెడ్డి డిమాండ్**



**హుజురాబాద్, ఏప్రిల్ 28 (జనం సాక్షి) :** రాష్ట్రంలో వరి కోతలు జోరుగా కొనసాగుతున్న నేపథ్యంలో డీజిల్ కొరత రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని బిఆర్ఎస్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎడవెల్లి కొండాల్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కోతకొచ్చిన వరి పంటను సమయానికి కోయడం, తరలించడం కోసం డీజిల్ అత్యవసరమని, కానీ ప్రస్తుతం పెట్రోల్ బంకుల్లో సరిపడా డీజిల్ అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డీజిల్ కొరత కారణంగా కోత యంత్రాలు నిలిచిపోవడంతో పాటు పంట పొలాల్లోనే నిల్వ ఉండే పరిస్థితి ఏర్పడుతోందని ఆయన పేర్కొన్నారు. ఇది రైతులకు ఆర్థిక నష్టాలను మిగల్చే ప్రమాదం ఉందని అన్నారు. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా రైతులు ఎక్కువగా ప్రభావితమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి డీజిల్ సరఫరాను పెంచి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కొండాల్ రెడ్డి డిమాండ్ చేశారు. వరి కోతల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

# అమరుల త్యాగాలతో ఎరుపెక్కిన దినం మేడే

- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ
- సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి



**అబ్దుల్లాపూర్ మెట్టు, ఏప్రిల్ 28(జనం సాక్షి):** అమెరికాలోని చికాగో నగరంలో కార్మికులు చిందించిన నెత్తుటి త్యాగ ఫలితమే నేటి మేడే అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. 141 వ మేడే ని పురస్కరించుకొని ఏఐటియుసి ఆధ్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్ ని మంగళవారం నాడు రావి నారాయణరెడ్డి కాలనీ పేజ్ 3 భూ పోరాట కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు,సిపిఐ అబ్దుల్లాపూర్మెట్ మండల కార్యదర్శి అజ్మీర హరిసింగ్ నాయక్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా ఆందోజు రవీంద్ర చారి ,ముత్యాల యాది రెడ్డి లు హజారుయ్యారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలో మరియు దేశంలో కార్మికులు అనేక పోరాటాలు చేసి ప్రాణాలు అర్పించి తమ హక్కులని సాధించుకున్నారని అనేక కార్మిక చట్టాలు కూడా కేవలం పోరాటాలు ద్వారానే సాధ్యం అయిదాన్నారు. అడుక్కుంటే హక్కులు రావని పోరాటం ద్వారా మాత్రమే సాదించుకోవాలని అన్నారు.కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి మొదలు నేటి వరకు కూడా ప్రధాని మోడీ అనేక కార్మిక వ్యతిరేక విధానాలు మరియు ప్రజా వ్యతిరేక విధానాలే అవలంబిస్తూ కార్మిక వ్యతిరేక ప్రభుత్వంగా బీజేపీ మిగిలిందని మండిపడ్డారు.కార్మిక పోరాటంలో ప్రాణాలు వదిలిన వారి పోరాట స్ఫూర్తితో నాలుగు లేబర్ కోడ్ లు రద్దు కొరకు పాత లేబర్ కోడ్ ల అమలు కొరకు మరియు భవన నిర్మాణ కార్మికులకు ప్రమాద భీమా కోసం ఆర్టీసీని ప్రభుత్వం లో విలీనం కొరకు కార్మికులకు గౌరవ ప్రధమైన వేతనం కోసం బ్యాక్ ల వీలినానికి వ్యతిరేకంగా కార్మికుల అంత ఏకమై పోరాటాలు చేసి తమ హక్కులు సాధించుకొని కార్మిక చట్టాలు పటిష్టమైన అమలు కొరకు కృషి చేయాలనీ అన్నారు. మేడే రోజు వాడ వాడా లో జెండాలు ఎగారావేసి మేడే స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్,బిఓసి జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి ప్రసాద్,పొన్నాల యాదగిరి, నాయకులు మధు,వినోద్ నాయక్,బిఓసి మెట్టు మండల ప్రధాన కార్యదర్శి దవుల రాములు, ఈశ్వరయ్య, బాల్ రెడ్డి, లాలప్ప, వెంకటేష్, పాండు, రాములు, అశోక్, శోభన్, ప్రియా, అన్నపూర్ణ, నీలా, రాణి, కావేరి, రవళి, అలివేలు, నాగరాణి, మధుసూన్,తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షకు పగడ్బందీ ఏర్పాట్లు

- జిల్లాలో 1,179 మంది అభ్యర్థులు
- నాలుగు కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ
- కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- కట్టుదిట్టమైన భద్రత, సమగ్ర సదుపాయాలు



**వికారాబాద్, ఏప్రిల్ 28 (జనం సాక్షి):** నీట్ పరీక్షను ఎలాంటి లోపాలు లేకుండా పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరీక్ష నిర్వహణలో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

మే 3న జరగనున్న నీట్ పరీక్షకు వికారాబాద్ జిల్లాలో మొత్తం 1,179 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. జిల్లా కేంద్రంలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, గత సంవత్సరం మాదిరిగానే ప్రశాంత వాతావరణంలో పరీక్షలను నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌లో పేర్కొన్న నిబంధనలను తప్పక పాటించాలని సూచించారు.

ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, సిబ్బందికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద తహసిల్దార్ స్థాయి అధికారులు, ఎస్సై, గన్‌మెన్, కానిస్టేబుళ్లతో భద్రతను కట్టుదిట్టం చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలు చేయాలని తెలిపారు. అభ్యర్థులకు సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులను సమయానికి నడపాలని, దివ్యాంగుల కోసం వీల్‌చైర్లు, అంబులెన్స్, ప్రాథమిక వైద్యం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాలకు మొబైల్ ఫోన్లు అనుమతి లేదని, అభ్యర్థులను కచ్చితంగా తనిఖీ చేయాలని పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణ పర్యవేక్షణ కోసం జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్పీ, నీట్ సిటీ కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

**టెలికాం సేవలపై సమీక్ష**

జిల్లాలో నాణ్యమైన కమ్యూనికేషన్ సేవలు అందించేందుకు టెలికాం సంస్థలు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. జిల్లా స్థాయి టెలికాం కమిటీ సమావేశంలో గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలు, టవర్‌ల ఏర్పాటులో ఇబ్బందులపై చర్చించారు. ప్రజలకు నిరంతర, మెరుగైన సేవలు అందేలా సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
29 ఏప్రిల్ 2026

## మామునూరు ఎయిర్‌పోర్ట్ స్థల పరిశీలన

- ఎయిర్‌పోర్ట్ అథారిటీ బృందం రాక



**వరంగల్ బ్యూరో, ఏప్రిల్ 28 (జనం సాక్షి) :** ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు రెండు రోజుల పర్యటనలో భాగంగా వరంగల్ జిల్లాలో పర్యటించారు. ఈ బృందంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ,అదనపు కలెక్టర్ జి.సంధ్య రాణి ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బృందంఈడీ ఎస్.కె. గుప్తా, జై గౌరవ్ చౌదరి, జేజీఎం బాలేందర్ కుమార్ తివారి, కేజీఎం గోపాలకృష్ణ కలిసి మామునూరు విమానాశ్రయానికి ప్రత్యేక డిజైన్ రూపకల్పనలో భాగంగా మంగళవారం మామునూరు ఎయిర్‌పోర్ట్ స్థలాన్ని పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా పడమర కోట కీర్తి తోరణం, ఏకశిల గుట్టలోని స్వయంభూ దేవాలయం, రాతి మట్టి కట్టడాలను సందర్శించారు. కాకతీయుల శిల్పకళా వైభవాన్ని తిలకించిన అధికారులు ఆనందం వ్యక్తం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను కూడా పరిశీలించారు. ఈ సందర్శనలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రిలయన్స్ ఫ్రాడ్ కేసులో ఈడీ దూకుడు

### సుమారు 3034 కోట్ల ఆస్తుల అటాచ్



**ముంబై, ఏప్రిల్28 (జనంసాక్షి) :** రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ బ్యాంకు ఫ్రాడ్ కేసులో సుమారు 3034 కోట్ల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అటాచ్ చేసింది. దీంతో ఈ కేసులో ఇప్పటి వరకు రిలయన్స్ అనిల్ అంబానీ గ్రూపుకు చెందిన సుమారు 19,344 కోట్లు అటాచ్ చేశారు. అటాచ్ చేసిన ప్రాపర్టీల్లో ముంబైకి చెందిన ఉషా కిరణ్ బిల్డింగ్, ఖండాలాలోని ఫార్మ్‌హౌజ్, అహ్మదాబాద్‌లోని సనాంద్‌లో ఉన్న భూమి ఉన్నాయి. రిలయన్స్ ఇన్‌ఫ్రాస్టక్చర్ సంస్థకు చెందిన 7.71 కోట్ల విలువైన షేర్లను కూడా జప్తు చేశారు. అనిల్ అంబానీకి చెందిన రైస్ ట్రస్ట్ ఆధీనంలో ఆ గ్రూపు ఉన్నది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఏర్పడిన సిట్ బృందం రిలయన్స్ అనిల్ అంబానీ గ్రూపు కేసులను విచారిస్తున్నది. మనీల్యాండరింగ్‌తో పాటు నిధుల మళ్లింపు, బ్యాంక్ నిధుల దుర్వినియోగం కోణంలో కేసు విచారణ జరుగుతున్నది. ఎస్బీఐ, పీఎన్బీ, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎల్ఐసీ ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సీబీఐ కేసులు నమోదు చేసింది. ఆ కేసులపై ఈడీ దర్యాప్తు చేస్తున్నది. ఆర్‌కామ్‌తో పాటు ఆ గ్రూపు కంపెనీలు దేశీయ, విదేశీ కంపెనీల నుంచి రుణాలు తీసుకున్నది, ఆ మొత్తం విలువ సుమారు 40,185 కోట్లు ఉంటుందని భావిస్తున్నారు.

## 1న జీతాలు రావడం లేదు

- ఎమ్మెల్యేకు అంగన్‌వాడీల స్పష్టీకరణ

**మహబూబాబాద్, ఏప్రిల్28 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రజాపాలన అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి నెలా ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రూ నాయక్ పేర్కొన్నారు. దీంతో అక్కడే ఉన్న అంగన్‌వాడీలు 'అయ్యో సార్ మాకు ఒకటో తేదీన జీతాలు రావడంలేదు' అని ముక్తకంఠంతో ఎమ్మెల్యే ప్రసంగానికి అడ్డుతగిలారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని రైతువేదికలో కల్యాణలక్ష్మి చెక్కులు, అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. రామచంద్రూ నాయక్ మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు ఇస్తున్నామని తెలిపారు. దీంతో అక్కడే ఉన్న అంగన్‌వాడీ కలుగజేసుకొని 'సార్ మాకు మాత్రం జీతాలు రావడం లేదు' అని ప్రసంగానికి అడ్డుతగిలారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టిలో జీతాలు పెంచాలనే అంశం ఉందని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని చెప్పగా.. 'సార్ మాకు పోయిన నెల జీతం రూ.13,650 ఇప్పటి వరకు రాలేదు' అని అంగన్‌వాడీలు గుసగుసలాడారు.

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

**హైదరాబాద్, ఏప్రిల్28 (జనంసాక్షి) :** డాలర్ కాస్త బలపడడం, గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్ తగ్గడం వంటి కారణాలతో మంగళ వారం బంగారం ధర తగ్గుదల నమోదు చేసింది. భౌగోళిక, అంతర్జాతీయ రాజకీయ కారణాలతో కాస్త హెచ్చుతగ్గులకు లోనవుతోంది. మంగళవారం ఉదయం పది గంటల సమయంలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.710 మేర తగ్గుదల నమోదు చేసింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ఉదయం 10.00 గంటల సమయం లో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,53,000గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,40,250గా ఉంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.650 మేర తగ్గింది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,53,150గా, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,40,400గా ఉంది. మరోవైపు వెండి ధరలు కూడా తగ్గుదలను నమోదు చేశాయి. కిలోకు 4 వేల రూపాయల మేర తగ్గాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2.65 లక్షలుగా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2.6 లక్షలుగా ఉంది. అలాగే చెన్నైలో కిలో వెండి ధర రూ.2.65 లక్షలుగా, బెంగళూరులో రూ.2.60 లక్షలుగా ఉంది.

## కవిత ప్రశ్నలకు ఎందుకు సమాధానం ఇవ్వలే

### కాళేశ్వరం తదితర విషయాలపై ఎందుకు దాటవేస్తున్నారు

- రైతుల గురించి బిఆర్ఎస్‌ది మొసలి కన్నీరు
- కెసిఆర్ తీరుపై మండిపడ్డ విప్ ఆది శ్రీనివాస్




**హైదరాబాద్, ఏప్రిల్28 (జనంసాక్షి) :** రైతు ప్రయోజనాలకు పెద్దపీట వేసిందే కాంగ్రెస్ పార్టీ అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఆలోచన చేయడంతోపాటు, పంటలకు మద్దతు ధర చట్టాన్ని తీసుకొచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని చెప్పారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో తరుగు పేరుతో రైతులను దోపిడీ చేశారని విమర్శించారు. ఏ రైతునూ కలవని కేసీఆర్‌కు తాము ఇబ్బందుల్లో ఉన్నామని చెప్పిందెవరని నిలదీశారు. సారు బయటకి రారు.. ఎవరినీ కలవరు.. అని స్వయంగా కేసీఆర్ కుమార్తె అన్నారు. రాష్ట్ర రైతులను పట్టించుకోని కేసీఆర్.. ఇతర రాష్ట్రాలకు వెళ్లి చెక్కులు ఇచ్చారని ఆమె చెప్పారు. కవిత చేసిన వ్యాఖ్యలపై సమాధానం చెప్పని కేసీఆర్.. కాంగ్రెస్‌ను తప్పు పడుతున్నారని మండిపడ్డారు. ముందు ఆమె చేసిన వ్యాఖ్యలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల కోసం గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఏడాదికి రూ.2,800 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. వరిసాగు విస్తీర్ణంలో తెలంగాణ ఇవాళ పంజాబ్‌ను అధిగమించింది. ఈ సీజన్‌లో కూడా 8వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం నడుపుతోందన్నారు. మసిపూసి మారేడుకాయ చేయడం బీఆర్ఎస్ నేతలకు అలవాటు. ధాన్యానికి బోనస్‌గా రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ.3 వేల కోట్లు వేశాం. వరికి బోనస్ ఇవ్వాలనే ఆలోచన కేసీఆర్‌కు ఎప్పుడైనా వచ్చిందా అని ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. చేసిన తప్పులను కెసిఆర్ కూతరు కవితే బయట పెట్టారని అన్నారు. కాళేశ్వరం సహా అనేక విషయాల్లో సంధించిన ప్రశ్నలకు కెసిఆర్ సమాధానం చెప్పివుంటే హుందాగా ఉండేదని అన్నారు.

# దూర విద్యావిధానంలో చదువుకున్న లక్షా24 వేల మంది భవిష్యత్తును కాపాడండి

- 'సీఎం ప్రజావాణి' లో విద్యార్థుల విజ్ఞప్తి
- న్యాయం చేసేందుకు చిన్నారెడ్డి భరోసా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్ర విభజన చట్టం 2014 సెక్షన్ 95 ప్రకారం ఏపీకి చెందిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నిర్వహించిన విరవిద్య విధానం ద్వారా వివిధ కోర్సులు పూర్తి చేసుకున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఒక లక్ష ఇరవై నాలుగు వేల 524 మంది భవిష్యత్తును కాపాడాలని కోరుతూ విద్యార్థులు " సీఎం ప్రజావాణి "లో ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో నిర్వహించిన 217వ 'సీఎం ప్రజావాణి'కి పెద్ద ఎత్తున విద్యార్థులు తరలివచ్చారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఆయా యూనివర్సిటీల ద్వారా ఇరు రాష్ట్రాల్లో దూరవిద్య విధానం ద్వారా విద్యార్థులకు అడ్మిషన్స్ కల్పించి వివిధ కోర్సులను పూర్తి చేసుకునే అవకాశాన్ని కల్పించాయని, తద్వారా డిగ్రీలు, పీజీలు పూర్తి చేసుకున్న తెలంగాణ విద్యార్థులకు 2021 వరకు వివిధ శాఖల్లో ఉద్యోగాలు లభించాయని వారు పేర్కొన్నారు.

అయితే 2022 లో తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఏ.పి. కి చెందిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్య ధ్రువపత్రాలు అంగీకరించమని చెప్పడంతో కోర్టును ఆశ్రయించామని, హైకోర్టు తీర్పు కూడా తమకు అనుకూలంగా వచ్చినా ఉద్యోగ అవకాశాలలో నాగార్జున యూనివర్సిటీ దూరవిద్య ధ్రువపత్రాలను పరిగణలోకి తీసుకునే సమస్య లేదని చెప్పడంతో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఒక లక్ష 24 వేల 524 మంది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ.చిన్నారెడ్డి స్పందిస్తూ విద్యాశాఖ, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉన్నత అధికారులతో ఫోన్లో మాట్లాడి విద్యార్థుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని చిన్నారెడ్డి భరోసా ఇచ్చారు. రాష్ట్రంలోని అన్ని శాఖల గురుకుల పాఠశాలలో ఎంపికైన ఉద్యోగస్తుల తర్వాత ఏర్పడిన ఖాళీలను ఆ తర్వాత వచ్చిన ర్యాంక్ అభ్యర్థులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరుతూ పలువురు అభ్యర్థులు సీఎం ప్రజావాణిలో చిన్నారెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు.



### సీఎం ప్రజావాణిలో 325 దరఖాస్తులు

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన 217వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 325 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 92, రెవెన్యూ శాఖకు సంబంధించి 40, ఇందిరమ్మ ఇండ్ల కోసం 106 దరఖాస్తులొచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 87 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సూర్య ప్రకాష్, ఏ.సీ.పీ. ఉమేందర్, ఎన్. ఆర్. ఐ. సలహా మండలి వైస్ చైర్మన్ మంద భీం రెడ్డి, ప్రవాసి ప్రజావాణి సమన్వయకర్త బొజ్జా అమరేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వివాదంలో అషురెడ్డి వ్యవహారం

- పెళ్లిపేరుతో ధర్మేంద్ర నుంచి రూ. 9.83 కోట్లు వసూళ్లు
- ధర్మేంద్ర కుటుంబం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు
- హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన అషురెడ్డి





**హైదరాబాద్, ఏప్రిల్ 28 (జనంసాక్షి) :** బిగ్ బాస్ ఫేమ్, ప్రముఖ సినీనటి అషురెడ్డి చుట్టూ వివాదాలు ముదురుతున్నాయి. పెళ్లి పేరుతో తనను, తన కుటుంబాన్ని నమ్మించి దాదాపు రూ. 9.83 కోట్లు మోసం చేసిందంటూ బాధితుడు ధర్మేంద్ర కుటుంబం ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఆమెపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ అషురెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. బాధితుడు ధర్మేంద్ర తండ్రి సత్యనారాయణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం ఈ కేసులోని ప్రధానాంశాలు ఇలా ఉన్నాయి. అషురెడ్డి, ధర్మేంద్ర వివాహం చేసుకోవాలని అనుకున్నారని వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో ప్రముఖ జ్యోతిష్కుడు వేణుస్వామి వద్దకు వెళ్లి ఇరు కుటుంబాలు జాతకాలు కూడా చూపించాయని ప్రచారం జరుగుతోంది. పెళ్లి సాకుతో అషురెడ్డి తన వద్ద నుంచి సుమారు రూ. 9.83 కోట్లు వసూలు చేసిందని ధర్మేంద్ర ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా, ఆమె సోదరి దివ్యారెడ్డికి కూడా రూ. 50 లక్షలు ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పెళ్లికి అన్ని సిద్ధమవుతున్న తరుణంలో అషురెడ్డి అకస్మాత్తుగా ధర్మేంద్రను వివాహం చేసుకోవడానికి నిరాకరించినట్లు సమాచారం. అషురెడ్డి తనను మానసికంగా, ఆర్థికంగా వేధించిందని బాధితుడు ధర్మేంద్ర పేర్కొన్నారు. అషురెడ్డి అవసరాల కోసం తాను పలు బ్యాంకుల నుంచి లోన్‌లు తీసుకుని మరీ ఖర్చు చేశానని తెలిపారు. ఇప్పుడు ఆ లోన్‌లు తీర్చలేక ఇబ్బంది పడుతున్నానని ధర్మేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే, తనపై తిరిగి కేసు పెడతానని లేదా ఆత్మహత్య చేసుకుంటానని అషురెడ్డి బెదిరిస్తోందని ఆయన ఫిర్యాదులో తెలిపారు. తన బాయ్‌ఫ్రెండ్ జయంత్‌తో కలిసి అషురెడ్డి ఈ డ్రామా ఆడిందని, తనను మోసం చేసిందని బాధితుడు వాపోతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అషురెడ్డి కుటుంబంపై పోలీసులు కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నేరానికి పాల్పడటం వంటి సెక్షన్ల కింద నాన్ బెయిలబుల్ కేసు నమోదైంది. అయితే తనపై వస్తున్న ఆరోపణలను అషురెడ్డి తోసిపుచ్చారు. ఈ మేరకు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. కనీసం తన వెర్షన్ తీసుకోకుండానే పోలీసులు ఏకపక్షంగా కేసు నమోదు చేశారని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. తనపై నమోదైన కేసులో వాస్తవం లేదని, కాబట్టి ఆ కేసును వెంటనే కొట్టివేయాలని ఆమె కోర్టును వేడుకున్నారు. ఈ కేసు ఇప్పుడు న్యాయస్థానం పరిధిలో ఉంది. రెండు నెలల క్రితమే ఫిర్యాదు చేసినా, ఇప్పుడు ఈ వ్యవహారం వెలుగులోకి రావడం చర్చనీయాంశమైంది. అషురెడ్డి పిటిషన్‌పై హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



### పార్లమెంటులో ఏం జరుగుతుందో తెలుసుకో!

- కెసిఆర్‌కు ఎంపీ మల్లు రవి చురకలు

**హైదరాబాద్, ఏప్రిల్ 28 (జనంసాక్షి) :** పార్లమెంటులో ఏం జరుగుతుందో తెలుసుకుని మాట్లాడితే బాగుండేదని బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌పై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి మరోసారి మండిపడ్డారు. మంగళవారం హైదరాబాద్‌లో మల్లు రవి విలేకర్లతో మాట్లాడుతూ.. ఫాం హౌస్‌లో ఉండే కేసీఆర్‌కు పార్లమెంట్‌లో ఏం జరుగుతుందో తెలియనట్లు ఉందన్నారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలంటూ కేసీఆర్‌కు ఆయన హితవు పలికారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య క్షమాపణలు చెప్పాలని తాము వెంటనే పార్లమెంట్‌లో డిమాండ్ చేశామని ఈ సందర్భంగా మల్లు రవి గుర్తు చేశారు. అలాగే పార్లమెంట్ బయట కూడా కాంగ్రెస్ ఎంపిలు ఆందోళన చేశారని అన్నారు. ఇవన్నీ బిఆర్ఎస్ నేతలకు తెలియవా అన్నారు. పార్లమెంట్‌లో తేజస్వీ వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించిందన్నారు. కాంగ్రెస్ నేతలపై కేసీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆయన సూచించారు.

## ఇద్దరు పిల్లలకు ఉరేసి.. తానూ బలవన్మరణం



**తొర్రూరు, ఏప్రిల్ 28 (జనం సాక్షి) :** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ శివారులో సోమవారం రాత్రి దారుణ ఘటన చోటుచేసుకుంది. అమ్మాపురం గ్రామానికి చెందిన కిన్నెర గుంశావలి (35) కుటుంబ కలహాల కారణంగా తీవ్ర మనస్థాపానికి గురై, తన ఇద్దరు కుమారులైన విలాష్ (5), వికేష్(3)లకు ఉరివేసి అనంతరం తాను కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. సమాచారం అందుకున్న వెంటనే తొర్రూరు సీఐ గణేష్, ఎస్సై ఉపేందర్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. వ్యవసాయ మార్కెట్ ఎదురుగా ఉన్న కాళీ స్థలంలో వేప చెట్టుకు ముగ్గురూ ఉరివేసుకున్నట్లు గుర్తించారు. పోలీసులు మృతదేహాలను కిందికి దించి పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కుటుంబ కలహాలే ఈ దారుణానికి కారణమై ఉంటాయని పోలీసులు అనుమానిస్తున్నారు.

## తెలంగాణ ఉద్యమం నుండి నేటి వరకు

# ఎన్నారైల పాత్ర మరువలేనిది

### లండన్‌లో మాజీ ఎంపీ సంతోష్ కుమార్




**లండన్ (జనంసాక్షి) :** లండన్ పర్యటనలో ఉన్న మాజీ ఎంపీ మరియు బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జోగినపల్లి సంతోష్ కుమార్ ఎన్నారై బీఆర్ఎస్ యూకే మరియు తెలంగాణ అసోసియేషన్ అఫ్ యునైటెడ్ కింగ్డమ్ (టాక్) సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఎన్నారైల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయం నుండి నేటి వరకు గులాబీ జెండా పట్టుకొని కెసిఆర్ నాయకత్వంలో పని చేస్తూ పార్టీకి, ప్రజలకు ఎన్నో సేవలందిస్తున్న ఎన్నారైల పాత్ర గొప్పదని సంతోష్ కుమార్ ఎన్నారైలను అభినందించారు. గ్లోబల్ గ్రీన్ ఐకాన్ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని, అదే సమయంలో వారికి స్ఫూర్తినిచ్చిన కెసిఆర్‌కు, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో పాల్గొని భాగస్వాములైన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తాను బతికి ఉన్నంత వరకు తన వంతుగా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తానని, ప్రతీ ఒక్కరు రాబోయే తరాలకు మనం మన భూమిని పర్యావరణాన్ని సురక్షితంగా ఆరోగ్యవంతంగా ఉంచేలా పని చేసి బాధ్యతతో ఉండాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఎన్నారై బీఆర్ఎస్ యూకేపై కెసిఆర్‌కు పార్టీ నాయకత్వానికి ప్రత్యేక అభిమానమని ఉద్యమం నుండి పార్టీకి అండగా నిలిచారని, తెలంగాణ కు కెసిఆర్ నాయకత్వమే శ్రీరామా రక్షా అని రానున్న రోజుల్లో మనమంతా మళ్ళీ కష్టపడి పని చేసి కెసిఆర్‌ను ముఖ్యమంత్రి చేసే వరకు ప్రజల పక్షాన పోరాటం చెయ్యాలని తెలిపారు. అన్ని సందర్భాల్లో మొక్కలు నాటుతూ గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో పాల్గొంటున్న ఎన్నారైలకు సంతోష్ కృతజతలు తెలిపారు.

ఎన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎఫ్డీసి మాజీ చైర్మన్ అనిల్ కూర్మాచలం మాట్లాడుతూ కెసిఆర్‌కు, పార్టీ నాయకులకు సమన్వయం చేస్తూ దాదాపు 26 సంవత్సరాలుగా వారి వెంటే ఉంటూ వారిని ప్రత్యేక శ్రద్ధతో జాగ్రత్తగా చూసుకోవేడమే కాకుండా, ప్రత్యేకంగా ఎన్నారై బీఆర్ఎస్ ఆవిర్భావం నుండి నేటి వరకు ఎంతో ప్రోత్సహిస్తూ ముందుకు నడిపిస్తున్న సంతోష్ కుమార్‌కు ఎన్నారైల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. మేమంతా ఎప్పటికీ కెసిఆర్ వెంటే ఉంటామని, ఎప్పటిలాగే అటు సోషల్ మీడియాలో, ప్రత్యక్ష నిరసన కార్యక్రమాల ద్వారా ప్రభుతాన్ని ప్రశ్నిస్తూ ప్రజలకు అండగా ఉంటామని తెలిపారు.

ఎన్నారై బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నారై బీఆర్ఎస్ యూకే పదహారు సంవత్సరాలుగా చేస్తున్న కార్యక్రమాలని సభకు వివరించారు. సంతోష్ ఆధారణ అభిమానం సమన్వయం ఇలాగే ఉండాలని రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తామని, సమయమిచ్చి హాజరైనందున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జోగినపల్లి సంతోష్ కుమార్, ఎన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మరియు ఎఫ్డీసి మాజీ చైర్మన్ అనిల్ కూర్మాచలం, ఎన్నారై బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి, టాక్ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాఘవ, ఎన్నారై బీఆర్ఎస్ యూకే మాజీ అధ్యక్షుడు అశోక్ గౌడ్ దూసరి , టాక్ మాజీ అధ్యక్షురాలు పవిత్ర రెడ్డి, ఇగ్నైట్ మైండ్స్ సంస్థ డైరెక్టర్ కరుణాకర్ రెడ్డి, సిక్కా చంద్రశేఖర్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ, టాక్ సీనియర్ నాయకులు హరి గౌడ్, రవి రేతినేని, రవి పులుసు, సత్య చిలుముల, రమేష్ ఎసెంపెల్లి, గణేష్ కుప్పాల, అబూజర్, సురేష్ బుడగం, శ్రీకాంత్ జెల్లా, మట్టా రెడ్డి,సత్యపాల్ రెడ్డి, సురేష్ గోపతి, ప్రశాంత్ మామిడాల, క్రాంతి, స్వాతి, జాహ్నవి, దివ్య, తరుణ్, అమరేశ్వరి తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370